మెయిన్
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
21-9-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 232 పేజీలు: 10+4 వెల: 6.50



పాక్‌లో ఇమ్రాన్‌ఖాన్ సోదరి అరెస్టు 5
25న హుస్సేన్ సాగర్‌లో మహాగణపతి నిమజ్జనం 6




## రష్యాపై నిప్పులు కురిపించిన ఉక్రెయిన్

**వెయ్యి డ్రోన్లతో అతిపెద్ద దాడి**

**ఆయిల్ రిఫైనరీ ధ్వంసం**

**ముగ్గురు మృతి**

**మాస్కో, సెప్టెంబరు 20:** రష్యాపై ఉక్రెయిన్ అతి పెద్ద దాడికి పాల్పడింది. రష్యా పార్లమెంటరీ ఎన్నికల చివరి రోజున మాస్కోపై డ్రోన్ దాడి జరిగింది. 1000కి పైగా డ్రోన్లలో ఉక్రెయిన్ మాస్కోపై విరుచుకుపడింది. ఈ డ్రోన్ దాడిలో మాస్కోలోని చమురు శుద్ధి కర్మాగారం దెబ్బ తింది. దాడి తర్వాత పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ దాడిలో ముగ్గురు మరణించినట్లు సమాచారం. శనివారం రాత్రి జరిగిన ఈ దాడి రష్యాను గణనీయంగా దెబ్బతీసిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోడిమిర్ జెలెన్స్కీ అన్నారు. రష్యాకు చెందిన ఒక >>2

# నోరు తెరచిన కరవు!



**తెలంగాణ, ఎపి సహా అధికశాతం రాష్ట్రాల్లో అత్యల్ప వర్షపాతం**

**సూపర్ ఎల్‌నినోతో దేశమంతా తగ్గిన ఖరీఫ్ సాగు**

**గత పదేళ్లలో ఎరుగని అనావృష్టి పరిస్థితి**

**వెనక్కి మళ్లిన నైరుతి పవనాలు**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 20:** భారత్ గత 17యేళ్లలో అత్యంత తీవ్రమైన కరవు పరిస్థితులను ఎదుర్కొంటోంది. సూపర్ 'ఎల్ నినో' ప్రభావంతో దేశవ్యాప్తంగా ఈ సీజన్‌లో మొత్తం వర్షపాత లోటు 15 శాతంగా నమోదైంది. అయితే దక్షిణ భారత్‌లో అత్యంత తీవ్రంగా ప్రభావితమై, 28 శాతం లోటును ఎదుర్కొంటోంది. దక్షిణాది రాష్ట్రాలలో, ఆంధ్రప్రదేశ్ అత్యధికంగా 43శాతం లోటుతో అత్యంత దారుణమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఆ తర్వాతి స్థానాల్లో కర్ణాటక (31 శాతం), కేరళ (28 శాతం), తమిళనాడు (22 శాతం), తెలంగాణ (21 శాతం) ఉన్నాయి. భారీ వర్షపాత లోటు ఉన్న ఇతర రాష్ట్రాలలో పంజాబ్ (39 శాతం), బీహార్ (36 శాతం), హర్యానా (22 శాతం), రాజస్థాన్(21శాతం)ఉన్నాయి. తూర్పు, ఈశాన్య ప్రాంతంలో ప్రస్తుతం సగటు వర్షపాతంతో >>2

## నిమజ్జనాలకూ నీటి కటకట

**వాగులు, చెరువుల్లో నీరులేక ఇక్కట్లు**



నీరులేని వాగుల్లో గణేశ నిమజ్జనం దృశ్యం

**హైదరాబాద్, సెప్టెంబరు20, ప్రభాతవార్త:** హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం గణేశ నిమజ్జనం పెద్ద ఎత్తున జరగబోతున్నది. ఈ సారి నీటి వనరుల్లో కనీస మట్టం లేకపోవడంతో >>2



## కీలక ఆర్థిక కేంద్రంగా హైదరాబాద్

**జిడిపి వృద్ధిలో ప్రపంచంలో-15**

**టాప్ 100లో విశాఖ -54**

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** భారత్ ఆర్థిక వ్యవస్థకు హైదరాబాద్, ముంబై, చెన్నై నగరాలు కీలక స్తంభాలుగా ఆవిర్భవించాయి. ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ గ్లోబల్ సిటీస్ ఇండెక్స్-2026ను విడుదల చేసింది. ప్రపంచ వ్యాప్తంగా వెయ్యి నగరాల ఆర్థిక వ్యవస్థ, మానవ వనరులు, జీవన నాణ్యత, పర్యావరణం, పరిపాలన అనే ఐదు విభాగాల్లో అంచనా వేసింది. ఈ నివేదిక ప్రకారం గణనీయమైన వృద్ధి సామర్థ్యం కలిగిన బలమైన పట్టణ ఆర్థిక వ్యవస్థలుగా అభివర్ణించింది. అంచనా వేయబడిన జీడీపీ వృద్ధిలో హైదరాబాద్ ప్రపంచ వ్యాప్తంగా 15వ స్థానంలో నిలిచింది. 2050 నాటికి ఇది ప్రపంచంలోని అతిపెద్ద నగర ఆర్థిక >>2

# 'ఎఫ్టీఎల్'లో ఫామ్‌హౌస్‌లా?

**అజీజ్‌నగర్ సర్వే నం. 76, 177లో భారీ ఫామ్‌హౌస్‌లు ఎలా నిర్మించారు?**

**అసైన్డ్ భూముల్ని హరీష్‌రావు, రోహిత్‌రెడ్డి ఎలా కొనుగోలు చేశారు?**

**బిఆర్‌ఎస్ నేతల ఫామ్‌హౌస్‌లు డ్రగ్స్‌కు అడ్డాలుగా మారాయి: ఎంపి చామల**

**ఆ ప్రాంతాన్ని పరిశీలించిన కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, చామల, అనిల్ పలువురు ఎమ్మెల్యేలు**



ఆదివారం అజీజ్‌నగర్‌లో ఫామ్‌హౌస్ వద్ద మీడియాతో ఎంపిలు మల్లురవి, చామల, అనిల్ తదితర నాయకులు

**మొయినాబాద్ సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:** తెలంగాణలో భూములు, ఫామ్ హౌస్‌ల వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది. రాష్ట్రంలో గత పదేండ్ల పాలనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమీ లేదని అక్రమంగా 400 ఎకరాల భూమిని ఎలా సంపాదించారో ప్రజలకు చెప్పాలని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి డిమాండ్‌చేశారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్ నగర్ రెవెన్యూలో చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు ఎంపీ మల్లు రవి, ఎంపీ అనిల్, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, నవీన్ యాదవ్, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్, తదితర కాంగ్రెస్ నేతలు ఆదివారం మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డిలకు సంబంధించిన ఫామ్‌హౌస్ భూములను సందర్శించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ఎంపీ చమల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. గత పది ఏండ్ల పాలనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అక్రమంగా సంపాదించిన ఆస్తులను ప్రజలకు తెలియజేయాలనే తాము ఇక్కడికి వచ్చామని తెలిపారు. అజీజ్ నగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 76లోని భూమి ఎఫ్టిఎల్ పరిధిలో ఉందని, అక్కడ ఏవిధంగా పెద్ద పెద్ద ఫామ్‌హౌజ్‌లను >>2

**సిఎం బ్రదర్ నివాసమే**

# ఎఫ్టీఎల్‌లో..

**మండలి చైర్మన్, ప్రభుత్వ విప్ నివాసాలు కూడా ఎఫ్టీఎల్ పరిధిలోనే**

**డైవర్షన్ రాజకీయాలు మానుకోండి..**

**సుప్రీం జడ్జితో విచారణకు సిద్ధమా?**

**నిప్పులు చెరిగిన హరీష్‌రావు**



ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

**యాదాద్రి భువనగిరి బ్యూరో, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డైవర్షన్ రాజకీయాలు మానుకోవాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు హితవు పలికారు. ప్రజా సమస్యలు, రైతుల ఇబ్బందులు, సాగునీరు, విద్యుత్ సరఫరా, ఎన్నికల హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉండగా.. వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇతర అంశాలను తెరపైకి తెస్తోందని ఆయన ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరులో ఆదివారం బీఆర్‌ఎస్‌లో పలువురు చేరిన సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడితో పాటు ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, కేవీపీ రామచందర్‌రావుల నివాసాలు ఉన్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. భూవివాదాలు, 22ఏ జాబితా, ధరణి, భూభారతి అంశాలను రాజకీయ విమర్శలకు వేదికగా మార్చకుండా అన్ని విషయాలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం హయాంలో భూములకు సంబంధించిన నిర్ణయాలు, పాలనాపరమైన వ్యవహారాలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఆంధ్రకు నీళ్లు.. తెలంగాణకు కన్నీళ్లు అంటూ సాగునీటి అంశంపై హరీశ్‌రావు ప్రభుత్వాన్ని నిలదీశారు. కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ ప్రయోజనాలను ప్రభుత్వం కాపాడటం లేదని ఆయన >>2

**ఇందిరమ్మ టవర్స్‌కు**

# అలాట్‌మెంట్ లెటర్లు

**నేటి నుంచి జారీ: హౌజింగ్ బోర్డు**

**రాయదుర్గంలో నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి పొంగులేటి**



**హైదరాబాద్,సెప్టెంబరు20,ప్రభాతవార్త:** అన్ని ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ ప్రాజెక్టుల కింద ఎంపికైన లబ్ధిదారులకు సంబంధించిన అలాట్‌మెంట్ లెటర్లు సోమవారం నుండి జారీ చేస్తారు. ఎంపికైన లబ్ధిదారుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు ఎస్‌ఎంఎస్, వాట్సాప్, టిజిహెచ్‌బి వెబ్‌సైట్ ద్వారా అలాట్‌మెంట్ లెటర్లు నేరుగా పంపిస్తామని తెలంగాణ హౌజింగ్ బోర్డు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. అదేవిధంగా, లబ్ధిదారులు తమ అలాట్‌మెంట్ లెటర్లను పొందేందుకు తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉంచుమాని పేర్కొంది. ఈమేరకు ఎంపికైన లబ్ధిదారులు తమ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లతో పాటు టిజిహెచ్‌బి వెబ్‌సైట్‌ను కూడా పరిశీలించవలసి ఉంటుంది. ఇందిరమ్మ ఇండ్లు దరఖాస్తులు, లాటరీ ఎంపికలకు సంబంధించిన ఆన్‌లైన్ సదుపాయాలు ఇప్పటికే టిజిహెచ్‌బి అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. కాగా, సోమవారం శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని రాయదుర్గంలో ఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌కు రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేస్తారు. రాయదుర్గంలో మల్కం చెరువు వెనుక భాగంలో ఉన్న సుమారు 2.85 ఎకరాల ప్రభుత్వ/తెలంగాణ హౌసింగ్ బోర్డు భూమిలో, ఒక్కొక్కటి సుమారు 528 చ.అ. విస్తీర్ణంతో 480 ఫ్లాట్లు నిర్మించడానికి ప్రతిపాదించారు. ప్రతి అర్హత కలిగిన లబ్ధిదారు కేవలం రూ.6.00 లక్షలు మాత్రమే చెల్లించాల్సి ఉండగా, ప్రభుత్వం ఒక్కో ఫ్లాట్‌కు రూ.5.00 లక్షల సబ్సిడీ అందించడంతో పాటు భూమి మొత్తం వ్యయాన్ని కూడా భరిస్తోంది. రాయదుర్గం-నాలెడ్జ్ సిటీ ప్రాంతం హైదరాబాద్‌లో అత్యధిక స్థిరాస్తి విలువలు నమోదవుతున్న ప్రముఖ ప్రాంతాల్లో ఒకటి. ఆగస్టు 2026లో జరిగిన టిజిఐఐసి ఈ-వేలాల్లో, సమీపంలోని 5.25 ఎకరాలు, 5.38 ఎకరాల >>2



దగ్ధమవుతున్న కారు

## డాక్టర్ సజీవ దహనం

**పిల్లలమర్రి సమీపంలో ఘోర ప్రమాదం**

**డివైడర్‌ను ఢీకొట్టి భగ్గుమన్న కారు**

**ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో న్యూరో సర్జన్‌గా ఉన్న డా.కాసకుర్తి జగదీష్ మృతి**

**ఖమ్మం వైద్య విభాగం, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త:** సూర్యాపేట-ఖమ్మం 365బీబీ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. పిల్లలమర్రి సమీపంలో ప్రయాణిస్తున్న వోల్వో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు కారును చుట్టుముట్టడంతో అందులో చిక్కుకున్న వ్యక్తి బయటకు రాలేక సజీవ >>2

**చెవులు చిల్లు..**

# గుండెలు ఘొల్లు..

**గణేశ నిమజ్జనాల్లో డిజె మోతలకు పలుచోట్ల విషాదాలు**

**తెలుగు రాష్ట్రాల్లో రెండు రోజుల్లో గుండెపోటుతో ఐదుగురి మృతి**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు20:** తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల రెండు రోజుల్లో నిమజ్జన కార్యక్రమాలకు సంబంధించిన సందర్భాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. గణేశ్ నిమజ్జనాల్లో డీజే మోతలతో పలు చోట్ల విషాదాన్ని మిగులుస్తున్నాయి. రెండు రోజుల్లో ఐదుగురు మృతి చెందారు. నల్గొండ జిల్లా తిరుమలగిరి మండలంలో శనివారం జరిగిన గణేష్ శోభాయాత్రలో రాము (34) అనే వ్యక్తి డ్యాన్స్ చేశాడు. ఊరేగింపు తన ఇంటి ముందుకు వచ్చిన సమయంలో మెట్లపై కూర్చున్న ఆయన కొద్దిసేపటికే కుప్పకూలారు. కుటుంబ సభ్యులు, స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోనూ శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది. గణేష్ నిమజ్జన ఊరేగింపులో కాకర్లమూడి ఈసు అనే వ్యక్తి ఇతరులతో కలిసి డ్యాన్స్ చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు సమాచారం. కర్నూలు రూరల్ మండలం ఇ.తాండ్రపాడు గ్రామంలో శుక్రవారం శివమ్మ (36) నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు. డ్యాన్స్ చేసిన అనంతరం అస్వస్థతకు గురై కుప్పకూలారు. ఆస్పత్రికి తీసుకెళ్లగా >>2

## స్మృతి ప్రపంచ రికార్డు

**టి-20 క్రికెట్ చరిత్రలో సంచలనం**

**ఆసియా క్రీడల సెమీఫైనల్‌లో అరుదైన ఘనత**

**19 బంతుల్లో 37 పరుగుల మెరుపు ఇన్నింగ్స్** 2





## నేను బహుజనుల బాణాన్ని

**తదుపరి సిఎం నేనే.. కాంగ్రెస్‌ను గద్దె దించాల్సిందే..**

**ప్రజలు ఆశీర్వదిస్తే రేవంత్, కెసిఆర్, మోడీతో పోరాడుతా: టిఆర్‌ఎస్ చీఫ్ కవిత** 7



రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో భారత్ వైమానిక దళం, జపాన్ ఎయిర్ సెల్ఫ్‌డిఫెన్స్ ఫోర్స్ మధ్య ఆదివారం జరిగిన 'వీర్ గార్డియన్2026' ఎయిర్ విన్యాసాలలో పాల్గొన్న ఎయిర్ చీఫ్ మార్షల్ ఎపి సింగ్, జపాన్ జనరల్ టకేహిరో మోరిటా తదితరులు

# స్మృతి ప్రపంచ రికార్డు

## టి-20 క్రికెట్ చరిత్రలో సంచలనం

### ఆసియా క్రీడల సెమీఫైనల్‌లో అరుదైన ఘనత

### 19 బంతుల్లో 37 పరుగుల మెరుపు ఇన్నింగ్స్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 20:** భారత మహిళా క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్, స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన టీ20 క్రికెట్ చరిత్రలో సంచలనం సృష్టించింది. తన కెరీర్‌లో మరో అద్భుతమైన మైలురాయిని అందుకుంది. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో పురుషులు, మహిళల క్రికెట్‌లో కలిపి అత్యధిక పరుగులు సాధించిన క్రీడాకారిణిగా ఆమె ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఆసియా క్రీడల సెమీఫైనల్‌లో బంగ్లాదేశ్ తో జరిగిన మ్యాచ్‌లో ఈ అరుదైన ఘనతను ఆమె సొంతం చేసుకుంది. కొరోగి స్పోర్ట్స్ పార్క్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో మంధాన కేవలం 19 బంతుల్లో 37 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. ఈ క్రమంలో న్యూజిలాండ్ మాజీ క్రీడాకారిణి సూజీ బేట్స్ పేరిట ఉన్న రికార్డును ఆమె అధిగమించింది. ఈ మ్యాచ్‌కు ముందు మంధాన 170 ఇన్నింగ్స్‌లలో 4,751 పరుగులతో రెండో స్థానంలో ఉండగా రికార్డు బ్రేక్ చేయడానికి కేవలం 8 పరుగులు అవసరమయ్యాయి. తన ఇన్నింగ్స్ ఆరంభంలోనే రెండు ఫోర్లు, రెండు సింగిల్స్‌తో ఈ మార్కును సులభంగా దాటేసింది. తాజా రికార్డుతో మంధాన 171 ఇన్నింగ్స్‌లలో 4,788 పరుగులతో అగ్రస్థానానికి చేరుకుంది. ఈ జాబితాలో మంధాన, సూజీ బేట్స్ (4,758) తర్వాత పురుషుల టీ20ల్లో అగ్రగామిగా ఉన్న పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ ఆజం (4,596) మూడో స్థానంలో ఉన్నాడు. వీరి తర్వాత జోస్ బట్లర్ (4,292), భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (4,287) వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో కొనసాగుతున్నారు. ఈ రికార్డుతో మంధాన పురుషుల క్రికెట్‌లోని అగ్రశ్రేణి ఆటగాళ్లను కూడా వెనక్కి నెట్టింది. మూడు ఫార్మాట్లలో కలిపి స్మృతి మంధాన ఇప్పటివరకు మొత్తం 10,964 పరుగులు నమోదు చేశారు.

# రష్యాపై నిప్పులు

## కురిపించిన ఉక్రెయిన్

>> చమురు ఉత్పత్తి కేంద్రం, లాజిస్టిక్ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని దాడికి పాల్పడినట్లు చెప్పారు. ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న యుద్ధానికి ఈ లాజిస్టిక్ కేంద్రాలు కీలకంగా ఉన్నాయి. ఈ ఆపరేషన్‌లో ఎఫ్‌పి-1, ఆర్‌జడ్ 100, ఎంఐసిహెచ్ 2000, పాలియానిట్సియా, వెండెట్టా, లియుటి, బార్స్, ఫ్లెమింగో, సిచెన్, పెలికాన్ వంటి వ్యవస్థలను ఉపయోగించారు. యుద్ధాన్ని ముగించేందుకు శాంతి మార్గాన్ని ఎంచుకోవాలని రష్యాకు జెలెన్స్కీ సూచించారు. ఇంధనం, ఆహార భద్రత రంగాలలో ఉద్రిక్తతల్ని తగ్గించే మార్గాలు ఉన్నాయని, దీనికి రాజకీయ సంకల్పం అవసరమని చెప్పారు. పార్లమెంటరీ ఎన్నికల చివరి రోజు ఈ దాడి జరిగింది. ఈ ఎన్నికలు ఉక్రెయిన్‌పై పుతిన్ సాగిస్తున్న యుద్ధానికి ఓ పరీక్షగా నిలిచాయి. రష్యా ఈ దాడికి ఉక్రెయిన్‌ను నిందించింది. మరోవైపు ఉక్రెయిన్ రష్యా నిర్వహిస్తున్న ఎన్నికల్ని తిరస్కరించింది. ఎన్నికల సమయంలో ఆన్‌లైన్ ఓటింగ్‌పై సైబర్ దాడి ప్రయత్నం జరిగినట్లు రష్యా ఎన్నికల అధికారులు తెలిపారు.

# ఆర్థిక కేంద్రంగా హైదరాబాద్

>> వ్యవస్థలలో ఒకటిగా అవతరించి, మొత్తం ప్రపంచ నగరాల ర్యాంకింగ్‌లో 58వ స్థానానికి చేరుకుంటుందని అంచనా. మానవ వనరులకు సంబంధించిన విభాగంలో టొరంటో, సియోల్, బీజింగ్‌ల కంటే ముందుండి ఢిల్లీ ప్రపంచ వ్యాప్తంగా 13వ స్థానంలో నిలిచింది. అధిక జీడీపీ, విస్తృత కార్పొరేట్ నెట్‌వర్క్‌లు, యూనివర్సిటీలు, వేగంగా విస్తరిస్తున్న శ్రామిక శక్తి వంటివి భారత్‌లోని మహానగరాలు వృద్ధి కేంద్రాలుగా ఆవిర్భవించడానికి దోహదపడ్డాయని నివేదిక వెల్లడించింది. ఢిల్లీ, బెంగుళూరు వంటి మహానగర కేంద్రాలతో పాటు, 10 లక్షల కంటే తక్కువ జనాభా ఉన్న చిన్న నగరాలు, పట్టణాల వృద్ధికి కేవలం జనాభా పెరుగుదలే కాకుండా, పెరుగుతున్న ఉత్పాదకత కూడా కారణమని ఆ నివేదిక పేర్కొంది. ఇక బలమైన ఆర్థిక వృద్ధిని నమోదు చేస్తాయని అంచనా వేయబడిన టాప్ 100 నగరాల్లో విశాఖపట్నం 54వ స్థానంలో నిలిచింది. ఇక వర్ధమాన మహానగరాల జాబితాలో చెన్నై, ఢిల్లీ, హైదరాబాద్, కోల్‌కతా, ముంబై చోటు దక్కించుకున్నాయి. ఈ నివేదికలో చేర్చబడిన వాటిలో హైదరాబాద్‌తో పాటు, విజయవాడ, విశాఖపట్నం ఉన్నాయి.

## ఇందిరమ్మ టవర్స్‌కు అలాట్‌మెంట్ లెటర్లు

>> భూములు ఎకరానికి వరుసగా రూ.264 కోట్లు, రూ.269 కోట్లు చొప్పున, మొత్తం సుమారు రూ.1,386 కోట్లు, రూ.1,447 కోట్లకు అమ్ముడయ్యాయి. ఈ ధరలను కేవలం సూచనాత్మక మార్కెట్ ప్రమాణంగా పరిగణిస్తే, ఇందిరమ్మ ఇండ్లు ప్రాజెక్టు కోసం వినియోగిస్తున్న 2.85 ఎకరాల భూమి విలువ సుమారు రూ.752 కోట్ల నుంచి రూ.767 కోట్ల వరకు ఉంటుంది.

ఇంత విలువైన ప్రధాన ప్రాంతంలో, సాధారణ మార్కెట్‌లో సమానమైన ఫ్లాట్ విలువ సుమారు రూ.50 లక్షలు ఉండే పరిస్థితిలో కూడా, ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారునికి కేవలం రూ.6.00 లక్షల లబ్ధిదారు వాటాతో, అదనంగా రూ.5.00 లక్షల ప్రభుత్వ సబ్సిడీ, ఉచిత భూమితో ఇందిరమ్మ ఇండ్లు ఫ్లాట్‌ను అందిస్తోంది. తద్వారా ప్రధాన ఉపాధి కేంద్రాలు మరియు నగర మౌలిక సదుపాయాలకు సమీపంలో సామాన్య ప్రజలకు అందుబాటు ధరలో గృహ సదుపాయం కల్పిస్తోంది.

రాయదుర్గంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారులు అన్ని అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన సంబంధిత అలాటీలు తమ కుటుంబ సభ్యులతో కలిసి మధ్యాహ్నం 3.30 గంటలకు కార్యక్రమ స్థలానికి చేరుకొని, పెద్ద సంఖ్యలో పాల్గొని శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైస్ చైర్మన్, హౌసింగ్ కమిషనర్ కోరారు.



డాక్టర్ కాసకుర్తి జగదీష్ (ఫైల్)

# డాక్టర్ సజీవ దహనం

>> దహనమయ్యాడు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తిని ఖమ్మంలోని మమత ఆసుపత్రిలో న్యూరో సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ కాసకుర్తి జగదీష్‌గా పోలీసులు గుర్తించారు. ఆయన మృతి చెందిన విషయం తెలియడంతో ఖమ్మం వైద్య వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. పోలీసుల ప్రాథమిక సమాచారం మేరకు.. కారు పిల్లలమర్రి సమీపానికి చేరుకున్న సమయంలో అదుపుతప్పి రహదారి మధ్యలోని డివైడర్‌ను ఢీకొట్టింది. ఢీకొన్న వెంటనే కారులో మంటలు చెలరేగి వేగంగా వ్యాపించాయి. ప్రమాద తీవ్రతకు కారు పూర్తిగా దగ్ధమైంది. కారులో చిక్కుకున్న డాక్టర్ జగదీష్ బయటకు వచ్చే అవకాశం లేకపోవడంతో మంటల్లోనే మృతి చెందినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న సూర్యాపేట రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రూరల్ ఎస్సై అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై వివరాలు సేకరించారు. ప్రమాద సమయంలో కారులో డాక్టర్ జగదీష్ ఒక్కరే ఉన్నారా, మరెవరైనా ప్రయాణించారా అనే అంశంతో పాటు కారు అదుపుతప్పడానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**వైద్య వర్గాల్లో విషాదఛాయలు**

డాక్టర్ కాసకుర్తి జగదీష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారన్న సమాచారం వైద్య వర్గాలను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఊహించని ప్రమాదంలో ఆయన ప్రాణాలు కోల్పోవడంతో సహచర వైద్యులు, ఆసుపత్రి సిబ్బందిలో విషాదం నెలకొంది. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామ, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు, డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ప్రముఖ వైద్య నిపుణులు డా.కంభంపాటి నారాయణరావు,డా. కూరపాటి ప్రదీప్ కుమార్, డా.వేము గంగరాజు, డా.వరికూటి సుబ్బారావు, డా.ఎంఎఫ్ గోపీనాథ్, డా.జీవీ, డా.జి.శ్యామ్‌కుమార్, డా.బాబు రత్నాకర్, ఐఎంఏ బాధ్యులు డా.రెహానాబేగం, డా.యలమంచిలి రవీంద్రనాథ్ ప్రభృతులు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.

## వారం - వర్జ్యం

**21-09-2026, సోమవారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**భాద్రపద మాసం, దక్షిణాయణం,**
**వర్ష ఋతువు, శుక్లపక్షం, ఉత్తర కార్తె,**
తి. దశమి రా.7.58, న.ఉత్తరాషాఢ పూర్తి
వ.మ.1.25 - మ.3.11
దు.మ.12.25 - మ.1.14
2) మ.2.50 - మ.3.39
రాహు.ఉ.7.30-ఉ.9.00. శుభ స. ఉ.8.00 - ఉ.9.00.

## వార్తాఫలం

- **మేషం :** ప్రయోజనాలకు ముప్పువాటిల్లకుండా జాగ్రత్త పడతారు. నూతన ఉద్యోగ అవకాశాలు కలిసి వస్తాయి.
- **వృషభం :** కుటుంబంలోని పెద్దల, వృద్ధుల విషయమై అధిక శ్రద్ధను కనబరుస్తారు. దైవదర్శనం చేసుకుంటారు.
- **మిథునం :** నలుగురిలోనూ ఆకర్షణ బిందువుగా నిలుస్తారు. అనుకూలమైన బదిలీ కోసం చేసే ప్రయత్నాలలో సానుకూలత కనబడుతుంది.
- **కర్కాటకం :** స్నేహితులతో, గురువులతో సఖ్యతగా ఉంటారు. శుభవార్తా శ్రవణం చేస్తారు. వ్యాపారాలు స్తంభిస్తాయి.
- **సింహం :** అనుభవాలను దృష్టిలో ఉంచుకొని కీలక వ్యవహారాలలో ఆచితూచి వ్యవహరిస్తారు. ఆధ్యాత్మిక ప్రసంగాలు ఆకర్షిస్తాయి.
- **కన్య :** ఫార్మా కంపెనీలో పనిచేసేవారికి మంచి అవకాశాలు ఏర్పడతాయి. నిద్రాభంగం ఏర్పడుతుంది. ఓర్పు అవసరం.
- **తుల :** వేదాంత ధోరణిని కనబరుస్తారు. ఉన్నతాధికారులతో చాకచక్యంగా వ్యవహరిస్తారు. నడవడిక వలన లబ్ధిని పొందుతారు.
- **వృశ్చికం :** బంధుమిత్రుల సమాగమనం సంతోషం కలిగిస్తుంది. గృహోపకరణ వస్తువులను కొనుగోలు చేస్తారు.
- **ధనుస్సు :** అంతగా ప్రాధాన్యతలేనటువంటి బాధ్యతను స్వీకరించవలసి వస్తుంది.విందు, వినోద కార్యక్రమాలకు దూరంగా ఉంటారు.
- **మకరం :** వ్యక్తిగత అవసరాలను దృష్టిలో ఉంచుకొని తదనుగుణంగా నడుచుకుంటారు. లలితకళలపట్ల ఆసక్తిని కనబరుస్తారు.
- **కుంభం :** సమస్యలు శ్రుతిని మించి రాగాన పడకుండా జాగ్రత్తలు వహిస్తారు. సాహసోపేతమైన నిర్ణయాలను తీసుకుంటారు.
- **మీనం :** మధ్యవర్తి వ్యవహారాలు, రాయబారాలు, చర్చాగోష్ఠులను సాగిస్తారు. క్షణం తీరిక లేకుండా కాలాన్ని గడుపుతారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# నోరు తెరచిన కరవు!

>> పోలిస్తే 26శాతం లోటు ఉంది. ఇందులో మేఘాలయ (59 శాతం), మణిపూర్ (43 శాతం), అరుణాచల్ ప్రదేశ్ (41 శాతం), అసోం (26 శాతం) అత్యంత తీవ్రంగా ప్రభావితమైన రాష్ట్రాలుగా ఉన్నాయి. రుతుపవనాల రాక ఆలస్యమైనప్పటికీ, జులై 9 నాటికి అవి దేశమంతటా విస్తరించాయి. జులై నెలలో మాత్రమే స్వల్పంగానైనా అదనపు వర్షపాతం నమోదైంది. జూన్‌లో వర్షపాత లోటు 35శాతంగా ఉండగా, ఆగస్టులో 16 శాతం లోటు నమోదైంది. దీని ఫలితంగా, భారతదేశం ఇప్పుడు గత 17యేళ్లలో అత్యంత బలహీనమైన రుతుపవనాలను, అత్యంత విస్తృతమైన కరువు పరిస్థితులను ఎదుర్కొంటోంది. 18శాతం లోటుకు కారణమైన 2009 నాటి కరువు తర్వాత ఇదే అత్యంత తీవ్రమైన సంక్షోభం.

**తగ్గిన సాగు**

ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచి లోటు వర్షపాతం కారణంగా సాగు కూడా దేశవ్యాప్తంగా 24శాతం తగ్గింది. వర్షపాతం 15శాతం లోటు తగ్గడంతో ఆ మేరకు ఖరీఫ్ సాగు కాలాన్ని దెబ్బతీసి, రైతులపై ప్రభావం చూపింది. ఈ సీజన్ తీవ్ర ఆలస్యంతో ప్రారంభమై, జులైలో కొద్దిగా కోలుకుంది.

తదనంతరం, కీలకమైన ఆహార, నూనె, పీచు పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. 2026 సెప్టెంబరు మధ్య నాటికి, మొత్తం ఖరీఫ్ సాగు 109.6 మిలియన్ హెక్టార్లకు చేరుకుంది, ఇది గత సంవత్సరం కంటే సుమారు 1.6 మిలియన్ హెక్టార్లు (1.4 శాతం) తక్కువ. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ సరళిని ప్రభావితం చేసే పసిఫిక్ మహాసముద్రం అసాధారణ వేడెక్కడం అయిన ఎల్ నినో, ఈ వర్షపాత లోటుకు ప్రధాన కారణంగా వెలుగులోకి వచ్చింది. శాస్త్రవేత్తల ప్రకారం, ఈ ఎల్ నినో చరిత్రలో ఇప్పటివరకు నమోదైన అత్యంత తీవ్రమైన వాటిలో ఒకటిగా నిలవనుంది.

**నైరుతి రుతుపవనాలు తిరోగమనం**

దేశవ్యాప్తంగా తీవ్ర కరవు పరిస్థితులు నెలకొన్న తరుణంలో, శనివారం పశ్చిమ రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల నుండి నైరుతి రుతుపవనాలు వెనక్కి తగ్గడం ప్రారంభించాయి. ఇది వర్షాకాలం ముగింపునకు సంకేతం. "సాధారణంగా సెప్టెంబరు 17న జరగాల్సిన ఈ ప్రక్రియకు భిన్నంగా, నైరుతి రుతుపవనాలు శనివారం పశ్చిమ రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల నుండి ఉపసంహరించుకోవడం ప్రారంభించాయి. రాబోయే 3-4 రోజుల్లో రాజస్థాన్‌లోని మరిన్ని ప్రాంతాలు, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాలలోని కొన్ని భాగాల నుండి కూడా ఇవి వెనక్కి తగ్గేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయి, అని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. సాంప్రదాయకంగా, రుతుపవన కాలం సెప్టెంబరు 30తో ముగుస్తుంది, కానీ ఇటీవలి సంవత్సరాలలో, మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా రుతుపవనాల తిరోగమనం ఆలస్యం అవుతోంది. రెండు మూడు రోజుల్లో బంగాళాఖాతంలో ఒక తీవ్ర అల్పపీడనం ఏర్పడి, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ వంటి తీర రాష్ట్రాలకు వర్షాలు కురిపిస్తుందని వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు. కానీ ఇది జాతీయ కాలానుగుణ లోటుపై పెద్దగా ప్రభావం చూపకపోవచ్చు.

# నిమజ్జనాలకూ నీటి కటకట

>> నిమజ్జనానికి ఇక్కట్లు తప్పేలా లేవు. ఈ ఏడాది ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిపోయింది. దీంతో నదిలో ఉండే చిన్న చిన్న మడుగుల్లో సైతం నీరు ఆవిరైంది. నది మొత్తం ఎడారిని తలపిస్తోంది. ఈసారి గణనాథుడు గంగమ్మ ఒడికి చేరేనా? అన్న ప్రశ్న భక్తులను కలవరపాటుకు గురిచేస్తోంది. పూజలందుకునే గణపయ్యలందర్ని ప్రతి సంవత్సరం గోదావరి, మానేరు, కృష్ణ, తుంగభద్ర నదులతోపాటు స్థానిక చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేసేవారు. అలంపూరు నుంచి ఆదిలాబాద్ వరకు తెలంగాణలో వినాయక నిమజ్జనం నీటి జాడలు వెతికే పడుతూ దూరాభారమైన భారీ ఖర్చుకు సిద్ధపడుతున్నారు. చాలామంది నిర్వాహకులు గణపయ్యలను నీటిచెరువులు, గోదావరి, కృష్ణా, మానేరు, తుంగభద్ర, మంజీర నదులకు తీసుకుపోయేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఎల్‌నీనో కారణంగా ఎత్తున ఖర్చు చేసేందుకు సిద్ధమవుతున్నారు. నిజామ్‌సాగర్, ఎస్సారెస్పీ ఆయకట్టులోనే నీటి కటకట ఉంది. బాల్కొండ, ముప్కాల్, మెండోరా కమ్మర్‌పల్లి, మండాలలో చెరువులు లక్ష్మికెనాల్ నుంచి నీటి విడుదల కోసం ఎదరుచూస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా వర్షభావ పరిస్థితి ఉండటంతో చెరువులు వాగులు నిండలేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కుమురంభీం ఆసీఫాబాద్ జిల్లాలో ఈ సంవత్సరం 52 వర్షపురోజులు నమోదైనప్పటికి 918.మి.మి వర్షాపాతం నమోదైనా వాగుల్లో చెరువుల్లో నీరు లేదు. జిల్లా కేంద్రం ఆసిఫాబాద్‌తోపాటు కాగజ్‌నగర్ చెందిన పెద్దవాగులో పెద్ద ఎత్తున నిమజ్జనాలు జరుగుతాయి. మండల కేంద్రాల్లో, గ్రామాల్లో సమీప వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేస్తుంటారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పెద్దవాగులో నీటి మట్టం లేకుండాపోయింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన జలాశయాలు, చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. దక్షిణ తెలంగాణలో కృష్ణా నదికి వచ్చిన కొంత వరదతో జూరాల, సంగంబండ, కోయిలసాగర్ వంటి కొన్నిచోట్ల మాత్రమే నీరు కన్పిస్తోంది. చాలా చోట్ల చెరువులు, కుంటలు నెర్రెలిచ్చాయి. ఏ చెరువుల్లో గణపయ్యలు మునిగేంత నీరు ఉందా లేదా అనేది ఆరా తీస్తున్నారు. కొన్ని చోట్ల చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. వాగుల్లో చుక్కనీరు కనిపించడంలేదు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్తో తయారైన విగ్రహాలను నిమజ్జనం చేయడంతో ఉన్న నీరు సైతం కలుషితమయ్యే ప్రమాదం ఉంది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం చుట్టూ ఉన్న చెరువులు, కుంటల్లో నీరు లేకపోవడంతో వినాయక నిమజ్జనానికి ఇబ్బందులు ఎదురుకాకుండా ప్రభుత్వ యంత్రాంగం కృత్రిమ కుంటలు ఏర్పాటు చేస్తోంది. అడుగు నుంచి ఐదు అడుగుల ఎత్తు కలిగిన విగ్రహాలనే వీటిలో నిమజ్జనం చేయాలని జిల్లా యంత్రాంగం నిర్ధేశించింది. అప్పన్నపల్లి శివారులో గంగోసుకుంట వద్ద, హౌసింగ్బర్డుకాలనీ పరిసరాల్లో, భూత్పూర్ రోడ్డులో పంచవటి పాఠశాల పరిసరాల్లో, కోస్గి రోడ్డులోని చిన్నదర్పల్లి శివారులో, భూత్పూర్, దేవరకద్ర, జడ్చర్ల పురపాలక సంఘాల శివార్లలో కృత్రిమ కుంటలు నిర్మించి విగ్రహాలు మునిగే లోతు వరకు నీటితో నింపుతున్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాలలో నీటి కొరత కారణంగా ఆరు నుంచి 40 అడుగుల విగ్రహాలను నిమజ్జనం చేయడం ఇబ్బందిగా మారింది సాధ్యమైనంతవరకు పెద్దవిగ్రహాలను చిన్నవడ్డెపల్లి చెరువులో నిమజ్జనం చేయాలని నిర్ణయించారు. వర్షాలు పడకపోవడంతో ఉర్సుగుండు, బెస్తం, చిన్నవడ్డెపల్లి, కట్టమల్లన్న తదితర ఉమ్మడి వరంగల్ జిల్లా చెరువులు కుంటలో నీరులేక వెలవెలబోతున్నాయి. కరీంనగర్, జగిత్యాల, జిల్లాలో నిమజ్జనం సజావుగా సాగాలంటే ఎస్సారెస్పీ , ఎంఎండి, నుంచి నీటిని విడుదల చేయాలని గణేష్‌మండపాల నిర్వాహకులు కోరుతున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వేలాది విగ్రహాలను చింతకుంట ఎస్సారెస్పీకాలువ, మానకొండూరు చెరువులో నిమజ్జనం చేయడం రివాజు చింతకుంట కాలువ పూర్తిగా ఎండిపోయింది. జగిత్యాల చింతకుంట చెరువు, కోరుట్లలో అంబెద్కర్‌నగర్ పెద్దవాగువద్ద నీటి లభ్యత తక్కువగా ఉంది. ఖమ్మం జిల్లాకేంద్రంలో మున్నేరు నదిపై చెక్‌డ్యామ్‌ను వరదలు నివారణ కోసం కూల్చివేయడంతో పాతవంతెన వద్ద నీరు లేకపోవడంతో నిజ్జనం ఇబ్బందిగా మారింది.



కెన్‌బెట్వా, మర్ఘుగవాన్, రంజ్ నదుల అనుసంధానం వల్ల ఇళ్లు మునిగిపోవడంతో నష్టపరిహారం చెల్లించాలని మధ్యప్రదేశ్‌లోని పన్నాలో నీటిలో ఉరి ప్రదర్శనతో ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

# సిఎం బ్రదర్ నివాసమే ఎఫ్టీఎల్‌లో..

>> ఆరోపించారు. కృష్ణా, గోదావరి జలాలు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకుని పంటలను కాపాడే చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలని డిమాండ్ చేశారు.

రైతు రాజ్యం పోయి రాక్షస రాజ్యం వచ్చిందని హరీశ్‌రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైతు బీమాపై కూడా ఆయన విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ.. దేవుళ్లపై ప్రమాణాలు చేసి కూడా ప్రజలను మోసం చేశారని రేవంత్‌రెడ్డిపై విమర్శలు గుప్పించారు.

పరిపాలన చేయలేని ప్రభుత్వం అంటూ రేవంత్‌రెడ్డి సర్కారుపై హరీశ్‌రావు తీవ్ర పదజాలంతో విమర్శలు చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కేసులు నమోదు చేసి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అవినీతిపై ప్రశ్నిస్తే కేసులతో అణచివేయాలని చూస్తే.. భవిష్యత్తులో వడ్డీతో సహా మూల్యం చెల్లించుకునే రోజులు వస్తాయని హెచ్చరించారు.

ప్రభుత్వానికి నిజాయితీ, చిత్తశుద్ధి ఉంటే రాజకీయ ఆరోపణలకు పరిమితం కాకుండా అన్ని అంశాలపై సమగ్ర విచారణకు సిద్ధం కావాలని హరీశ్‌రావు సవాల్ విసిరారు. గత ప్రభుత్వ హయాంలోనూ, ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనూ జరిగిన భూముల వ్యవహారాలు, పాలనాపరమైన నిర్ణయాలు, ఆరోపణలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల దృష్టిని మళ్లించే రాజకీయాలకు స్వస్తి పలికి.. రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని హరీశ్‌రావు కోరారు.

# చెవులు చిల్లు.. గుండెలు ఘొల్లు..

>> మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై స్థానికంగా డీజే శబ్దం గురించి చర్చ జరిగినప్పటికీ.. ఆమె మరణానికి అదే ప్రత్యక్ష కారణమని అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. అదే రోజు నంద్యాల జిల్లా డోన్‌లో గణేశ్ గౌడ్ (23) నిమజ్జన వేడుకల్లో పాల్గొని ఇంటికి వెళ్లిన తర్వాత ఛాతిలో నొప్పి వచ్చినట్లు కుటుంబ సభ్యులకు చెప్పారు. ఆస్పత్రికి తరలించేలోపే ఆయన మృతి చెందారు. ఇక ఉమ్మడి అనంతపురం జిల్లాలోనూ ఇలాంటి విషాదమే చోటుచేసుకుంది.

శ్రీ సత్యసాయి జిల్లా సోమందేపల్లిలో శ్రీకాంత్ (35) ఊరేగింపులో పాల్గొంటూ కుప్పకూలారు. అనంతపురం జిల్లా గుత్తిలో అశోక్ కుమార్ (28) వినాయక మండపం వద్ద పాటలకు డ్యాన్స్ చేస్తూ కుప్పకూలినట్లు సమాచారం. ఈ రెండు ఘటనల్లోనూ ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఈ ఘటనలన్నీ దాదాపు ఒకే తరహాలో చోటుచేసుకోవడంతో డీజే శబ్దాలపై చర్చ మొదలైంది. అధిక శబ్దానికి ఎక్కువసేపు గురికావడం ఆరోగ్యానికి హానికరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) స్పష్టం చేస్తోంది.

డబ్ల్యూహెచ్‌ఓ ప్రకారం సగటున 80 డెసిబుల్స్ శబ్దానికి వారానికి 40 గంటల వరకు సురక్షి తంగా వినొచ్చని సూచించింది. శబ్ద తీవ్రత 90 డెసిబుల్స్‌కు చేరితే ఈ సమయం 4 గంటలకు.. 100 డెసిబుల్స్ వద్ద 20 నిమిషాలకు తగ్గుతుంది. శబ్ద తీవ్రత పెరిగే కొద్దీ సురక్షి తమైన ఎక్స్‌పోజర్ సమయం వేగంగా తగ్గుతుంది. డబ్ల్యూహెచ్‌ఓ నిర్వహించే సేఫ్ లిజనింగ్ మార్గదర్శకాల్లో పెద్ద ఈవెంట్లకు సగటు శబ్ద స్థాయిని 100 డెసిబుల్స్‌కు మించకుండా పర్యవేక్షి ంచడం, శబ్దాన్ని కొలిచే పరికరాలు వినియోగించడం, ప్రజలకు వినికిడి రక్షణ కల్పించడం వంటి సూచనలు ఉన్నాయి.

వినాయక చవితి వేడుకల్లో డీజేలు కొత్త విషయం కాదు. యువతకు డ్యాన్స్, భారీ సౌండ్, రంగురంగుల లైట్లు ఇవన్నీ వేడుకల్లో భాగమయ్యాయి. ఒక మండపం కంటే మరో మండపం భారీ సౌండ్‌తో ఉండాలనే పోటీ కూడా కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తోంది. వినాయక నిమజ్జనం అంటే ఒక ఉత్సవానికి ముగింపు మాత్రమే కాదు.. కుటుంబం మొత్తం కలిసి పాల్గొనే ఆధ్యాత్మిక కార్యక్రమం. అందులో పిల్లలు, మహిళలు, వృద్ధులు, యువత.. అన్ని వర్గాలవారు ఉంటారు. అందుకే నిర్వాహకులు శబ్ద తీవ్రత, డ్యాన్స్ చేస్తున్న వారి ఆరోగ్య పరిస్థితి, గుంపుల నియంత్రణ, అత్యవసర వైద్య సదుపాయాలు వంటి అంశాలపై ముందుగానే దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

ఈ పరిణామాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును కొందరు యువకులు కలిసి నిమజ్జనాల్లో డీజేలకు అనుమతి ఇవ్వాలని కోరినట్లు సమాచారం.

అయితే తన నియోజకవర్గ పరిధిలో వినాయక నిమజ్జనాలకు డీజే సౌండ్స్‌కు అనుమతి ఇవ్వబోమని ఆయన స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. డీజే శబ్దాల నేపథ్యంలో చోటుచేసుకుంటున్న విషాద ఘటనలను ప్రస్తావిస్తూ ఆయన ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. డీజేలు లేకుండానే నిమజ్జన వేడుకలు నిర్వహించేందుకు యువకులు అంగీకరించినట్లు తెలుస్తోంది.

# 'ఎఫ్టీఎల్'లో ఫామ్‌హౌస్‌లా?

>> నిర్మించారని ప్రశ్నించారు. ఉద్యమ సమయంలో చెప్పులు లేకుండా నడిచామన్న వారికి ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయని ఆయన ప్రశ్నించారు. పేదలకు అందాల్సిన భూములను అధికార బలంతో ఆక్రమించుకున్నారని, 2004 ఎన్నికల అఫిడవిట్‌లో లేని ఆస్తులు ఇప్పుడు ఎలా వచ్చాయన్నారు. గత పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలో ఎన్ని అక్రమాలు జరిగాయో ప్రజలకు తెలియజేసేందుకే క్షేత్రస్థాయిలో పర్యటన చేపట్టినట్లు ఆయన వివరించారు. సర్వే నంబర్ 76లో హరీష్ రావు ఇన్ని ఆస్తులు కొనడానికి డబ్బులు ఎక్కడినుండి వచ్చాయి..? ఎలా సంపాదించారు..? అసైన్డ్ భూములను ఏ విధంగా కొంటారు..? అక్రమంగా సంపాదించిన ఆస్తుల వివరాలను ప్రజలకు తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు. డ్రగ్స్‌కు అడ్డాగా తెలంగాణని మారుస్తున్నారని, బీఆర్‌ఎస్ నాయకులకు ఒక్కొక్కరికి రెండు లేదా మూడు ఫామ్‌హౌస్‌లు ఉన్నాయని, అందులో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. అజీజ్ నగర్ రెవెన్యూలోని సర్వే నంబర్ 177లో గతంలో పేదల కోసం కేటాయించిన అసైన్డ్ భూమిని కొనుగోలు చేసి పెద్ద ఫామ్‌హౌస్ నిర్మించి, డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారని ఆయన ఆరోపించారు. ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ పార్టీలే కాకుండా డ్రగ్స్ సరఫరా కూడా జరుగుతున్నాయని అనుమానం వ్యక్తం చేశారు. గతంలో రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారాలతో రూ.100 కోట్లు దొరికిన సంఘటనలు కూడా న్నాయని తెలిపారు. ఈ ఫామ్‌హౌస్ గతంలో జరిగిన డ్రగ్స్ పార్టీలో కాల్పులకు కూడా తెగబడ్డారని, బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకుల ఫామ్‌హౌస్‌లల్లో రేవ్ పార్టీలు కూడా జరుగుతున్న ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. బలిదానాలతో తెచ్చుకున్న తెలంగాణలో ఫామ్‌హౌస్ కల్చర్ తీసుకువచ్చి ప్రజలను ఏమి చేద్దామనుకుంటున్నారని ఆయన అన్నారు. రోహిత్ రెడ్డి జీవో 111 కు వ్యతిరేకంగా అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ యంత్రాంగం ఎందుకు నిలిపివేయలేదని, అసైన్డ్ భూమిని ఏ విధంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు? ప్రశ్నించారు. అసైన్ భూ చట్టాన్ని ఉల్లంఘించారని ఆయన ఆరోపించారు.

## వరంగల్ ఎయిర్‌పోర్ట్‌పై సందీప్‌రెడ్డి, సిఎం రేవంత్ ట్వీట్లు

**హైదరాబాద్,సెప్టెంబరు20,ప్రభాతవార్త:** వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టుకు పేరు పెట్టే అంశం ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తికరంగా మారింది. ఈ కొత్త ఎయిర్‌పోర్టుకు పేరు సూచించాలంటూ సిఎం రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా కోరగా... దానికి టాలీవుడ్ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా స్పందించారు. సందీప్‌రెడ్డి తన సొంత ప్రాంతమైన వరంగల్‌లో విమానాశ్రయం ఏర్పాటవుతుండటంపై సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం వరంగల్ ఎయిర్‌పోర్టుకు రుద్రమ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్(ఆర్ఐఏ), కాకతీయ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్(కెఐఏ) అంటూ పేర్లను సూచించారు. వరంగల్ చారిత్రక నేపథ్యాన్ని ప్రతిబింబించేలా ఎయిర్‌పోర్ట్ పేరు ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టు ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్న సిఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. దీంతో సందీప్‌రెడ్డి వంగా ట్వీట్‌కు సిఎం రేవంత్‌రెడ్డి దట్స్ ది స్పిరిట్ అంటూ స్పందించారు. ప్రస్తుతం రెబల్‌స్టార్ ప్రభాస్‌తో సందీప్‌రెడ్డి వంగా 'స్పిరిట్' సినిమా తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. దీంతో సిఎం రిప్లైలో 'స్పిరిట్' అనే పదం ఉండటం నెటిజన్లను ఒక్కసారిగా ఆకర్షించింది.



## కారు డోర్లు లాక్.. చిన్నారి మృతి

### వినోబానగర్‌లో విషాదం

**జూలూరుపాడు ప్రభాతవార్త, సెప్టెంబరు 20:** తెలిసీతెలియని వయసు.. బుడిబుడి అడుగులు.. ఆడుకుంటూ, నవ్వుతూ ఇంటిల్లిపాదిని సందడితో నింపాల్సిన నాలుగేళ్ల చిన్నారి తన్విత అనంతలోకాలకు వెళ్లిపోయింది. కారు డోర్లు లాక్ కావడంతో చిన్నారి మృతి చెందిన విషాద ఘటన మండల పరిధిలోని వినోబానగర్‌లో ఆదివారం తీవ్రవిషాదాన్ని నింపింది. గ్రామ పంచాయతీ సర్పంచ్ గంగావత్ నవీన్-ఐశ్వర్య దంపతుల పెద్ద కుమార్తె తన్విత మృతి కుటుంబసభ్యులను కన్నీరుమున్నీరూ చేసింది. విషయం గుర్తించి కుటుంబసభ్యులు ఆందోళనకు గురై చిన్నారిని బయటకు తీసి, హుటాహుటిన ఆసుపత్రికి తీసుకెళ్లి కాపాడుకునేందుకు ప్రయత్నించినప్పటికీ విషాదం తప్పలేదు.

**వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సంతాపం**

చిన్నారి మృతి చెందిన విషయం తెలుసుకున్న వైరా నియోజకవర్గ శాసన సభ్యుడు మాలోతు రాందాస్‌నాయక్ హుటాహుటిన గ్రామానికి వెళ్లి చిన్నారి మృతదేహాన్ని సందర్శించి చలించిపోయారు. సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## కేంద్ర మాజీమంత్రి కల్రాజ్‌మిశ్రా సతీమణి మృతికి గవర్నర్ శివప్రతాప్‌శుక్లా సంతాపం

**హైదరాబాద్,సెప్టెంబరు20,ప్రభాతవార్త:** మాజీ గవర్నర్, మాజీ కేంద్రమంత్రి కల్రాజ్ మిశ్రా సతీమణి సత్యవతి మిశ్రా మృతికి రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా సంతాపం తెలిపారు. ఆదివారం ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో కల్రాజ్ మిశ్రా నివాసానికి వెళ్లిన గవర్నర్, సత్యవతి మిశ్రా చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కల్రాజ్ మిశ్రా, కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సత్యవతి మిశ్రా ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబసభ్యులకు ఈ అపారమైన విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించినట్లు గవర్నర్ తెలిపారు.

## వడివడిగా ఆదిలాబాద్ విమానాశ్రయం పనులు

### కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి హర్షం

**హైదరాబాద్,సెప్టెంబరు20,ప్రభాతవార్త:** ఉత్తర తెలంగాణ ప్రాంతంలో ఎయిర్‌ఫోర్స్ ట్రైనింగ్ సెంటర్, జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ (జెయుఏ) నిర్మాణ ప్రాజెక్టును వేగవంతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రక్షణ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖలు రెండూ ఈ ప్రాజెక్టు సమన్వయం కోసం నోడల్ అధికారులను నియమించడం పట్ల కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అంతేకాకుండా, ఈ ప్రాజెక్టు పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు తెలంగాణ ప్రభుత్వం కూడా తక్షణమే ఒక నోడల్ అధికారిని నియమించాలని ఆయన సూచించారు. ఈ ప్రాజెక్ట్ కింద రక్షణ శాఖ ఆధ్వర్యంలో ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, విజిటింగ్ ఎయిర్‌క్రాఫ్ట్ పార్కింగ్ డిస్పర్సల్స్, వెదర్ షెల్టర్లు, ఎయిర్‌క్రాఫ్ట్ హ్యాంగర్లు, ఆపరేషనల్ కాంప్లెక్స్ నిర్మిస్తారు. అంతేకాక, రక్షణ సిబ్బందికి కావాల్సిన శిక్షణ కేంద్రాలు, మెయింటెనెన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేస్తారు. డిఫెన్స్ సిబ్బంది కోసం సింగిల్, మ్యారీడ్ అకామడేషన్ క్వార్టర్లు, క్రీడలు, వినోద రంగానికి సంబంధించిన మౌలిక వసతులు కల్పించబోతున్నారు. ఇక పౌర విమానయాన శాఖ ఆధ్వర్యంలో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) నేతృత్వంలో పౌర విమానాల రాకపోకలకు అనుగుణంగా సివిల్ టెర్మినల్ ఏర్పాటు చేస్తారు. విమానాల నిర్వహణ కోసం మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ (ఎంఆర్ఓ) సదుపాయం అభివృద్ధి చేయబోతున్నారు. ప్రాజెక్టుకు అవసరమైన నీటి సరఫరా, పారిశుద్ధ్యం, ఇతర ప్రత్యేక ఇంజినీరింగ్ వ్యవస్థల నిర్మాణాలు చేపడతారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సంబంధిత మంత్రిత్వ శాఖల మధ్య సమర్థవంతమైన సమన్వయం కుదిరితే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం వేగవంతమై, ప్రాంతీయ రవాణా, రక్షణ వ్యవస్థలకు పెద్ద పీట వేసినట్లవుతుందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

ఆదిలాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటుపై తాను, ఇతర కేంద్ర మంత్రులు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే చర్చలు జరిపినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర పౌర విమానయాన శాఖ, రక్షణ శాఖల నుంచి నోడల్ అధికారులను నియమించనున్నట్లు చెప్పారు. మూడు శాఖల మధ్య సమన్వయం పెంచడం ద్వారా భూసేకరణ, ప్రణాళిక, అనుమతులు, నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియలను వేగంగా ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉంది. రక్షణ అవసరాలతో పాటు సాధారణ ప్రయాణికులకు విమాన సదుపాయం అందుబాటులోకి వస్తే ఆదిలాబాద్ ప్రాంతానికి మెరుగైన విమాన కనెక్టివిటీ ఏర్పడే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఉత్తర తెలంగాణలో విమానయాన సదుపాయాల పరంగా పరిమిత అవకాశాలు ఉండటంతో హైదరాబాద్, పొరుగు రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఆదిలాబాద్‌లో పౌర విమాన సేవలు అందుబాటులోకి వస్తే వ్యాపార, పారిశ్రామిక, విద్య, వైద్య, పర్యాటక రంగాలకు ప్రయాణ సౌకర్యం మెరుగయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా వరంగల్‌లో ప్రతిపాదించిన విమానాశ్రయానికి సంబంధించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారీ కొనసాగుతోందని కిషన్‌రెడ్డి తెలిపారు. విమానాశ్రయంలో నిర్మించాల్సిన భవనాల లేఅవుట్ తుది దశకు చేరుకుందని చెప్పారు.

## వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద భారీ అగ్నిప్రమాదం

### రైతు బీమా, భరోసా దరఖాస్తులు, పరికరాలు ధ్వంసం

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా జోగిపేటలోని వ్యవసాయ శాఖ కార్యాలయ ప్రాంగణంలో రాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంటలను గమనించిన న్యాబాబా కాలనీ వాసులు వెంటనే అగ్నిమాపక, పోలీసు సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. గోదాముకు తాళం వేసి ఉండటం, మంటల వద్దకు నేరుగా చేరుకోవడం సాధ్యం కాకపోవడంతో, అగ్నిమాపక సిబ్బంది జేసీబీని ఉపయోగించి గోడలోని కొంతభాగాన్ని పగలగొట్టి ప్రాంగణంలోకి ప్రవేశించారు. అనంతరం మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. రాయితీ పథకాల కింద అందించిన వ్యవసాయ పరికరాలతోపాటు, రైతు బీమా, రైతు భరోసా దరఖాస్తులు, ఇతర అధికారిక రికార్డులు అగ్నిప్రమాదంలో ధ్వంసమైనట్లు సమాచారం. అగ్నిప్రమాదానికి గల కచ్చితమైన కారణాన్ని తెలుసుకునేం దుకు జోగిపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## తనఖా పెట్టిన సరకును అమ్మేసిన పిసిహెచ్ డైరెక్టర్లు

### తెలంగాణ, ఒడిశాలో సిబిఐ సోదాలు

## పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.48.48 కోట్ల టోకరా

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ప్రభుత్వ రంగ సంస్థ పిసిహెచ్ కార్పొరేషన్ లిమిటెడ్ పంజా బ్ నేషనల్ బ్యాంకుకు 48.48 కోట్ల రూపాయల టోకరా వేసింది. దీనిపై చెన్నైకి చెందిన పంజాబ్ నేషనల్ బ్యాంకు అధికారులు ఇచ్చిన ఫిర్యా దు మేరకు బెంగళూరు సిబిఐ విభాగం అధికారులు కేసు నమోదు చేసి తెలంగాణ, ఒడిషా రాష్ట్రాలలో గల పిసిహెచ్ కార్పొరేషన్ డైరెక్టర్ల ఇళ్లు, కార్యాలయాలలో శనివారం రాత్రి పొద్దుపోయే వరకు సోదాలు జరిపారు. పిసిహెచ్ కార్పొరేషన్ సంస్థ ఎలక్ట్రానిక్స్ వస్తువులతోపాటు పలు రకాల వస్తువులను వినియోగదారులకు అందజేస్తుంటుంది. హైదరాబాద్ శివార్లలోని ఘట్‌కేసర్ కేంద్రంగా ఈ సంస్థ 17 ఏళ్లుగా పనిచేస్తుంది. ఈ సంస్థకు దేశ వ్యాప్తంగా పలుచోట్ల అనుబంధ శాఖలు వున్నాయి. కొన్ని నెలల క్రితం ఈ సంస్థ తమ వద్ద వున్న వస్తువులను బ్యాంకు లో తనఖా పెట్టి వ్యాపార అవసరాల కోసం 48.48 కోట్ల రూపాయల రుణం తీసుకుంది. అయితే తీసుకున్న రుణం కిస్తులు చెల్లించక పోగా వడ్డీ కూడా చెల్లించకుండా వుండడంతో బ్యాంకు అధికారులకు అనుమానం వచ్చి సంస్థ కార్యాలయంలో సోదాలు జరిపారు. ఈ సందర్భంగా బ్యాం కులో తనఖా పెట్టిన వస్తువుల గురించి ఆరా తీయగా అవి కనిపించలేదు. దీనిపై విచారించగా వాటిని పిసిహెచ్ కార్పొరేషన్ డైరెక్టర్లు కొందరు బ్యాంకుకు తెలియకుండా అమ్మేసి సొమ్ము చేసుకున్నారని తేలింది. బ్యాంకుకు తనఖా పెట్టిన సరుకును అమ్మేసిన తరువాత దానికి సంబంధి చిన డబ్బులను బ్యాంకు ఖాతాలో జమా చేయాల్సి వుండగా పిసిహెచ్ కార్పొరేషన్ డైరెక్టర్లు అలా చేయలేదు. దీనిపై బ్యాంకు అధికారుల ఫిర్యా దు మేరకు పిసిహెచ్ కార్పొరేషన్ డైరెక్టర్లపై మోసపూరిత కుట్ర, ఫోర్జరీ, నమ్మక ద్రోహం, నిధుల దుర్వినియోగం వంటి అభియోగాలపై కేసు నమోదు చేసింది. సిబిఐ అధికారులు కేసు నమోదు చేసి తెలంగాణ, ఒడిషాలో గల పిసిహెచ్ కార్పొరేషన్ డైరెక్టర్ల ఇళ్లు కార్యాలయాలలో సో దాలు జరిపి కీలక పత్రాలను జప్తు చేశారు. ఈ కేసులో సిబిఐ కొందరు డైరెక్టర్లను అరెస్టు చేసే వీలుందని వార్తలు వస్తున్నాయి.

## విద్యుత్ పంపిణీ నష్టాలకు చెక్

### ఓపెన్ యాక్సిలరీ చార్జీల హేతుబద్ధీకరణ

### గ్రీన్ హైడ్రోజన్‌కు ఇన్సెంటివ్‌లు

### లైసెన్స్ అవసరం లేకుండా ట్రాన్స్‌మిషన్లు

### వినియోగదారులకు మెరుగైన సేవలు

### కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ చర్యలు

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** విద్యుత్ రంగాన్ని సంస్కరించే లక్ష్యంతో కేంద్రం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా విద్యుత్ పంపిణీ సంస్థల నష్టాలను తగ్గించడంతో పాటు, ఓపెన్ యాక్సెస్ చార్జీల హేతుబద్ధీకరణ, వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. ప్రధానంగా గ్రీన్ హైడ్రోజన్ తదితర వాటితో విద్యుత్ ఉత్పత్తి చేపట్టే వాటికి ఇంధన ఇంటెన్సిటివ్‌ను ఇవ్వడంతోపాటు, పరిశ్రమలకు వ్యాపారాన్ని సులభతరం చేస్తోంది. ఇదే సమయంలో ఇంధన పరివర్తన మరియు భద్రతను పెంచేలక్ష్యంతో విద్యుత్ మంత్రిత్వ శాఖ అవసరమైన చర్యలు చేపట్టింది. ఈ నిబంధనలు, విద్యుత్ పరివర్తన మరియు భద్రతను పెంపొందించే విస్తృత వ్యూహంలో భాగంగా, పంపిణీ కంపెనీల నష్టాలను తగ్గించేందుకు దోహద పడతాయని మంత్రిత్వ శాఖలోని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ఇప్పటికే చేపట్టిన చర్యల కారణంగా 2014లో 27 శాతం ఉన్న పంపిణీ నష్టాలు 2022-23 కాలంలో 15.41కి గణనీయంగా తగ్గించడంలో సహాయపడ్డాయి.

కొత్త నిబంధనల ప్రకారం, ఇంటర్‌స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టంలో 25 ఐదు మెగావాట్ల కంటే తక్కువ లోడ్ కలిగిన వినియోగదారులు మరియు ఎనర్జీ స్టోరేజి సిస్టం పదిమెగా వాట్లను ఇప్పుడు స్థాపించుకోవడమే కాకుండా వాటిని నిర్వహించుకునే వీలును కల్పిస్తోంది. లైసెన్స్ అవసరం లేకుండా ట్రాన్స్మిషన్లు. ఇప్పటికే ఉత్పత్తిచేసే కంపెనీలు తదితర వాటికి అందుబాటులోకి తెస్తోంది. ఇది మరింత సరసమైన విద్యుత్‌తో పాటు, మెరుగైన గ్రిడ్ విశ్వసనీయత నుండి ప్రయోజనం పొందగలదని భావిస్తోంది. ఫలితంగా విద్యుత్ పంపిణీ నష్టాలను మరింత తగ్గించి, వాటి సాధ్యతను పెంచు తాయని అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా వినియోగదారులకు మరిన్ని మెరుగైన సేవలను అందించడానికి దారితీస్తుందని అన్నారు. పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేయడానికి, ఉద్యోగాల సృష్టిని పెంచడానికి మరియు పునరుత్పాదక శక్తిని స్వీకరించడాన్ని వేగవంతం చేయడానికి, తద్వారా ఉద్గారాలను తగ్గించడానికి ఈ మార్పుల సామర్థ్యాన్ని కూడా ఆయన నొక్కి చెప్పారు. కొత్త నిబంధనలలోని మరో కీలక అంశం ఓపెన్‌యాక్సస్‌రీ ఛార్జీల హేతుబద్ధీకరణ చేపటుతోంది. కొన్ని రాష్ట్ర నియంత్రణ కమిషన్లు విధించిన అధిక ఛార్జీలు గతంలో వినియోగదారులచే ఓపెన్‌యాక్సస్‌లరీలను సమర్థవంతంగా ఉపయోగించడాన్ని అడ్డుకున్నాయి. సవరించిన నియమాలు దేశవ్యాప్తంగా ఈ ఛార్జీలను మరింత సహేతుకమైన మరియు ఏకరీతిగా ఉండేలా చేయడం, వాణిజ్య సంస్థలు మరియు పరిశ్రమలు పోటీ ధరలకు విద్యుత్తు పొందేందుకు వీలుకల్పిస్తాయని అంటున్నారు. అదనంగా, నియమాలు ఖర్చు ప్రతిబింబించే టారిఫ్లను తప్పనిసరి చేయడం ద్వారా విద్యుత్ రంగం ఆర్థిక స్థిరత్వాన్ని సూచిస్తాయని స్పష్టం చేస్తున్నారు. ఆమోదించబడిన వార్షిక రాబడి అవసరాలు మరియు ఆమోదించబడిన టారిఫ్ల నుండి అంచనా వేయబడిన వార్షిక రాబడి మధ్య ఏదైనా అంతరం సహజ వైపరీత్యాల వంటి అసాధారణ పరిస్థితులలో మినహా కనిష్టంగా ఉంచబడుతుందని వారు నిర్ధారిస్తారు. ప్రస్తుతం ఉన్న ఆదాయ అంతరాలను సకాలంలో పరిసమాప్తి చేయడానికి నిబంధనలు ఫ్రేమ్వర్కును కూడా అందిస్తాయి.

## డ్రగ్స్ వ్యసనపరులను సాధారణ పౌరులుగా మార్చిన ఈగల్

### పునరావాస కేంద్రంలో కఠిన పరిస్థితుల్లో గడిపిన మాదకద్రవ్యాల బాధితులు

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మాదకద్రవ్యాలను సమూలంగా నిర్మూలించేందుకు ఏర్పాటైన ఈగల్ ఓవైపు నేరగాళ్ల భ రతం పడుతూనే మరోవైపు డ్రగ్స్ బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించి వారిని సాధారణ పౌరులుగా మార్చడంలో సఫలమవుతోంది. ఇప్పటి వరకు వెయ్యి మంది వరకు డ్రగ్స్ బాధితులను పునరావాస కేంద్రాలలో నెల రోజుల పాటు వుంచి వారిని సాధారణ వ్యక్తులుగా మార్చ గా ఈ జాబితాలో తాజాగా మరో 27 మంది చేరారు. వీరంతా జంట నగరాలు, శివారు ప్రాంతాలలో డ్రగ్స్ సేవిస్తూ పట్టుబడ్డవారు. వీరిలో కాలేజి కుర్రాళ్లతో పాటు యువకులు ఉద్యోగులు కూడా వున్నారు. మాదకద్రవ్యాల వ్యసనపరుల భరతం పట్టేందుకు ఈగల్ పోలీసులు ఎంపిక చేసిన ప్రాంతాలలో వారంలో నాలుగు రోజుల పాటు దాడులు నిర్వహిస్తుండడం తెలిసిందే. కాలేజీలు, ఐటి కంపెనీల సమీపంలోని పార్కులు, పబ్లిక్ గార్డెన్స్, వైద్య కళాశాలల సమీపంలోని కొన్ని ప్రాంతాలు, బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లు ఈగల్ టార్గెట్‌లో వున్నాయి. ఈ ప్రాంతాలలో త రచూ డ్రగ్స్ బాధితులు పట్టుబడుతుండడం అధికారులనే షాక్‌కు గురిచేస్తోంది. పట్టుబడ్డ వారిని వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలిం గ్ ఇవ్వడంతో పాటు నెల రోజుల పాటు వైద్యుల సమక్షంలో పునరావాస కేంద్రంలో వుంచుతున్నారు. ఈ సమయంలో వారి మానసిక ప్రవర్తనను ఈగల్ పోలీసులు, వైద్యులు గమనిస్తారు. యోగా, మెడిటేషన్ చేయించడంతో పాటు ఆరోగ్య సూత్రాలు పాటించేలా చేస్తారు. సమయానికి భోజనం అంది స్తారు. వారంలో ఒకసారి డ్రగ్స్ పరీక్షలు చేస్తూ అంతా సాఫీగా వుందో...? లేదో...? చూస్తారు. నెల రోజుల తరువాత బాధితులు సాధారణ స్థితికి చేరుకోగానే వారి కుటుంబ సభ్యులకు అప్పగించి భవిష్యత్తులో ఎలా వుండాలో చెబుతారు. పునరవాస కేంద్రాలలో వుండే బాధితులపై బయటకు వచ్చిన తరువాత కొన్ని రోజుల పాటు నిఘా ఉంచుతారు.

## రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో కురిసిన వర్షం

### అత్యధికంగా కొల్లాపూర్‌లో 144.6 మిల్లీమీటర్ల నమోదు

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. రాష్ట్రంలోని ఆసిఫాబాద్, గద్వాల, ములుగు, నాగర్‌కర్నూలు, కామారెడ్డి, కొత్తగూడెం, వనపర్తి తదితర జిల్లాల్లో వర్షం కురిసింది. రాష్ట్రంలోనే అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో 144.6 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డయింది. ఇదే సమయంలో రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా కొణిజెర్లలో 39.6 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదైంది. గద్వాల పట్టణంతో పాటు గద్వాల మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం తెల్లవారు జాము నుంచే చిరుజల్లు కురుస్తున్నాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలోని చద్మల్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ ఆలయం పిడుగుపాటుకు గురైంది. ఆదివారం మధ్యాహ్నం గాంధారి మండల కేంద్రంలో భారీ మెరుపులు ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో ఆలయ గోపురం పై పిడుగు పడడంతో గోపురం పై పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ సమాచారం అందుకున్న గిరిజనులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఈ విషయమై సంబంధిత పూజారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఒక మోస్తరు వర్షం కురిసింది. దాదాపు గంటపాటు కురిసిన వర్షంతో రోడ్ల పై వర్షపు నీరు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా జాతీయ రహదారి 363 పై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్హెచ్-363తో పాటు సర్వీస్ రోడ్డు పై కూడా వర్షపు నీరు నిలిచిపోయింది. కాగా గడచిన 24 గంటల్లో రాష్ట్రంలోని ములుగు జిల్లా వ్యాప్తంగా సగటున 24.8 మిల్లీమీటర్ల వర్షపాతం చోటు చేసుకుంది. అలాగే నాగర్‌కర్నూల్ జిల్లా 23.3 మిల్లీమీటర్లు, వనపర్తి జిల్లా 23.1 మిల్లీమీటర్లు నమోదైంది. అలాగే నారాయణ్‌పేట్, కొత్తగూడెం, జగిత్యాల, రంగారెడ్డి జిల్లాల్లో చెదురుమదురు జల్లులు పడ్డాయి.

## తగ్గుతున్న పగటి వేళలు.. పెరుగుతున్న రాత్రులు

### మొదలైన దక్షిణాయనకాల రెండో దశ

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** దక్షిణాయన కాలం రెండవ దశ మొదలడంతో దేశ వ్యాప్తంగా పగటి వేళలు క్రమేపి తగ్గుతుండగా రాత్రి సమయం పెరగసాగింది. ఆగస్టు 31వ తేదీ వరకు సూర్యోదయం, సూర్యాస్తమయం వేళలు హెచ్చుగా వుండగా సెప్టెంబరు మొదటి వా రం నుంచి సూర్యోదయం ఆలస్యంగా ప్రారంభమవుతుండగా సూర్యాస్తమయం ముందుగానే జరుగుతోంది. దీనిని అయనకాలంగానూ దక్షిణాయన రెండవ దశ ప్రారంభంగాను చెబుతారు. వాస్తవానికి జూలై 16వ తేదీనే ఉత్తరాయన పుణ్యకాలం ముగిసి దక్షిణాయనం ప్రారంభం అయి ్యంది. అయితే మొదటి దశలో అంటే ఆగస్టు నెలాఖరు వరకు కాస్త అటుఇటుగా వేసవి కాలంలో వుండే వేళలే వుంటాయి. అయితే సెప్టెంబరు మొదటి వారం నుంచి ఈ వేళలు మారిపోతుంటాయి. ఈ నెల ఒకటవ తేదీన సూర్యోదయం ఉదయం 6.04 గంటలు కాగా సూర్యాస్తమయం సాయంత్రం 6.26 గంటలు. అంతకు ఒక్కరోజు ముందు అంటే ఆగస్టు 31వ తేదీన సూర్యాస్తమయ సమయం సాయంత్రం 6.30 గంటలు.

ఆదివారం నాడు సూర్యోదయం ఉదయం ఆరు గంటల ఐదు నిమిషాలుగా వుండగా సూర్యాస్తమయం సాయంత్రం ఆరు గంటల 14 నిమిషాలు. వచ్చే అక్టోబరు మొదటి వారం నుంచి ఈ సమయంలో మరిన్ని మార్పులు వస్తాయి. అక్టోబరు నెలాఖరుకు సూర్యాస్తమయం సాయంత్రం 5.50 గంటల నుంచి 6.00 గంటలలోపు వుంటుంది. దీని తరువాత పది నిమిషాల నుంచి పావుగంట వ్యవధిలో చీకటి పడుతుంది. వేసవి కాలంలో అంటే ఉత్తరాయణ కాలంలో దీంతో పాటు దక్షిణాయన కాలం మొదటి దశలో సూర్యాస్తమయం తరువాత అరగంట పాటు వెలుతురు వుంటుంది. దక్షిణాయన రెండవ దశ మొదలైన నెల రోజుల తరువాత సాయంత్రం వేళ సూర్యాస్తమయం త్వరగా జరగడంతో పాటు వెను వె ంటనే చీకటి వస్తుంది. నవంబరు నెలలో ఇది మరింత అధికమవుతుంది. అయితే ఉదయం వేళ సూర్యోదయం కారణంగా ఐదున్నర గంటల స మయంలో వెలుతురు వస్తుంటుంది. ఖగోళ శాస్త్రం అనుసారం సూర్యుడు మిధున రాశి నుంచి కర్కాటక రాశిలోకి ప్రవేశించిన సమయంలో ద క్షిణాయనం వస్తుంది. ఈ యేడాది జూన్ 21వ తేదీన అత్యధిక పగటి వేళ వుండగా వచ్చే డిసెంబరు 21న అతిఎక్కువ చీకటి వేళ వుంటుంది.

## ఇరాన్‌పై అమెరికా యుద్ధ వ్యయం 45.1 బిలియన్ డాలర్లు



**వాషింగ్టన్, సెప్టెంబరు 20:** ఇరాన్‌తో అమెరికా కొనసాగిస్తున్న యుద్ధ వ్యయం 45.1 బిలియన్ డాలర్లకు చేరుకుంది. పెంటగాన్ అమెరికా కాంగ్రెస్‌కు అందించిన వివరాల ఆధారంగా ఈ అంచనా వెలువడింది. ఈ సమాచారాన్ని బ్రీఫింగ్‌కు సంబంధించిన ఇద్దరు అధికారులు వెల్లడించింది. ఈ మొత్తం వ్యయంలో సెప్టెంబర్ 3 నాటికి నమోదైన యుద్ధ వ్యయం 43.6 బిలియన్ డాలర్లు కాగా, అదనపు ఇంధన అవసరాలకు సంబంధించిన ఖర్చు మరో 1.5 బిలియన్ డాలర్లుగా ఉంది. పూర్తి ఖర్చు ఇంకా తెలియాల్సి ఉందిఅయితే 45.1 బిలియన్ డాలర్ల అంచనా యుద్ధానికి సంబంధించిన పూర్తి వ్యయాన్ని ప్రతిబింబించడం లేదని తెలుస్తోంది. ఘర్షణల్లో దెబ్బతిన్న అమెరికా సైనిక స్థావరాలు, భవనాల మరమ్మతులకు అయ్యే ఖర్చును ఇందులో చేర్చలేదు. అలాగే, పరోక్ష సైనిక కార్యకలాపాలకు సంబంధించిన ఖర్చులపై కాంగ్రెస్ సభ్యులు కోరిన వివరణాత్మక వివరాలను కూడా పెంటగాన్ ఇంకా అందించలేదని ఓ అధికారి తెలిపారు. పెరుగుతున్న యుద్ధ వ్యయంతాజా 45.1 బిలియన్ డాలర్ల అంచనా, ఆగస్టు 1 వరకు యుద్ధానికి 38 బిలియన్ డాలర్లు ఖర్చవుతుందని కాంగ్రెస్ బడ్జెట్ కార్యాలయం గతంలో అంచనా వేసిన దానికంటే గణనీయంగా ఎక్కువయింది. జూలైలో పెంటగాన్ వెల్లడించిన అంచనా ప్రకారం అప్పటివరకు యుద్ధ వ్యయం 37.5 బిలియన్ డాలర్లుగా ఉంది. అంచనా వ్యయంలో ఎక్కువ భాగం ఆ యుధాలు, మందుగుండు సామగ్రి కొనుగోళ్లకు సంబంధించి నదేనని పేర్కొంది. ఆగస్టు 1 తర్వాత కూడా యుద్ధం కొనసాగితే, అమెరికాకు నెలకు 2 బిలియన్ నుంచి 3 బిలియన్ డాలర్ల వరకు అదనపు వ్యయం అవుతుందని అంచనా వేసింది. పోరాటం తీవ్రత పెరిగే సమయంలో ఈ ఖర్చులు మరింత అధికమయ్యే అవకాశం ఉందని తెలిపింది. ద్రవ్యోల్బణంపై హెచ్చరియుద్ధం వల్ల నేరుగా ఏర్పడే ఆర్థికభారంతో పాటు, విస్తృత ఆర్థిక ప్రభావాలపై కూడా హెచ్చరిక జారీ చేసింది. 2027 మొదటి త్రైమాసికంలో అమెరికాలో ద్రవ్యోల్బణం మరింత పెరిగే అవకాశం ఉందని కాంగ్రెస్‌కు తెలిపింది. ఇప్పటికే అమెరి కన్లలో ఆర్థిక వ్యవస్థ పరిస్థితిపై ఆందోళనలు పెరుగుతున్న సమయంలో ఈ హెచ్చరిక వెలువడింది.

## ఐరాస సర్వసభ్య సమావేశానికి ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్



**న్యూయార్కు, సెప్టెంబరు 20:** ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కి యన్ న్యూయార్క్‌లో జరగనున్న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశానికి హాజరు కానున్నారు. అమెరికా, ఇజ్రాయెల్‌తో కొనసాగు తున్న యుద్ధంపై ఇరాన్ వైఖరిని ఆయన ఈ సమావేశంలో వివరించే అవకాశం ఉంది. పెజెష్కియన్ తన పర్యటనలో పలు దేశాల నేతలతో కూడా సమావేశం కానున్నారు. ఇరాన్ ఉన్నత స్థాయి నేతలు ఐరాస సర్వసభ్య సమావేశానికి హాజరయ్యేందుకు ట్రంప్ ప్రభుత్వం అనుమతించిందని అమెరికా విదేశాంగ శాఖ ఈ వారం ప్రారంభంలో ప్రకటించింది. ప్రపంచ సంస్థకు ఆతిథ్య దేశంగా ఉన్న అమెరికాకు ఉన్న బాధ్యతలకు అనుగుణంగా ఇరాన్ ప్రభుత్వానికి చెందిన ప్రధాన ప్రతినిధి బృందం సమావేశానికి హాజరయ్యేందుకు అనుమతిస్తామని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి తెలిపారు. అయితే ఇరాన్ ప్రతినిధి బృందంపై ప్రయాణ ఆంక్షలు కొనసాగుతాయని, అమెరికా విధానాల ప్రకారం విలాసవంతమైన వస్తువులు, ఇతర వస్తువుల కొనుగోలుపై కూడా నిషేధాలు ఉంటాయని అమెరికా విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. మధ్యప్రాచ్యం, ఉక్రెయిన్‌లో విస్తరిస్తున్న ఘర్షణలు, కృత్రిమ మేధస్సు వల్ల తలెత్తుతున్న సవాళ్ల నేపథ్యంలో దాదాపు 130 మంది దేశాధినేతలు ఐరాస సర్వసభ్య సమావేశానికి హాజరుకానున్నారు. ఉక్రెయిన్, ఏఐ, మధ్యప్రాచ్య అంశాలపై ఐరాస భద్రతా మండలిలోని 15 సభ్య దేశాలు ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందని దౌత్యవేత్తలను ఉటంకిస్తూ కథనాలు వచ్చాయి. అరబ్ దేశాల నేతలతోనూ చర్చలు జరిగే అవకాశం ఉంది. పెజెష్కియన్‌తో పాటు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు కూడా ఐరాస సర్వసభ్య సమావేశంలో ప్రసంగించనున్నారు. గాజాలో యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు నెతన్యాహుపై చర్యలు కోరుతోంది. ఈ ఆరోపణలను ఇజ్రాయెల్ ఖండిస్తోంది. పాలస్తీనా అధ్యక్షుడు మహ్మూద్ అబ్బాస్ వరుసగా రెండో ఏడాది కూడా సమావేశానికి ప్రత్యక్షంగా హాజరు కాలేరు. అమెరికా మరోసారి ఆయనకు వీసా నిరాకరించింది. అయితే వీడియో ద్వారా సమావేశంలో పాల్గొనేందుకు అబ్బాస్‌కు అనుమతి ఇవ్వాలని ఐరాస సర్వసభ్య సమావేశం ఈ వారం ప్రారంభంలో ఓటు వేసింది.

## ది ప్యారడైజ్ సినిమా టికెట్ ధరల పెంపు

### రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త :** నాని, శ్రీకాంత్ ఓదెల కాంబోలో తెరకెక్కిన పీరియడ్ యాక్షన్ డ్రామా ది ప్యారడైజ్ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఈ నెల 24వ తేదీన విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం టికెట్ ధరల పెంపునకు, ప్రత్యేక షోలకు అనుమతినిస్తూ ఆదివారం దీనికి సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది. ముందు రోజు సాయంత్రం స్పెషల్ ప్రీమియర్ షోలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా, ఈ నెల 24 నుంచి 27 వరకు ఒక విధంగా, 28 నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకూ మరోలా అదనపు రేట్లకు అనుమతినిచ్చింది. ది ప్యారడైజ్ మూవీ రిలీజ్ ముందు రోజు ఈ నెల 23 సాయంత్రం 6.30 గంటలకు స్పెషల్ ప్రీమియర్ వేసేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీనికి జీఎస్టీతో కలిపి అదనంగా రూ.500 టికెట్ ధర నిర్ణయించింది. సెప్టెంబరు 24 నుంచి 27వ తేదీ వరకు సింగిల్ స్క్రీన్ లో రూ.48 (జీఎస్టీతో), మల్టీప్లెక్స్‌లో రూ.95 (జీఎస్టీతో) పెంచుకునేందుకు అధికారులు పర్మిషన్ ఇచ్చారు. 28 నుంచి అక్టోబర్ 3 వరకు రూ.23 (జీఎస్టీతో) మల్టీప్లెక్స్ లో రూ.45 (జీఎస్టీతో) హైక్ లభించింది. అలాగే రోజుకు ఐదు షోలు ప్రదర్శించేందుకు కూడా అనుమతినిచ్చారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాణ సంస్థ తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ కమిటీకి రూ.కోటి విరాళంగా అందజేసింది. కాగా నాని హీరోగా నటించిన పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ది ప్యారడైజ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై చెరుకూరి సుధాకర్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ మంచి రెస్పాన్స్ అందుకున్నాయి. సినిమాపై అంచనాలు పెంచాయి.


**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్**
(ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు)
(CIN : L36911RJ1996PLC011381)
నమోదిత కార్యాలయం: 19-A, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001
అనుబంధం IV (నిబంధన 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఇది ఇలా ఉండగా, "సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (చట్టం, 2002 (54 ఆఫ్ 2002) దాని క్రింద AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారిగా మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క సెక్షన్ 13 (12) [నియమం 3] తో చదవబడే అధికారాలను వినియోగించుకుంటూ, నోటీసులలో పేర్కొన్న మొత్తాన్ని రూ.9,24,566/- (రూపాయలు తొమ్మిది లక్షల ఇరవై నాలుగు వేల ఐదు వందల అరవై ఆరు మాత్రమే) నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోపు తిరిగి చెల్లించాలని రుణగ్రహీత నందిరి స్వామి (రుణగ్రహీత), నందిరి బాలవ్వ (సహ-రుణగ్రహీత), (రుణ ఖాతా నం. 23630000014483)ను కోరుతూ 16-మార్చి-26న డిమాండ్ నోటీసు జారీ చేశారు.

ఇది ఇలా ఉండగా, ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్, ఏప్రిల్ 1, 2024 నుండి అమల్లోకి వచ్చేలా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విలీన పథకం ద్వారా AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ తో విలీనం చేయబడింది. ఈ విలీన పథకం ద్వారా, పైన పేర్కొన్న రుణ ఖాతా AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ కు బదిలీ చేయబడింది. ఇందులో మంజూరు చేయబడిన క్రెడిట్/ఆర్థిక సహాయానికి సంబంధించి మీరందరూ చెల్లించాల్సిన సొమ్ము మొత్తం తనఖా పెట్టిన ఆస్తికి సంబంధించి అంతర్లీన భద్రత మరియు భద్రతా వడ్డీతో సహా కానీ వీటికే పరిమితం కాదు.

రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/హామీదారుడు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, 17వ రోజున సెప్టెంబర్ 2026 సంవత్సరం సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8తో చదవబడే చట్టం యొక్క సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి/ఆమెకు ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుని, క్రింద వివరించిన ఆస్తిని క్రింద సంతకం చేసిన వ్యక్తి స్వాధీనం చేసుకున్నాడని రుణగ్రహీత/తనఖాదారునికి మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడుతోంది.

ముఖ్యంగా రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/హామీదారు మరియు సాధారణ ప్రజలు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు వ్యవహరించవద్దని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు. మరియు ఆస్తితో జరిగే ఏవైనా లావాదేవీలు AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క రూ.9,24,566/- (రూపాయలు తొమ్మిది లక్షల ఇరవై నాలుగు వేల ఐదు వందల అరవై ఆరు మాత్రమే) 12-మార్చి-26 నాటికి మొత్తానికి మరియు పూర్తి చెల్లింపు వరకు దానిపై వడ్డీ మరియు ఖర్చులకు లోబడి ఉంటాయి.

"సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి, అంటే ఈ సమాచారం నుండి 30 రోజులలోపు, చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలను నియమం 8 (6)తో చదవడం ద్వారా రుణగ్రహీత దృష్టికి తీసుకురావడమైనది."

స్థిరాస్తుల యొక్క వివరణ

సిద్దిపేట జిల్లా, మిర్దొడ్డి మండలం, లక్ష్మీ నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీ నగర్‌లో గల, 1-91 నంబరు, అసెస్మెంట్ నంబరు 91 గల నిర్మాణంలో ఉన్న ఇల్లు, 357.33 చదరపు గజాల విస్తీర్ణం కలిగి ఉంది. దీనికి తూర్పున: పుట్ట మల్లయ్య ఇల్లు మరియు ఖాళీ స్థలం, పశ్చిమాన: పుట్ట చందు ఇల్లు మరియు ఖాళీ స్థలం, పుట్ట బాలమల్లు ఇల్లు మరియు ఖాళీ స్థలం, ఉత్తరాన: రోడ్డు మరియు పుట్ట బాలమల్లు ఇల్లు మరియు ఖాళీ స్థలం సరిహద్దులుగా ఉన్నాయి. దక్షిణం: ఆకుల కొండయ్య బహిరంగ ప్రదేశం.

తేది : 17/సెప్టెంబర్/2026 — అధీకృత అధికారి
ప్రదేశం : సిద్దిపేట, తెలంగాణ — AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

వార్త


స్పష్టత లేకుండా దారితప్పి మాట్లాడటం కంటే మౌనం పాటించడం ఉత్తమం.

న- రమణ మహర్షి

# స్వాగతించదగినది


ఎప్పుడు గెలిచినా, ఎక్కడ గెలిచినా, ఎలా గెలిచినా రాజకీయాల్లో అలవాటు పడిన నేతలు ఎప్పుడూ అధికార పార్టీతోనే ఉండాలనుకునే రోజులు నడుస్తున్నాయి. అందుకే ఇప్పుడు ఏ రాజకీయ నేతలు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియడం లేదు. అధికారంలో ఉండి పక్కచూపులు చూసేవారి మీద, ఇతర పార్టీల్లోకి మారే వారికి రాజ్యాంగం ప్రసాదించిన నియమ నిబంధనలు ఉండనే ఉన్నాయి. దేశ కాలమాన పరిస్థితులను బట్టయినా పాత నిబంధనలు వర్తింప చేయడానికి చట్టసభలు, న్యాయస్థానాలు నానా యాతన పడ్తుంటాయి. ఫిరాయింపులను నిరుత్సాహపరిచేందుకు పలు చట్టాలు ఉన్నా పలు పార్టీలు రాజకీయాల్లో ఇలాంటివన్నీ మామూలే కదా! అని సరిపెట్టుకునే వారు లేకపోలేదు. కానీ బయట పార్టీలో ఎన్నికై అధికార పార్టీతో అంటకాగే వారికి కొన్ని విధాలుగా మేలు కలుగచ్చు కానీ రాజ్యాంగం మాత్రం అట్టివారిని ఉపేక్షించదని తాజా తీర్పు ఒకటి చెప్తోంది. తెలంగాణలోని ఖైరతాబాద్ నియోజకవర్గ శాసనసభ్యుడు దానం నాగేందర్‌ను తెలంగాణ హైకోర్టు ఆయన శాసనసభ్యత్వానికి అనర్హుడిగా ప్రకటించింది. రెండో అవకాశమేదీలేకుండా ఖైరతాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే సీటు ఖాళీ అయినట్లు ప్రకటించింది కూడా. అయినా దానం మరో ప్రయత్నంగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చి పార్టీ ఫిరాయించారన్న నిర్ధారణ అయిన ఎమ్మెల్యేపై వేటు వేసిన తెలంగాణ హైకోర్టు ధర్మాసనం ఉత్తర్వులు స్వాగతించదగినవి. ఇలాంటి సంచలన నిర్ణయం తీసు కున్న ధర్మాసనం రాజ్యాంగాన్ని పరిక్షించిందని అందరూ అనుకుంటున్న మాట. బిఆర్‌ఎస్ పార్టీ టిక్కెట్ మీద గెలిచాడంటేనే ఆ పార్టీని ఆదరించి ప్రజలు ఓటేసారని చెప్పుకోవాలి. అలా గెలిచిన వ్యక్తి ఆ పార్టీకి రాజీనామా చేయకుండా మరో పార్టీలో చేరి హంగామా సృష్టించిన విషయం సర్వవిదితం. కానీ మరుసటి పార్లమెంటు ఎన్నికలలో అధికార పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచాడంటే అది ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని ప్రజాస్వామ్య వాదులంతా ఎలుగెత్తి ఖండించారు. ఇలా పార్టీ మార్చి పోటీలో ఉన్న ఉదంతాన్ని స్పీకర్ పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని ధర్మాసనం వ్యతిరేకించింది. ఆ కారణం చేతనే తమకున్న విశిష్ట అధికారాలతో ధర్మాసనం న్యాయమూర్తులు స్పీకరు ఉత్తర్వులను రద్దు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 191(2), రెడ్‌విత్ పదవ షెడ్యూల్‌లోని పేరా 2(1) ఎ ప్రకారం 2024 ఏప్రిల్ 23 నుంచి దానం ఎమ్మెల్యే సభ్యత్వానికి అనర్హుడని తేల్చారు. ఎమ్మెల్యే పార్టీ మార డాన్ని పరిగణించకుండా స్పీకరు ఇచ్చిన ఉత్తర్వులనురద్దు చేస్తూ రిట్‌పిటిషన్లను ధర్మాసనం అనుమతించింది. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే బహిరంగంగా పార్టీ మారి కోర్టు తీర్పు ద్వారా అనర్హత వేటుకు గురైన తొలి ఎమ్మెల్యేగా దానం నాగేందర్ రాజకీయ చరిత్ర పుటల్లోకి ఎక్కారు. రాజ్యాంగ ప్రక్రియకు సంబంధించి విస్పష్టమైన తీర్పు నిచ్చిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆపరేషన్‌కుమార్ సింగ్, జిస్టిస్ జిఎం మొహియుద్దీన్ ఫిరాయింపు చట్టానికి స్పష్టమైన భాష్యం చెప్పగలిగారు. నిజానికి ఫిరాయింపులకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే బీజాలు పడ్డాయి. ఆంధ్రప్రదేశ్ విభజన ఉద్యమం జరుగుతున్న రోజుల్లో ప్రత్యేక తెలంగాణ కోరుతున్న టిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి అక్కున చేర్చుకున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ఆనాటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరావు కూడా తమతో కలిసివచ్చిన పరాయి పార్టీ సభ్యుల్ని చేరదీశారు. మళ్లీ తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదేపంథాలో నడిచింది. ఫిరా యింపులపై బిఆర్‌ఎస్ ఇచ్చిన ఫిర్యాదులపై స్పీకరు ఎదు ట చాలాకాలం కాలయాపన పర్వం సాగింది. కోర్టుల జోక్యంతో స్పీకరుకు గడువులు నిర్ణయించడంతో త్వరలో తీర్పు చెప్పక తప్పలేదు. వాటిపై ఇద్దరు బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. సాధారణంగా ఫిరాయింపుల వ్యవహారంలో స్పీకర్ నిర్ణయమే శిరోధార్యం. స్పీకర్ తీసుకునే నిర్ణయాలపై కోర్టులో జోక్యం చేసుకునే అవకాశాలు బహు తక్కువ. కానీ ప్రస్తుత ఫిర్యాదులపై ధర్మాసనం జోక్యం చేసుకునే అంశంలో గత తీర్పుల ననుసరించి స్పీకరు నిర్ణయాలపై కోర్టులు న్యాయ సమీక్ష చేసుకోవడం ఆర్టికల్ 226 కింద సబబేనని న్యాయసూత్రాలు చెబుతున్నాయి. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ కింద కిహోటో హోలో హన్ వెర్సస్ జాచిల్లు కేసులో 1992లో సుప్రీంకోర్టు తీర్పుప్రకారం స్పీకర్ నిర్ణయంలో రాజ్యాంగపరమైన నిబంధనలు సహజసూత్రాల ఉల్లంఘన వంటి అంశాలుంటే న్యాయసమీక్షకు ఆస్కారముంటుందనే ధర్మాసనమే సమర్థించుకుంది. ప్రస్తుత ఫిరాయింపు కేసులో తీర్పు ఒక తెలంగాణకే పరిమితంకాదు. దేశంలోని అన్ని రాజ్యాంగ సభల సభ్యత్వ నియమావళికి ఒక మార్గదర్శనంగా మిగలనుంది. భవిష్యత్ తీర్పులకు ఈ తీర్పే అనుసరణీయమౌతుంది. ఈ కేసులో 'అనర్హత' ఒక్కటే కాదు. దానిని ఎప్పటి నుంచి అమలులోకి తీసుకురావాలన్న దానిపై ధర్మాసనం చర్చించి తాను గెలిచిన పార్టీ నుంచి కాక మరో పార్టీపై లోక్‌సభకు పోటీ చేసేందుకు నామినేషన్ వేసిన తేదీ 2024 ఏప్రిల్ 23నుంచే అమల్లోకి వస్తుందని ఖాయం చేయడం విశేషం. ఎన్నో సమాధానం లేని ప్రశ్నలకు ధర్మాసనం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకోవ డంలో మిగితా పార్టీ ఫిరాయింపుదారులు పునరాలోచించుకోవలసిన సమయం ఆసన్నమైంది. ప్రజాస్వామ్యాన్ని వెక్కిరించే చేష్టలు ఎప్పటికైనా పీకపట్టుకుంటాయని ఈ తీర్పు హెచ్చరించింది.

కోపావేశంలో ఉన్న శక్తిమంతుని కన్నా, మౌనంగా ఉన్న చిన్నారి హృదయం ఇచ్చే శాపం తీవ్రమైనది.



ఎలిజబెత్ బారెట్ బ్రౌనింగ్

ఏమీ తెలియనప్పుడు మౌనంగా ఉండాలి. అన్నీ తెలిసినప్పుడు కూడా..



ఆల్డస్ హక్స్లీ

## ప్రజావాక్కు



### భక్తులకు పంచాలి

ఈ మధ్యన అనేకులు గణేశనవరాత్రులలో భాగంగా దేవునికి సమర్పించిన లడ్డూ ప్రసాదాన్ని బహిరంగంగా వేలం వేయటం వెనుక ఆధ్యాత్మిక అంశం కన్నా వ్యాపార, ప్రచార ధోరణి కనిపిస్తోంది. అసలు దేవుడి ప్రసాదాన్ని బహిరంగంగా వేలంవేయటం అన్నది ఎంతవరకు సబబు అని మనకు మనమే హిందువులుగా ప్రశ్నించుకోవాలి. లడ్డూను వేలంలో కొనుకున్న సదరు వ్యక్తి ఆ లడ్డూను తన మిత్ర పరివారానికి పంచుకుంటాడు తప్ప నిమజ్జనం రోజునదర్శించుకున్న భక్తుడికి అందకుండాపోతోంది. వేలంలో చేజిక్కించుకున్న వ్యక్తి ఆ లడ్డూను భారీ ఊరేగింపుగా తన ఇంటికే తీసుకుపోతున్నాడు. లడ్డూ వేలం వంటి పోకడలకు పోకుండా లడ్డూను నిమజ్జనం నాడు దేవుని దర్శించుకున్న భక్తులకు పంచాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### రాజీనామా చేయాలి

పదవుల్లో ఉన్నా లేకపోయినా ఎమ్మెల్యేగా గెలిచిన వారందరు అసెంబ్లీకి వెళ్లి ప్రజల పక్షాన మాట్లాడాలి. సభలో వారి సమస్యలు లేవనెత్తాలి. అయితే తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాజీలు అయ్యాక అసెంబ్లీ మొహం చూడకుండా, ప్రజాసమూహాల్లోకి రాకుండా నివాస గృహాల్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. తమ నియోజకవర్గ ప్రజలకు కూడా వారు కనిపించడం లేదు. ఇలాంటి వారిని ఆ పార్టీనాయకులు సమర్థిస్తున్నారు. వెనకేసుకు వస్తున్నారు. ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. మా నాయకులు ముఖ్యమంత్రులు అయ్యాకే సభకువస్తారని అంటున్నారు. వాళ్లు ముఖ్యమంత్రులు అవటానికి ఇంకా రెండున్నరేళ్ల సమయ ఉంది. అంతకన్న ముందు ఇప్పుడు వాళ్లు అసెంబ్లీకి వెళ్లి సమావేశాల్లో పాల్గొనాలి. ప్రతిపక్ష నాయకులుగా తమ బాధ్యతలను నిర్వర్తించాలి.

- ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### యుట్యూబ్‌లో ప్రసారం చేయాలి

ఎస్.వి.బి.సి. వారు ప్రతీ దిన్న ప్రాతఃకాల సమయంలో టి.వి.లో ప్రసారం చేసే వేద పారాయణ్ణాన్ని తరువాత యుట్యూబ్‌లో పెట్టేవారు. అలా దాదాపు 2300 ఎపిసోడ్లు ప్రసారం చేసిన తరువాత దాదాపు నెల నుంచి యుట్యూబ్‌లో పెట్టడంలేదు. కారణం తెలియదు. ఇది ఒక మంచి కార్యక్రమం. కనుక మా విన్నపం ఏమంటే ఈ కార్యక్రమాన్ని లేకుండాయుట్యూబ్‌లో ప్రసారం చేయాలి.

- డా. ఎన్. ఎస్. ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### చిన్న డిపాజిట్లపై వడ్డీరేట్లు పెంచాలి

రెండు దశాబ్దాల క్రితం బ్యాంకులు, పోస్టాఫీసులు చిన్న డిపాజిట్లపై 12 శాతం వరకు, మార్గదర్శి వంటి ప్రైవేట్ సంస్థలు 18శాతంవరకు వడ్డీలిచ్చేవి. ప్రపంచబ్యాంకుతో సంధి కుదిరి, గత 25ఏళ్ళుగా అమెరికా వలె రిజర్వ్‌బ్యాంక్ కూడా క్రమంగా వడ్డీరేట్లని నేడు సుమారు 6శాతానికి కుదించింది. అమెరికా కుబేరుల దేశం. మనది పేదలు, సామాన్యులు ఎక్కువగా వున్న దేశం, వీరు తమ డబ్బునిభద్రత, భవిష్యత్ కోసం బ్యాంకులు, పోస్టాఫీసుల్లో దాచుకుంటారు. వీరిలో స్వచ్ఛంద, సహజ పదవీ విరమణ చేసి పెన్షన్లు, ఇతర ఆదాయం లేని ప్రభుత్వ, ప్రైవేటు రంగ ఉద్యోగుల వంటి వారెందరో వున్నారు. ఇలా తరచు వడ్డీలు తగ్గిస్తుంటే పెరిగే ఖర్చులు, తగ్గిన వడ్డీ నష్టం భర్తీ కోసం అధిక ఆదాయం ఆశించి అగ్రిగోల్డ్, సహారా వంటి ప్రైవేట్ సంస్థల్లో పెట్టుబడులు పెట్టి కొందరు, బంధు మిత్రులకి అప్పులిచ్చి మరికొందరు మూలధనమే పోగొట్టుకున్నారు. కనుక ఆర్థిక సూత్రాల్ని పక్కన బెట్టి మన ప్రజల స్థితిగతుల దృష్ట్యా, పది లక్షల రూపాయల్లోపు డిపాజిట్లపై ఒకటి/రెండు శాతం వడ్డీ పెంచితే, పెరిగిన జీవన వ్యయం, ద్రవ్యోల్బణం నుండి వారికి కొంత వూరట లభిస్తుంది.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### లద్దాక్‌కు స్వాతంత్య్ర ప్రతిపత్తి!

లాద్దాక్ అభివృద్ధికిస్వయం ప్రతిపత్తికి హామీఇస్తూ కొత్త నిబంధన చేరుతున్నట్టు కేంద్రం ప్రకటించినది. అయితే లాద్దాక్ వివాదం కొత్తది ఏమి కాదు. సోనమ్ వాంగ్ చుక్ లాద్దాక్ కు స్వాతంత్య్ర ప్రతిపత్తి కావాలి అని పోరాటం చేసిన చరిత్ర మనకు తెలుసు. అయితే 6వ షెడ్యూల్‌లో చేర్చిన మణిపూర్, మేఘాలయ, మీజోరం, త్రిపురరాష్ట్రాలకు మాత్రమే 6 షెడ్యూల్‌లో ఉన్నాయి. దీనివల్ల ఆ రాష్ట్రాలలో సామాజిక ఆర్థిక రాజకీయ సాంస్కృతిక అంశాలు ఆ రాష్ట్రలా చేతిలో ఉంటాయి అనేది సోనమ్ వాదన.

- భారత అవినాష్, జనగామ

### మంచి సినిమాలు ప్రదర్శించాలి

గ్రామాలలో మారుతున్న కాలానుగుణంగా నిరంతరం ఏదో ఒక పనిలో నిమగ్నమవుతున్న ప్రజలకు సమాజం పట్ల, కుటుంబపట్ల బాధ్యత, సంబంధాల బాంధవ్యాలపట్ల అవగాహన కల్పించే సినిమాలను ఉచితంగా గ్రామలలో ప్రదర్శించాలి. గ్రామపాలకవర్గం ప్రత్యేకదృష్టి పొందుపరిచి ప్రజలు వీక్షించేలా అవకాశం కల్పించాలి. అందరూ ఒకే దగ్గరికి చేర్చడంతో పాటు సినిమాలోని భావాలను పంచుకునే అవకాశం కలదు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# నిరుద్యోగ నిర్మూలన ప్రభుత్వాల కర్తవ్యం!

*నక్సలిజం గూడా అనేక కారణాల వల్ల కనుమరుగు అవుతున్నది! కాశ్మీర్‌లో తీవ్రవాదుల సంఘట నలు తగ్గుతున్నాయి! వీటన్నిటిని అదుపులో వుంచటం ఒక ఎత్తు అయితే ప్రస్తుతానికి నిరుద్యోగ సమస్య దేశంలో పెను భూతంగా విద్యాధికులను, నిరుద్యోగ బాధితులను వెన్నాడుతున్నది! అందుచేత కాక్రోచ్ జనతా పార్టీ ల్లాంటివి మునుముందు మరింతగా జనంలోకి వెళ్ళే అవకాశాలున్నాయి! ఉద్యోగాలు అందుబాటులో వుంచటం ఒక సమస్య అయితే ప్రభుత్వానికి కృత్రిమ ఉద్యమాలు నిరుద్యోగుల పేరుతో తెరమీదికి వచ్చి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే దిశగా పయనిస్తే ప్రభుత్వాలకున్న అన్ని సమస్య లతో పాటుమరొక సమస్య ఉత్పన్నమవుతుంది! అందుకే ముందు జాగ్రత్త చర్యలు అవసరం. విద్యార్థులు నిరుద్యోగులూ వీధుల్లో పడకుండా ప్రభుత్వపరంగా వారిని తృప్తిపరిచే చర్యలు చేపట్టాలి! ప్రతిపక్షాలు జాతి మేలు కోసం అందర్నీ వెనకేసుకొని రావటం మంచిది కాదు!.*



రావులపాటి సీతారాంరావు

మంచి పాలన అనేది కేవలం రాజకీయ నాయకులు, పార్టీల సొత్తు అనుకుంటే ప్రజలు చేసేదేమీ లేదు. మళ్ళీ ఎన్నికలు ఎప్పుడొస్తాయా ఎప్పుడు ఈ పాలకులను ఓడించాలా అని ఎదురు చూడటమే వారి పనిగా మారుతున్న ఈ ప్రజాస్వామ్యంలో కనీసం కొన్ని ముఖ్య విధులను పాలకులు పాటించగలుగుతే ప్రజలకుఅంత కంటే కావల్సింది ఏముంది?ఎన్నికల్లో గెలవగానే అధికారం చేజిక్కించుకున్న పార్టీ ప్రతిపక్షాలను కలుపుకొని పోయేందుకు సిద్ధపడాలి! ప్రజాస్వామ్య ప్రభుత్వంలో అసలైన మార్గం అదే! ప్రతిపక్షాలు తమవంతు పాత్రను నిర్వర్తించటం అంటే పాలకుల తప్పులను ఎత్తి చూపటమే! ఇప్పుడున్న ఈ సోషల్‌మీడియా యుగంలో తిమ్మిని బమ్మిగా బమ్మిని తిమ్మిగా చేసేవారు రంగంలోకి దిగి అధికారపక్షం వారు ప్రమాణ స్వీకార సభలో ఉండగానే పదిమంది మంత్రుల బదులు ఎనిమిదిమందే ప్రమాణం చేస్తున్నారు. అంటే మిగతా వారిద్దరు విభేదిస్తున్నట్లుగానే భావించక తప్పదు. పోర్ట్ఫోలియోల గొడవలా వద్దన్న వారు మంత్రులయ్యారా అన్న ఊహాగానాలతో మొదటి రోజు నుంచే సోషల్ మీడియాను పుల్లల మీడియాగా మార్చటం ఎంత దురదృష్టకరం! అంతమాత్రాన అధికార పార్టీ వెనకడుగు వేయగూడదు! సాధ్యమైనంత వరకూ వారు నెరవేర్చ దల్చుకున్న ఎన్నికల ఎజెండాను ప్రజల ముందూ ప్రతిపక్షాల ముందుంచి ఏవిధంగా పాలన సాగించబోతున్నారో అధికారికంగా చెబితే తప్పే లేదు, ప్రతిపక్షాలకు వారు తలొగ్గినట్లు కాదు! సామరస్య ధోరణిలో వారి పాలన ప్రణాళికలు సమర్పించి స్పష్టమైన కాలపరిమితిలో పూర్తిచేసే ప్రయత్నంలో వున్నాం అని చెప్పొచ్చు! వారి ఎజెండా ఒక్కరోజులో పూర్తి అయ్యేది కాదుగదా! అయిదు సంవత్సరాలు వారి గెలుపు పరిమితిగా రాజ్యాంగం నిర్ణయించినప్పుడు రెండ్రోజుల్లో ఇది కాలేదు పదిరోజుల్లో ఆ పని చేయలేదు అంటూ గద్దెనెక్కిన 20 రోజుల్లోనే దిగిపో అనిధర్నాలతో ప్రజలను ఉద్ధరిస్తున్నామని ప్రతిపక్షం అనుకుంటే అధికార పక్షం వారు, ప్రతిపక్షం వారు అధికారంలో వున్నప్పటి నిర్వాకాలన్నీ తిరగతోడి తప్పులెన్నటమే అయిదు సంవత్సరాల కార్యక్రమంగా పెట్టుకుంటారు! ఇదే ఈరోజుల్లో ఎన్నికలు తర్వాత ఎన్నికలు మళ్ళీ వచ్చేంత వరకూ జరుగుతున్న తంతు! విద్యార్థులు ఎవరికైనా సమూహంగా అందిపుచ్చుకోటానికి సిద్ధంగా వుంటారు! విద్యార్థులు బాగా చదివి పైకి వద్దామని ఆశించేవారు కాలక్షేపానికివిద్యార్థులుగా మారినవారు, డిగ్రీల తాపత్రయంతో కళాశాలను ఆశ్రయించే వారుగా పెక్కుచోట్ల ఒక విద్యాలయంలో విభజింపబడి వున్నట్లుగా వుంటారు! తాచెడ్డ కోతి వనమంతా చెరిచినట్లు కొందరు విద్యార్థులు రాజకీయ నాయకులకు సంఘాల పేరిట సిద్ధంగావుంటారు. ఏ ఉద్యమం వచ్చినా! అందుకే 'రడీ మేడ్ మెటీరియల్'గా విద్యార్థుల రూపంలో దర్శనమిస్తూ పార్టీలకు వత్తాసు పలుకుతుండటం దాదాపు అన్నిదేశాల్లో నిత్యమూ కనపడే దృశ్యమే! ఆవిధంగా విద్యార్థుల 'అన్రెస్ట్' పాలన బాగా లేదు, చదువులు సరిగ్గా లేవు,



ఉపాధ్యాయుల సంఖ్య తక్కువ, అంతేగాదు ఈచదువులతో ఉద్యోగాలు రావు అని ఆందోళనలకు దారితీస్తున్నది! 'స్టూడెంట్ స్ట్రయిక్' అనేది రామ బాణం లాంటిది! రిజల్టు సత్వరం లభ్యపడుతుంది! నిరు ద్యోగులు ఆ 'అన్రెస్టు'ను పెంచుతారు. రాజకీయులు పోషిస్తారు వారికి అనుకూలంగా వుండేట్లు! ప్రగతిశీల విద్యార్థుల ఉద్యమాలను తప్పుపట్టడం భావ్యం కాదు కానీ నిర్మాణాత్మకంగా విలువలతో కూడిన విజయాలను విద్యార్థి ఉద్యమాలు చాలా తక్కువగా సాధించగలిగాయని చరిత్ర చెబుతున్నది! నేపాల్, బంగ్లాదేశ్‌లో జరిగిన ఉద్యమాలు రాజకీయాలతో కూడుకొని ప్రారంభమైనట్లు కనిపిస్తుంది కానీ ఢిల్లీ 'జంతర్ మంతర్ కాక్రోచ్ ఉద్యమం 'నీట్' పరీక్షల అవక తవకలను ఆలంబనగా చేసుకొని ఒక సమగ్ర స్వరూపాన్ని నిర్దిష్టంగా ఏర్పరుచుకొని ఢిల్లీ వీధుల్లోకి వచ్చింది. స్పాంటేని యస్‌గా ఉద్భవించటం వల్ల పాలకులు గానీ, నిఘా వ్యవస్థలు గానీ ఉద్యమ స్వరూప స్వభావాలను అంచనా వేయ లేకోయాయి! అందుకే అసాంఘిక శక్తులు, విదేశ శక్తులు ఉద్యమం నడుపుతున్నాయన్న వాదన స్పాంటేనియస్ ఉద్యమానికి మాలిన్యం అంటగట్టలేకపోయింది. ప్రారంభంలో పరిశుద్ధంగా పుట్టిననీటి కాలువలో పిల్లకాలువలు మురికితో మాలిన్యాలను కలుపుతేప్రయాణించటం వేరు! చాలా ఉద్యమాల తీరుతెన్నులు మొదట్లోనే మురికిని బట్టకట్టుకొని వీధుల్లో వేళ్ళాడుతున్నట్లుగా స్పష్టంగా అన్పించేది! అందుకే ఈ ఉద్యమంలోని నిబద్ధత ప్రభుత్వాన్ని నిస్తేజపరిచి స్పష్టమైన అవగాహనతో కాక్రోచ్‌రెక్కలు విరిచేయలేక పోయింది! ఎప్పుడైతే కాక్రోచ్ రెక్కలు తొడుక్కొని రాజకీయ రంగును పులుముకోవాలని ప్రయత్నించిందో ప్రభుత్వాలు దగ్గరకు తీసుకొని ఉద్యమ నేపథ్యాన్ని 'గొప్ప' చేసి కాక్రోచ్ జనతా పార్టీని దువ్వే ప్రయత్నంలో పడ్డాయి! కేవలం విద్యార్థులలోనే కాదు ప్రజల్లో గూడా తెలియని నిస్సహాయత ఆక్రమించుకుంటున్నది! ఎవరు ప్రభుత్వంలో వున్నా చిన్నాచితకా పనులు గూడా కావటం లేదని గ్రామాల్లో బాగా ప్రబలిన అపవాదో, వదంతో నిర్ధారణగా చెప్పటంకష్టం! అందుకే ప్రతిదీ బూతద్దంలో చూపటం ఇటు ప్రజలకూ అటుప్రభుత్వాలకూ ప్రతిపక్షాలకూ మంచిది కాదు! నిజానికి తిరుగుబాటుకు ఆలంబనగా మారిన నక్సల్ ఉద్యమాలు అవశేషాలుగా మారాయని అంటున్నారు! ఎక్కువ మంది మావోయిస్టులు ప్రభుత్వాలకు లొంగిపోతుండటంతో ఆ ఆలోచన ప్రభుత్వాలను నడిపేవారికి వచ్చి వుండవచ్చు! బి.జె.పి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం2014లో కేంద్రంలో ఏర్పడిన తర్వాతనే క్రాస్ బార్డర్ టెర్రరిజం చాలావరకు ప్రభుత్వం చాకచక్యంగా 'టాకిల్' చేయటంతో తగ్గిన దాఖలాలు వున్నాయి. నక్సలిజం గూడా అనేక కారణాల వల్ల కనుమరుగు అవుతున్నది! కాశ్మీర్‌లో తీవ్రవాదుల సంఘటనలు తగ్గుతున్నాయి! వీటన్నిటిని అదుపులో వుంచటం ఒక ఎత్తు అయితే ప్రస్తుతానికి నిరుద్యోగ సమస్య దేశంలో పెను భూతంగా విద్యాధికులను, నిరుద్యోగ బాధితులను వెన్నాడుతున్నది! అందుచేత కాక్రోచ్ జనతా పార్టీ ల్లాంటివి మునుముందు మరింతగా జనంలోకి వెళ్ళే అవకాశాలున్నాయి! ఉద్యోగాలు అందుబాటులో వుంచటం ఒక సమస్య అయితే ప్రభుత్వానికి కృత్రిమ ఉద్యమాలు నిరుద్యోగుల పేరుతో తెరమీదికి వచ్చి శాంతి భద్రతలకు విఘాతం కలిగించేదిశగా పయనిస్తే ప్రభుత్వాలకున్న అన్ని సమస్యలతో పాటుమరొక సమస్య ఉత్పన్నమవుతుంది! అందుకే ముందు జాగ్రత్త చర్యలు అవసరం. విద్యార్థులు నిరుద్యోగులూ వీధుల్లో పడకుండా ప్రభుత్వపరంగా వారిని తృప్తి పరిచే చర్యలు చేపట్టాలి! ప్రతిపక్షాలు జాతి మేలు కోసం అందర్నీ వెన కేసుకొని రావటం మంచిది కాదు!. ●

# దూరవిద్యకు దూరమవుతున్న విద్యార్థులు!

డా.మోటె చిరంజీవి

కాలపరిమితి, నాణ్యత, సాంకేతికతలో మార్పులు రాకపోతే లక్షలాది అభ్యర్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుంది. విద్యకు వయసు, వృత్తి, ఆర్థిక పరిస్థితిఅడ్డంకులు కాకూడదు. చదువుకోవాలనే తపన ఉన్న ప్రతి ఒక్కరికీ మరో అవకాశం కల్పించాలనే లక్ష్యంతో ఏర్పడిన దూర విద్య వ్యవస్థ ఎంతోమంది విద్యార్థుల జీవితాల్లోవెలుగులు నింపింది. ఉద్యోగులు, గృహిణులు, గ్రామీణ ప్రాంతాల యువత, కుటుంబ బాధ్యతలతో రెగ్యులర్ కళాశాలకు వెళ్లలేని వారు ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఇది ప్రధాన మార్గంగా మారింది. అయితే వ్యవస్థలో ఏర్పడుతున్న జాప్యాలు, పరిపాలనా లోపాలు, పరీక్షలు-ఫలితాల్లో ఆలస్యం వంటి సమస్యలు దూరవిద్య అసలు లక్ష్యానికే విఘాతం కలిగిస్తున్నాయి. ప్రత్యేకించి ఓపెన్ యూనివర్సిటీల్లో కోర్సుల నిర్వహణలో జాప్యం, నిర్ణీత కాలవ్యవధిలో విద్య పూర్తికాకపోవడం, పరీక్షల షెడ్యూల్‌లో అనిశ్చితి, ఫలితాల విడుదల ఆలస్యం వంటి అంశాలు విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. దూరవిద్యను ఎంచుకునే విద్యార్థుల్లో చాలామంది ఉద్యోగులు లేదా ఇతరబాధ్యతలు నిర్వహిస్తున్నవారే. వారికి విద్యా క్యాలెండర్ స్పష్టంగా లేకపోతే ఉద్యోగోన్నతులు, పోటీ పరీక్షలు, తదుపరి ఉన్నత విద్య ప్రవేశాలు వంటి అనేక అవకాశాలపై ప్రభావం పడుతుంది. ఇది కేవలం ఒక విశ్వవిద్యాలయ సమస్యగా చూడాల్సిన విషయం కాదు. దూరవిద్య దేశవ్యాప్తంగా ఉన్నత విద్యను విస్తరించేందుకు కీలకమైన సాధనం. యూజీసీ కూడా ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ వ్యవస్థను సమాజంలోని విభిన్న వర్గాలకు విద్య అందించే ముఖ్యమైన విధానంగా గుర్తిస్తోంది. గుర్తింపు పొందిన సంస్థల్లో, నిబంధనలకు అనుగుణంగా పూర్తిచేసిన ఓడీఎల్ డిగ్రీలు సంబంధిత సంప్రదాయ డిగ్రీలకు సమానంగా పరిగణించబడతాయని యూజీసీ స్పష్టం చేసింది. దూరవిద్య (ఒడిఎల్) కార్యక్రమాల నిర్వహణకు యూజీసీ ప్రాదేశిక పరిధి నిబంధనలు విధించింది. రాష్ట్ర చట్టంద్వారా ఏర్పడిన యూనివర్సిటీలు తమకు నిర్దేశించిన పరిధిలోనే స్టడీ సెంటర్లు, లెర్నర్ సపోర్ట్ సెంటర్లు, సంప్రదింపుల తరగతులు, పరీక్షలు తదితర కార్యకలాపాలు నిర్వహించాలి. ఈ నిబంధనల ఉద్దేశం దూరవిద్యలో నాణ్యత, పర్యవేక్షణ, జవాబుదారీతనం




పెంచడమే. కాగా, ప్రాదేశిక పరిధి నిబంధనలు ద్వారా వివిధ రాష్ట్రాల్లోని స్టడీ సెంటర్లలో తొలగించడం ద్వారా విశ్వవిద్యాలయాలకు ఆర్థిక సంక్షోభం తలెత్తింది. ఇతర రాష్ట్రాల్లో స్టడీ సెంటర్లు ఉన్నప్పుడు అడ్మిషన్స్ ఎక్కువ అయ్యేవి. 2014 తర్వాత అడ్మిషన్స్ తగ్గాయని చెప్పవచ్చు. దూరవిద్య అంటే నాణ్యతలో రాజీ పడే విద్య అనే భావన పూర్తిగా మారాలి. రెగ్యులర్ విద్యార్థికి అందేవిద్యా ప్రమాణాలు, అకడమిక్ క్యాలెండర్, పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రకటన, ధ్రువపత్రాల జారీ వంటి అంశాల్లో దూర విద్య విద్యార్థికీ అదేస్థాయి బాధ్యత ఉండాలి. ముఖ్యంగా ప్రతి విద్యా సంవత్సరానికి ముందుగానే పూర్తి అకడమిక్ క్యాలెండర్‌ను ప్రకటించి, ప్రవేశాలు, అసైన్‌మెంట్లు, కౌన్సెలింగ్, పరీక్షలు, ఫలితాలు, సర్టిఫికెట్ల వరకు సమయపాలనతో నిర్వహించాలి. సాంకేతికతను సమర్థంగా వినియోగించడం మరో అవసరం. ముద్రిత పాఠ్యపుస్తకాలతో పాటు డిజిటల్ స్టడీ మెటీరియల్, వీడియో తరగతులు, ఆన్‌లైన్ కౌన్సెలింగ్, మొబైల్ యాప్, పరీక్షల సమాచారం, ఫలితాల ట్రాకింగ్, విద్యార్థుల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అందుబాటులో ఉండాలి. గ్రామీణ ప్రాంత విద్యార్థులను దృష్టిలో ఉంచు కుని తక్కువ డేటాతో పనిచేసే డిజిటల్ వేదికలు కూడా అవసరం. అదేసమయంలో విద్యార్థులు కూడా అప్రమత్తంగా ఉండాలి. ఏదైనా దూరవిద్య కోర్సులో చేరే ముందు ఆ విద్యాసంస్థకు, ఆ నిర్దిష్ట కోర్సుకు సంబంధిత విద్యా సంవత్సరానికి యూజీసీ డీఈబీ గుర్తింపు ఉందా లేదా తప్పనిసరిగా పరిశీలించాలి. గతసంవత్సరంలో ఉన్న గుర్తింపు తదుపరి సంవత్సరానికి స్వయంచాలకంగా వర్తించదని యూజీసీ స్పష్టం చేస్తోంది. దూరవిద్య అనేదిప్రత్యామ్నాయ విద్య కాదు. అవకాశం కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మందికి ప్రధాన విద్యామార్గం. అందుకే విద్యార్థుల సమయం, శ్రమ, డబ్బు విలువను గుర్తించి విశ్వవిద్యాలయాలు పనిచేయాలి. విద్యార్థి ఒకసారి ఫీజు చెల్లించి ప్రవేశంపొందిన తర్వాత అతని బాధ్యత అక్కడితోముగియదు. అదే విధంగా విశ్వవిద్యాలయం బాధ్యత కూడా ఫీజువసూలుతో ముగియకూడదు. సమయానికి కోర్సు సమయానికి పరీక్ష, సమయానికి ఫలితం, సమయానికి ధ్రువపత్రం. ఇదే దూరవిద్యకు కావాల్సిన కొత్త ప్రమాణం. విద్యార్థుల భవిష్యత్తునుఆలస్యాల బారిన పడనివ్వకుండా పరిపాలనా సంస్కరణలు, సాంకేతిక ఆధునీకరణ, పారదర్శకత, జవాబుదారీతనం పెంచితేనే దూరవిద్య తన అసలు లక్ష్యాన్నిసాధిస్తుంది. లేకపోతే విద్యార్థులకు అందాల్సిన'రెండో అవకాశం'వారి జీవితంలోమరో వేచిచూసే అవకాశంగా మిగిలిపోతుంది. ●

# ప్రజలపై పెరుగుతున్న అప్పుల భారం

బొల్లిముంత సాంబశివరావు

ఆంధ్రప్రదేశ్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నది. అప్పులు చేయకుండా పాలన చేయలేని పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఉంది. చంద్రబాబు చెప్పిన సంపద సృష్టి అప్పుల సృష్టిగా మారింది. చేసిన అప్పుల్లో అధిక మొత్తం ఆ అప్పుల వడ్డీలకే చెల్లించాల్సి వస్తున్నది. అందుకు సంబంధించి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)నివేదికలు పలు కీలక అంశాలను వెల్లడించింది. రాష్ట్రంలో పెరుగుతున్న అప్పుల తీరుపై రాజకీయ చర్చ కూడా జరుగుతున్నట్లు నివేదిక పేర్కొన్నది. 2014-2026 మధ్య ఆంధ్రప్రదేశ్ అప్పులు కాగ్ నివేదిక, స్టేట్ అకౌంట్ ఎట్ ఎ గాన్సే డేటా ప్రకారం 2026నాటికి రాష్ట్రం అప్పు9.74 లక్షల కోట్లు. ఇందులో రాష్ట్ర విభజన జరిగినప్పుడు ఉన్న అప్పుల్లో, కార్పోరేషన్ అప్పులతో కలిపి రాష్ట్ర వాటా కింద వచ్చింది సుమారు 1.08లక్షలకోట్ల దాకా ఉంది. చంద్రబాబు పాలనలో 2019 నాటికి దాదాపు 3,00,000 కోట్లకు అప్పులు పెరిగాయి. అంటే టిడిపి ప్రభుత్వం చేసిన అప్పు సుమారు 1,92,000కోట్ల రూపాయలగా ఉంది. వైసీపీ పాలనలో 2024 మార్చి నాటికి రాష్ట్ర అప్పు కాగ్‌నివేదిక ప్రకారం 6.43 లక్షలుగా ఉంది. వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పు 3,43,000 కోట్లు. నేటి కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో చేసిన అన్నిరకాల అప్పులు సుమారు3,40,000 కోట్లు. అంటే నేడు రాష్ట్ర అప్పు సుమారు 10లక్షల,13వేల కోట్లుగాఉంది. కాగ్ నివేదిక ప్రకారం రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో అప్పుల శాతం స్థిరంగా 36 కొనసాగుతున్నది. ఒక ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం తన సొంత స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తిలో 3శాతం లేక 3.5 శాతం వరకు అప్పులు చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇస్తుంది. ఆర్థిక జవాబుదారీతనం -బడ్జెట్ నిర్వహణ చట్టం సవరణల ప్రకారం ఒక రాష్ట్రం మొత్తం అప్పుల భారం, ఆ రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 25శాతానికి మించగూడదు. దీన్ని గమనిస్తే రాష్ట్రం అప్పుల పరిధిని దాటి పోయింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో నిర్దేశించుకున్న అప్పుల పరిమితిని ఆర్థిక సంవత్సరం పూర్తి కాక ముందే అధిగమిస్తుందని కాగ్ నివేదిక స్పష్టం చేస్తున్నది. 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ లో 79,952కోట్ల అప్పులు అంచనా వేయగా ఫిబ్రవరి నాటికే 94,436 కోట్ల రూపాయల అప్పులు చేసింది. 2026-27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో 22,002 కోట్ల రూపాయల రెవిన్యూ లోటుకాగా మొదటి నాలుగు (మార్చిజూలై ) నెలల్లోనే 36,942 కోట్లు అప్పులు చేయడం జరిగింది. ఇది బడ్జెట్‌అంచనా 68శాతం కంటే 168 శాతం ఎక్కువ. దేశంలోనే ప్రారంభ నెలల్లో



అత్యధిక రెవిన్యూలోటు అత్యధిక రుణాలు తీసుకున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది. లక్షల కోట్లు అప్పులు చేస్తున్న కూటమి ప్రభుత్వం, తీసుకున్నఅప్పులను మౌలిక సదుపాయాలకు, సంపద సృష్టికి, ఉపాధి కల్పించే రంగాలకు ఉపయోగించింది చాలా తక్కువగా ఉంది. గత నాలుగు నెలల్లో చేసిన 49,134 కోట్లు చేసిన అప్పుల్లో 9,963 కోట్లు మాత్రమే అందుకు ఖర్చు చేయడం జరిగిందంటేనే, అప్పుల వినియోగపరిస్థితి అర్థమోతుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తెచ్చిన అప్పులకు 34,998 కోట్లు వడ్డీల కింద చెల్లించడం జరిగింది. బడ్జెట్లో పేర్కొనే రెవిన్యూ లోటుకన్నా ఆ తర్వాత పెరిగిన లోటు తీవ్రంగా ఉంది. 2026-27 బడ్జెట్‌లో రెవిన్యూ లోటును 22,002.50 కోట్లుగా పేర్కొన్నారు. కాని ఆ ఆర్థిక సంవత్సరం (మార్చి జూలై) మొదటి నాలుగు నెలల్లోనే రెవిన్యూ లోటు 36,942 కోట్లకు పెరిగింది. రెవిన్యూ లోటు పెరుగుదల వల్ల అప్పులు కూడా పెరుగుతూ ఉన్నాయి. దీన్ని గమనిస్తే బడ్జెట్ కేటాయింపులు వాస్తవ విరుద్ధంగా, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా లేవని అర్థమౌతుంది. ప్రభుత్వాలు చేసిన భారీ అప్పులు సామాన్య కుటుంబాలపై, వారి జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. తను చేసిన అప్పులు, వాటిపై వడ్డీలు చెల్లించటానికి ప్రభుత్వం ప్రజలపై అధిక పన్నులు విధిస్తుంది. అప్పులు పెరిగినప్పుడు ప్రభుత్వం జీఎస్టీ, వ్యాట్, ఎక్సైజ్ సుంకాలు, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి పరోక్ష పన్నులు పెంచుతుంది. ఫలితంగా నిత్యావసర వస్తువులు, పెట్రోల్ , డీజిల్, గ్యాస్, సేవల ధరలు పెరిగి సామాన్య కుటుంబాల బడ్జెట్ తలకిందులు అవుతుంది. రోడ్లు, తాగు నీరు, ఆసుపత్రులు, పాఠశాలలు వంటి మౌలిక సదుపాయాల కల్పన కుంటుపడుతుంది. రాష్ట్రం అప్పుల వల్ల ఒక్కో వ్యక్తి పైన 1.5 లక్షల నుండి 2 వరకు అప్పు ఉంది. ఈ అప్పు పుట్టబోయే బిడ్డపైన కూడా ఉంటుంది. ప్రభుత్వాలు భారీగా అప్పులు చేస్తూ, మార్కెట్‌లోకి అధిక డబ్బులు విడుదల చేసిన ఫలితంగా రూపాయి విలువ తగ్గి, వస్తువుల ధరలు పెరిగి ప్రజల కొనుగోలు శక్తి పడిపోతుంది. పేద, మధ్య తరగతి, ప్రజలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతారు. మౌలిక సదుపాయాల, పరిశ్రమల పై పెట్టుబడులు పెట్టకపోతే కొత్తగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉండవు. ఫలితంగా నిరుద్యోగం పెరుగుతుంది. వర్గ ప్రయోజనాలకు అనుగుణంగానే పాలక ప్రభుత్వాలు ప్రవేశపెట్టే బడ్జెట్, అందులో కేటాయింపులు ఉంటాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం బడా పెట్టుబడిదారుల, బడా భూస్వాముల, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం పని చేస్తుందని, అందుకు అనుగుణంగానే బడ్జెట్ రూపొందిస్తుందని, వారి ప్రయోజనాల కోసమే అప్పులు చేసి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెడుతుందనే విమర్శలున్నాయి. ఆ అప్పుల వల్ల ప్రజల ఏ మౌలిక సమస్యలు పరిష్కారం కాలేదు. ప్రజలపై మాత్రం భారం పడుతుంది. ●

# అగ్రరాజ్యాల్లో ఇంధన సంక్షోభం

## అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్ సహా వివిధ దేశాల్లో రికార్డు స్థాయికి పెట్రో ధరలు

### భారీగా పెరిగిన సరకు రవాణా ఛార్జీలు



**వాషింగ్టన్, సెప్టెంబరు 20:** మిడిల్ ఈస్ట్‌లో అమెరికా ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య ఘర్షణ ముదరడం, అలాగే హార్ముజ్ జలసంధి గుండా చమురు రవాణా నిలిచిపోవడంతో ప్రపంచవ్యాప్తంగా ఒక్కసారిగా తీవ్రమైన ఇంధన సంక్షోభం తలెత్తింది. దీని ప్రభావం వల్ల అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్ లాంటి పెద్ద పెద్ద అభివృద్ధి చెందిన దేశాలు కూడా ఇంధన కొరతతో, రికార్డు స్థాయి ధరలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయి. అనేక దేశాల్లో డీజిల్ దొరకడమే కష్టమైపోయి, చాలా చోట్ల పెట్రోల్ బంకులు మూతపడే పరిస్థితి వచ్చాయి. అమెరికాలో పరిస్థితి చూస్తే చాలా దారుణంగా ఉంది. అక్కడ డీజిల్ సగటు ధర గాలన్‌కు 6.49 డాలర్లు అంటే మన భారతీయ కరెన్సీలో సుమారు రూ.622 అనే ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి చేరింది. ఈ సంక్షోభం మొదలవ్వక ముందు, అంటే ఫిబ్రవరి 27న డీజిల్ ధర గాలన్‌కు 3.75సుమారు రూ.360 మాత్రమే ఉండేది. కానీ ఇప్పుడు ఏకంగా 73 శాతం పెరిగిపోయింది. ఇక కాలిఫోర్నియా రాష్ట్రంలోనైతే పరిస్థితి మరింత దారుణంగా మారింది. అక్కడ డీజిల్ గాలన్‌కు 8.41 సుమారు రూ.807 పలుకుతుంటే, పెట్రోల్ ధర 6.13 సుమారు రూ.588కి చేరింది. అమెరికాలో లారీలు, గూడ్స్ రైళ్లు, వ్యవసాయ యంత్రాలు ఇలా సరుకు రవాణా అంతా డీజిల్‌పైనే ఆధారపడి నడుస్తుంది. దాంతో డీజిల్‌ధరలు మంట పుట్టించడంతో అక్కడ సరుకు రవాణా ఛార్జీలతో పాటు నిత్యా వసరాల ధరలు కూడా ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. ఇటు ఫ్రాన్స్‌లో కూడా ఇంధన కొరత ముదిరిపోయింది. ఎంతలా అంటే, అక్కడ ప్రతి తొమ్మిది పెట్రోల్ బంకుల్లో ఒక బంకు (దాదాపు 11 శాతం) పూర్తిగా ఖాళీ అయిపోయింది. కొన్ని ప్రాంతాల్లోనైతే ఏకంగా 16శాతం బంకుల్లో లీటర్ ఆయిల్ కూడా దొరకడం లేదు. ఫ్రాన్స్‌లో డీజిల్ సగటు ధర లీటరుకు 2.39 యూరోలు (సుమారు రూ.264) దాటి రికార్డు సృష్టించింది. దేశంలోని 700 కంటే ఎక్కువ బంకుల్లో ప్రీమియం గ్రేడ్ ఇంధనం లీటరుకు 2.50 యూరోల సుమారు రూ.276 నుంచి 2.70 యూరోల సుమారు రూ.298 వరకు విక్రయిస్తున్నారు. సవుదీ అరామ్‌కోకు చెందిన ఈస్ట్‌వెస్ట్ పైప్‌లైన్‌పై జరిగిన దాడి వల్ల, అబ్కైక్ నెలకు సంబంధించిన క్రూడ్ ఆయిల్ సప్లై నిలిపివేస్తున్నట్లు కనీసం ఇద్దరు పెద్ద యూరోపియన్ రిఫైనర్లకు సమాచారం అందించారు. ఇది ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రం చేసింది. ఈ ఊహించని పరిస్థితి నుంచి బయట పడేందుకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయెల్ మేక్రాన్ జీ7 దేశాలను తమ దగ్గరున్న అత్యవసర వ్యూహాత్మక చమురు నిల్వలను ఎమర్జెన్సీ ఆయిల్ రిజర్వ్ మార్కెట్లోకి విడుదల చేయాలని కోరారు. మరోవైపు బ్రిటన్ కూడా ఈ ధరల మంటల్లో చిక్కుకుంది. అక్కడ ఆగస్టు నెలలో ద్రవ్యోల్బణం ఒక్కసారిగా 3.1శాతానికి పెరిగింది. దీనికి ప్రధాన కారణం పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం, అలాగే విమాన ప్రయాణ ఛార్జీలు ప్రియం కావడమే. ఆ దేశ జాతీయ గణాంకాల కార్యాలయం అందించిన వివరాల ప్రకారం గత ఏడాది ఆగస్టుతో పోలిస్తే వాహనాల ఇంధన ధరలు ఏకంగా 23 శాతం పెరిగాయి. జూలై నుంచి ఆగస్టు మధ్యలోనే పెట్రోల్ సగటు ధర లీటరుకు 9.1 పెన్స్ పెరిగి 161.3 పెన్స్‌కు సుమారు రూ.206 చేరుకుంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభంలో నమోదైన రికార్డు ధరల తర్వాత, పెట్రోల్ ధరలు ఈ స్థాయిలో పెరగడం మళ్లీ ఇప్పుడే. ఇక, అసలు ప్రపంచ వ్యాప్తంగా ఈ స్థాయిలో ఇంధన సంక్షోభం రావడానికి ప్రధాన కారణం హార్ముజ్ జల సంధి ప్రాంతంలో చమురు రవాణా నిలిచిపోవడమే. దీనివల్ల గ్లోబల్ శుద్ధి చేసిన ఇంధన (రిఫైన్డ్ ఫ్యూయల్) మార్కెట్లపై విపరీతమైన ఒత్తిడి పెరిగింది. దీనికి తోడు రష్యా, మిడిల్ ఈస్ట్‌లోని ప్రధాన రిఫైనరీలు, ఆయిల్ ఎక్స్‌పోర్ట్ మౌలిక సదుపాయాలకు ఆటంకాలు ఏర్పడటంతో డీజిల్ సరఫరా ఒక్కసారిగా పడిపోయింది. ఈ రవాణా, ఉత్పత్తి ఆటంకాలకు తోడు అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు భగ్గుమనడంతో ఇంధన ధరలు సాధారణ ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. ఇప్పుడు భారత్‌లో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పాడనుందా ధరలు పెరుగుతాయా అనే భయం పెరిగింది.

# ఇమ్రాన్‌ఖాన్ సోదరి అరెస్టు

## పాక్‌లో హైటెన్షన్



**ఇస్లామాబాద్, సెప్టెంబరు 20:** పాకిస్తాన్ మాజీ ప్రధాని, పాకిస్తాన్ తెహ్రీక్- ఎ-ఇన్సాఫ్ వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్ సోదరి అలీమా ఖానమ్‌ను లాహోర్‌లోని ఆమె నివాసంలో పోలీసులు అరెస్టు చేశారు. ఇమ్రాన్ ఖాన్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పిటిఐ పార్టీ తలపెట్టిన భారీ నిరసన ప్రదర్శనకు ముందు ఈ అరెస్టు జరగడం గమనార్హం. 2023 ఆగస్టు నుంచి జైలులో ఉన్న ఇమ్రాన్ ఖాన్ విడుదలే ప్రధాన డిమాండ్‌గా పిటిఐ పిలుపునిచ్చిన సెప్టెంబరు 27న నిరసన కార్యక్రమానికి సన్నాహాలు జరుగుతున్న వేళ పోలీసులు చర్యలు వేగవంతం చేశారు. అలీమా ఖాన్ అరెస్టుకు ముందే నిరసనలకు సిద్ధమవుతున్న పలువురు పిటిఐ నాయకులు, కార్యకర్తలను కూడా పోలీసులు అదుపు లోకి తీసుకున్నారు. **ఇస్లామాబాద్‌లో భద్రత పెంపు:** పాకిస్తాన్‌లో నిరసనల నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇస్లా మాబాద్ పోలీస్ యంత్రాంగం, రాజధాని పరిపాలనా అధికారులు భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఇస్లామాబాద్‌లోని సెంట్రల్ పోలీస్ ఆఫీసులో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రణాళికలను ఆమోదించారు. నిరసనకారుల కదలికలు, పిటిఐ నాయకులు, శ్రేణుల కార్యకలాపాలపై నిఘావర్గాలు సమాచారాన్ని సేకరిస్తున్నాయి. శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో భాగంగా అతిథిగృహాలు, లాడ్జీలు,బస్ టెర్మినల్స్ వద్ద పోలీసులు తనిఖీలను పెంచారు. నిరసనకారులకు ఆహారం, నీరు,రవాణా,వసతి సౌకర్యాలు కల్పించే కాంట్రాక్టర్లు, నిర్వాహకులపై నిఘా ఉంచాలని సంబంధిత పోలీసు యూనిట్లకు ఆదేశాలు జారీఅయ్యాయి.కౌంటర్ టెర్రరిజం డిపార్ట్‌మెంట్, స్పెషల్ బ్రాంచ్ సహా ప్రధాన నిఘా విభాగాలను అధికారులు హై అలర్ట్‌లో ఉంచారు.

# పశ్చిమాసియాలో మరింత ఉద్రిక్తత

## ఆదేశాల్లోని అమెరికన్లను అలర్ట్ చేసిన ట్రంప్ సర్కార్



**వాషింగ్టన్, సెప్టెంబరు 20:** ఇరాన్ మద్దతు గల హూతీలు సౌదీ అరేబియాపై దాడులు చేయడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా విదేశాంగ శాఖ తమ పౌరులకు సెక్యూరిటీ అలర్ట్ జారీ చేసింది. పశ్చిమాసియాలో దాడులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉండడంతో ఆయా దేశాల్లో ఉన్న పౌరులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. విమానాల రద్దు, గగనతల మూసివేతలు, ఇతర ప్రయాణ అంతరాయాలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించింది. 'సౌదీపై హూతీల దాడి తర్వాత పశ్చిమాసియాలో సైనిక ఘర్షణ వేగంగా తీవ్రరూపం దాల్చే అవకాశ ముంది. అక్కడి దేశాలకు ప్రయాణించాలనుకున్న ప్రయాణికులు పునరాలోచించుకోవాలి. విమాన షెడ్యూళ్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండండి. ఇప్పటికే ఆయా దేశాల్లో ఉన్న వారు సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లండి. ఆహారం, నీరు, అత్యవసర ఔషధాలు అందుబాటులో ఉండేలా చూసుకోండి. మీ చుట్టుపక్కల ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు గమనించుకోండి. ఎందుకంటే ఇరాన్ సహా దానికి మద్దతిచ్చే దళాలు గల్ఫ్ దేశాలలోని అమెరికా కార్యాలయాలు, ఆస్తులను లక్ష్యం చేసుకునే అవకాశం ఉంది' అని తమ పౌరులను హెచ్చరించింది. **యుకెను వీడిన అమెరికా బి 1బి బాంబర్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. యుకెలోని ఆర్ఎఎఫ్ ఫెయిర్‌ఫోర్డ్ నుంచి బి 1బి బాంబర్ బయలుదేరినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. అయితే దానిని ఎక్కడికి తరలిస్తున్నారనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. మార్చిలో అగ్రరాజ్యం ఇరాన్‌పై భారీ దాడులు చేసిన సమయంలో కూడా ఆర్ఎఎఫ్ ఫెయిర్‌ఫోర్డ్ ప్రధాన స్థావరంగా పని చేసింది. ఆ ప్రాంతంలో ప్రస్తుతం సుమారు 12 బి1బి బాంబర్లు మోహరించి ఉన్నాయి.



# గర్బాకు వచ్చే ముస్లింలు విధిగా తిలకం ధరించాలి

## బిజెపి ఎమ్మెల్యే సంజయ్ ఉపాధ్యాయ్ షరతులు

**ముంబయి, సెప్టెంబరు 20:** ముంబైలో బోరివలిలో జరుగుతున్న భారీ గర్బా కార్యక్రమంలో ముస్లింల ప్రవేశంపై వివాదం నెలకొంది. కార్యక్రమానికి హాజరయ్యే ముస్లింలు తప్పనిసరిగా నుదిటిపై తిలకం ధరించి, దేవతలను పూజించాలని బీజేపీ ఎమ్మెల్యే సంజయ్ ఉపాధ్యాయ్ షరతులు పెట్టారు. ఆదివారం జరిగిన భూమి పూజ, మీడియా మీట్ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ ఎమ్మెల్యే మనీషా చౌదరి, మాజీ ఎంపీ గోపాల్ శెట్టి కూడా హాజరయ్యారు. ముస్లింల ప్రవేశం గురించి మాట్లాడిన సంజయ్ ఉపాధ్యాయ్ ఈసారి గర్బాలో ముస్లింలకు ప్రవేశం ఉండదని, అయితే వారు హాజరుకావాలంటే భార్య, సోదరి, కుమార్తెతో కలిసి వచ్చి తిలకం ధరించి దేవతలను పూజించాలని అన్నారు. సనాతన ధర్మాన్ని విశ్వసించిన తర్వాతే రావాలని ఆయన వ్యాఖ్యానించారు. గర్బా కార్యక్రమె లవ్ జిహాద్‌కు వేదిక కాకూడదని అన్నారు.మాజీ ఎంపీ గోపాల్ శెట్టి మాట్లాడుతూ ముస్లింలు తిలకం ధరించి వస్తే గర్బాలో పాల్గొనవచ్చని, హిందూ నేతలు ఈద్ వేడుకలకు వెళ్లే సమయంలో టోపీలు ధరిస్తారని, అదే విధంగా గర్బాకు రావాలనుకునే ముస్లింలు తిలకం ధరించడంలో ఇబ్బంది ఉండకూడదని అన్నారు. ముస్లింలు, క్రైస్తవుల పూర్వీకులు హిందువులేనని చెప్పారు. గర్బా కార్యక్రమానికి హాజరయ్యేవారి ఆధార్ కార్డులు చెక్ చేస్తామని నిర్వాహకులు చెప్పారు. ఇప్పటికే మహారాష్ట్రలో దాండియా, గర్బాల్లోకి ముస్లింల ప్రవేశంపై వివాదం నెలకొంది. ఈ కార్యక్రమాల్లో ముస్లింలు ప్రవేశించడాన్ని అడ్డుకోవాలని వీహెచ్‌పీ పిలుపునిచ్చింది. హిందూ మతాచారాలను విశ్వసించని వారు గర్బా కార్యక్రమాల్లో ఎందుకు పాల్గొంటారు అని ప్రశ్నించారు. గర్బా పాట, డ్యాన్స్ ఈవెంట్ కాదని దేవత ఆరాధనకు సంబంధించిన పండగ అని నిర్వాహకులు చెబుతున్నారు.

# ఎఎస్ఐ హత్యకేసులో నిందితుడు ఎన్‌కౌంటర్



**అమృత్‌సర్,సెప్టెంబరు 20:** పంజాబ్‌లో డ్యూటీలో ఉన్న అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ హర్జీత్ సింగ్ హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసులో నిందితుడిగా గుర్తించిన దీపక్ సింగ్ శనివారం రాత్రి అమృత్‌సర్‌లో పోలీసులతో జరిగిన కాల్పుల్లో గాయపడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మరో నిందితుడు చీకట్లో అక్కడి నుంచి తప్పించుకున్నాడని, అతడి కోసం గాలింపు కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం, ఢండా రోడ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద ఇద్దరు అనుమానితులను ఆపేందుకు పోలీసులు ప్రయత్నించారు. వారు పోలీసులపై కాల్పులు జరిపినట్లు అధికారులు తెలిపారు. దీంతో పోలీసులు ఆత్మరక్షణలో ప్రతిగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో దీపక్ సింగ్‌కు బుల్లెట్ గాయం కావడంతో ఆసుపత్రికి తరలించారు. అయితే మార్గమధ్యలోనే అతడు మృతి చెందగా, ఆసుపత్రి వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు నిందితుడి వద్ద నుంచి 30 బోర్ పిస్టల్, రెండు మ్యాగజైన్లు, ఎనిమిది బుల్లెట్లు, మొబైల్ ఫోన్, ఒక యాక్టివా స్కూటర్ స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.ఎఎస్ఐ హర్జీత్ సింగ్ ఈనెల 18న తెల్లవారుజామున సుమారు 2:30 గంటల సమయంలో అమృత్‌సర్‌లోని భగ్తావాలా గ్రెయిన్ మార్కెట్ సమీపంలో రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. గేట్‌హకీమా పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సమయంలో మోటార్‌సైకిల్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆయనపై కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు.

# అఖిలేష్ ముందే సీనియర్ల అసభ్యకర దూషణలు



**లక్నో, సెప్టెంబరు 20:** ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) లక్నోలో కీలక సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశానికి పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ హాజరయ్యారు. ఆయనే ముందే ఇద్దరు సీనియన్ ఎస్పీ నేతలు ఒకరిపై ఒకరు దూషించుకున్నారు. ఈ ఘటన తర్వాత రాష్ట్రంలోని ఈటా, కాసర్గంజ్ జిల్లాల సమాజ్‌వాదీ పార్టీ జిల్లా కార్యవర్గాలనున రద్దు చేశారు. ఈ రెండు జిల్లాల్లోని పార్టీ అనుబంధ విభాగాలను కూడా రద్దు చేశారు. లక్నోలో జరిగిన పార్టీ సమావేశానికి రెండు జిల్లాలకు చెందిన 250 మంది సీనియర్ నేతలు, పార్టీ పదాధికారులు హాజరయ్యారు. ఈ సమయంలో పార్టీ నేతలు మంజీత్ యాదవ్, మాజీ ఏటా జిల్లా పంచాయతీ చైర్మన్ జుగేంద్ర సింగ్ యాదవ్ మధ్య వివాదం మొదలైంది. సమావేశంలో జుగేంద్ర సింగ్ చేసన వ్యాఖ్యలపై మంజీత్ యాదవ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది కాస్త ఇద్దరి మధ్య గొడవగా మారింది. ఆ సమయంలో అఖిలేష్ యాదవ్, ఇతర సీనియర్ నేతలు అక్కడే ఉన్నారు. ఈ ఘటన తర్వాత రెండు జిల్లాల కార్యవర్గాలతో పాటు రెండు జిల్లాల్లో పార్టీ అనుబంధం సంస్థల్ని రద్దు చేసినట్లు తెలుస్తోంది. యూపీ ఎన్నికల కోసం పార్టీ కేడర్‌ను సిద్ధం చేసే క్రమంలో ఈ కార్యక్రమం జరిగింది. ఏటా జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రస్తుతం బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. కాస్గంజ్ జిల్లాలోని నాలుగు అసెంబ్లీల్లో బీజేపీకి ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒక దాంట్లో ఎస్పీ ఎమ్మెల్యే గెలిచారు. ఈ ఘటనపై అఖిలేష్ యాదవ్ స్పందిస్తూ ఇలాంటివి జరుగుతుంటాయి. పర్లేదు, డబ్బుతో వచ్చే అహంకారం వల్లే ఇదంతా జరుగుతుంది. ఎవరైనా సంపన్నులైతే చివరకు ఇతరులను వదిలిపెడుతారు. ఇప్పుడు మనమంతా కలిసి పనిచేద్దాం అని వ్యాఖ్యానించారు.

# ఉద్రిక్తతలు సమసిపోవాలంటే ఏడు షరతులు అంగీకరించాల్సిందే

## అమెరికాకు ఇరాన్ అల్టిమేటమ్



**టెహ్రాన్, సెప్టెంబరు 20:** అమెరికాతో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలికేందుకు ఇరాన్ చర్చల మార్గాన్ని ఎంచుకుంది. అదే సమయంలో కఠినమైన హెచ్చరికలు జారీ చేసింది. యుద్ధాన్ని నివారించి, చర్చలు ప్రారంభించాలంటే తమ ఏడు షరతులను అంగీకరించాల్సిందేనని.. లేదంటే నిర్ణయాత్మక యుద్ధానికి తాము సిద్ధంగా ఉన్నామని అమెరికాకు స్పష్టం చేసింది. ఈ సందేశాన్ని ఖతార్ మధ్యవర్తుల ద్వారా వాషింగ్టన్‌కు అధికారికంగా తెలియజేసింది. ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మొహసెన్ రెజాయీ ఈ విషయాలను వెల్లడించారు. "యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో మా షరతులను ఖతార్ ద్వారా వాషింగ్టన్‌కు తెలియజేశాం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి స్పందన కోసం ఎదురుచూస్తున్నామని ఆయన తెలిపారు. ఇరాన్ పెట్టిన షరతుల్లో అన్ని రంగాల్లో యుద్ధాన్ని తక్షణమే నిలిపివేయడం, అమెరికా స్తంభింపజేసిన తమ నిధులను విడుదల చేయడం, తమపై విధించిన నౌకాదళ దిగ్బంధనాన్ని పూర్తిగా ఎత్తివేయడం వంటివి ప్రధానంగా ఉన్నాయి. తమ వైఖరి చాలా స్పష్టంగా ఉందని, బెదిరింపులకు లొంగేదిలేదని, షరతులను అంగీకరించడమే అమెరికాకు శ్రేయస్కరమని రెజాయీ పేర్కొన్నారు. గత నెలలో కుదిరిన ఒక అవగాహన ఒప్పందం గడువు ముగియడంతో, చర్చలను పునఃప్రారంభించేందుకు ఖతార్, పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహిస్తున్నాయి. ఈ ఏడాది ఆరంభంలో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేయడంతో ఈసంక్షోభం మొదలైంది. అదే సమయంలో ఇరాన్ తన సైనిక సన్నద్ధతను కూడా ప్రదర్శిస్తోంది. అమెరికా మరోసారి దాడి చేసే అవకాశం ఉందని తమ సైనిక వర్గాలు అంచనా వేస్తున్నాయని, దానికి అనుగుణంగా తమ ప్రణాళికలను మార్చుకున్నా మని రెజాయీ తెలిపారు. ముఖ్యంగా గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్, అరేబియా సముద్రంలోని అమెరికా నౌకాదళ ఆస్తులే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల ఒకేసారి పలు లక్ష్యాలను ఛేదించగల మల్టీవార్‌హెడ్ యాంటీషిప్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించినట్లు ఆయన ప్రకటించారు. అణు కార్యక్రమంపై మా ట్లాడుతూ అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పీటీ) నుంచి వైదొలగాలని ఇంకా నిర్ణయిం చుకోలేదని, కానీ అమెరికా చర్యలు తమను ఆ దిశగా నెట్టవచ్చని హెచ్చరించారు. అణ్వాయుధాలకు వ్యతిరేకంగా తమ మతపరమైన శాసనానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. ఇరాన్ వ్యాఖ్యలు ఒకవైపు దౌత్యపరమైన చర్చలకు తలుపులు తెరుస్తూనే, మరోవైపు సైనికపరంగా ఎలాంటి సవాలుకైనా సిద్ధంగా ఉన్నామనే ద్వంద్వ వైఖరిని స్పష్టం చేస్తున్నాయి.

# సౌదీకి సాయం చేస్తే పాక్, టర్కీలకు బుద్ధిచెపుతాం

## హౌతీస్ హెచ్చరికలు



**సనా, సెప్టెంబరు 20:** యెమెన్‌కు చెందిన హౌతీ రెబల్స్ పాకిస్థాన్, టర్కీ దేశాలకు తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. సౌదీ అరేబియాకు మద్దతుగా సైనిక బలగాలను పంపినా లేదా ప్రత్యక్షంగా జోక్యం చేసుకున్నా ఉక్కు పిడికిలితో బదులిస్తామని స్పష్టం చేశారు. సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీ మధ్య ఇటీవల కుదిరిన త్రైపాక్షిక రక్షణ ఒప్పందం నేపథ్యంలో ఈ హెచ్చరికలు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను మరింత పెంచాయి. హౌతీ అన్సార్ అల్లా పొలిటికల్ బ్యూరో సభ్యుడు మహ్మద్ అల్ బుఖైతీ ఇటీవలి ఇంటర్వ్యూలో ఈ హెచ్చరికలు చేశారు. "దేవుడి సాక్షిగా చెబుతున్నా ఒకవేళ పాకిస్థాన్, టర్కీ ఈ యుద్ధంలో జోక్యం చేసుకుంటే, మేము వారిపై ఉక్కు పిడికిలితో విరుచుకు పడతాం. సౌదీ అరేబియాకు బుద్ధి చెబుతున్నట్లే, ఆ రెండు దేశాలకు కూడా క్రమశిక్షణ నేర్పుతాం" అని వ్యాఖ్యానించారు. తాము సౌదీ నేతృత్వంలోని సైనిక చర్యలు, ఆర్థిక దిగ్బంధనానికి వ్యతిరేకంగా ఆత్మరక్షణ పోరాటమే చేస్తున్నామని బుఖైతీ పునరుద్ఘాటించారు. పాకిస్థాన్, టర్కీ ప్రభుత్వాలు ఈ వివాదంలో తటస్థంగా ఉండాలని, తమ సరిహద్దులకు సంబంధం లేని యుద్ధంలో తలదూర్చవద్దని ఆయన సూచించారు. ఆగస్టు 7న సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీలు "మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్"పై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం, మూడు దేశాల్లో ఏ ఒక్కరిపైన దాడి జరిగినా దానిని ముగ్గురిపై జరిగిన దాడిగా పరిగణిస్తారు. ఈ ఒప్పందం కింద సౌదీ భూభాగాన్ని రక్షించడానికి సిద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ అధికారులు ఇప్పటికే ప్రకటించారు. టర్కీ కూడా సౌదీకి అవసరమైన సైనిక, సాంకేతిక సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలిచ్చింది. సౌదీలోని ఇంధన వనరులు, ప్రధాన నగరాల సమీప ప్రాంతాలపై హౌతీలు డ్రోన్లు, క్షిపణులతో దాడులు తీవ్రతరం చేసిన తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అయితే, ఈ కొత్త రక్షణ ఒప్పందం కింద విదేశీ బలగాలను యెమెన్‌లో మోహరించినట్లు ఇంకా అధికారికంగా ధ్రువీకరణ కాలేదు.

# యుకెలో భారత సంతతి సిక్కుడ్రైవర్‌పై యెమెన్ జాతీయుడి దాడి

**లండన్, సెప్టెంబరు 20:** యూకేలో భారత సంతతికి చెందిన సిక్కు బస్సు డ్రైవర్‌పై అమానుష దాడి జరిగింది. 33 ఏళ్ల యెమెన్ జాతీయుడు డ్రైవర్‌పై దాడి చేసి, అతని బస్సును దొంగిలించి రాంగ్ రూట్ లో నడుపుతూ బీభత్సం సృష్టించాడు. టెల్ఫోర్డ్‌లోని మేడ్లీ ప్రాంతంలో ఉన్న కోర్ట్ స్ట్రీట్‌లో చోటు చేసుకున్న ఈ దాడి మొత్తం కెమెరాలో రికార్డ్ అవ్వగా, ఆ వీడియో ఇప్పుడు కలకలం రేపుతోంది.

ఈ ఘటనకు సంబంధించిన వీడి యోలో అలీ బల్వాద్ అనే యెమెన్ జాతీయుడు సిక్కు డ్రైవర్ గడ్డాన్ని పట్టుకుని లాగడం, అతని తలతో డ్రైవర్ తలను బలంగా బాదడం స్పష్టంగా కనిపిస్తోంది. ఆ సమయంలో అక్కడే ఉన్న ఒక మహిళ అతడిని ఎందుకు అలా తాకుతున్నావ్ అని అడగటం వీడియోలో వినిపించింది. బాధితుడైన డ్రైవర్ దయచేసి పోలీసులకు ఫోన్ చేయండి. ఈ వ్యక్తిని నా దగ్గరి నుంచి తీసుకు పోండి అని ఆమెను వేడుకున్నాడు. అయినా ఆగని నిందితుడు, బస్సులోని కొన్ని భాగాలను ధ్వంసం చేశాడు.

# మధ్యప్రదేశ్, మహారాష్ట్ర బంకుల్లో యుపిఐ చెల్లింపులు బంద్

**ముంబయి, సెప్టెంబరు 20:** అక్టోబర్ 15 నుంచి మధ్యప్రదేశ్‌తో పాటు ముంబై మహానగరంలోని పెట్రోల్ బంకుల్లో యూపీఐ చెల్లింపులను నిలిపి వేయనున్నట్లు పెట్రోల్ డీలర్లు హెచ్చరించారు. రూ. 2000కు మించిన లావాదేవీలపై విధించిన కొత్త మర్చంట్ డిస్కౌంట్ రేట్(ఎండీఆర్) నుంచి ఇంధన విక్రయదారులకు మినహాయింపు ఇవ్వకపోతే ఈ నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పెట్రోల్ డీలర్స్ అసోసియేషన్ ఆఫ్ ముంబై ఈ అంశంపై భారతీయ రిజర్వ్ బ్యాంక్, కేంద్ర ఆర్థికశాఖకు లేఖ రాసింది. ఇంధన రిటైలర్లకు ఎండీఆర్ చార్జీలను మినహాయించాలని కోరింది. ఈ ఛార్జీలను వెనక్కి తీసుకోకపోతే యూపీఐ సదుపాయాన్ని ఉపసంహరించుకుంటామని హెచ్చరించింది. మధ్యప్రదేశ్ పెట్రోల్ పంప్స్ డీలర్స్ అసోసియేషన కూడా ఇదే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ మధ్య ప్రదేశ్ ప్రతినిధి ధర్మేంద్ర శర్మ మాట్లాడుతూ రాష్ట్రంలోని సుమారు 4,700 పెట్రోల్ బంకులపై ఈ నిర్ణయం ప్రభావం చూపుతుందన్నారు. కొత్త విధానం అమల్లోకి వస్తే ఒక్కో పెట్రోల్ బంక్‌కు నెలకు సుమారు రూ. 17,700 వరకు అదనపు భారం పడుతుందని ఆయన పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలను తమ ఇష్టానుసారం నిర్ణయించే అవకాశం డీలర్లకు లేకపోవడంతో ఎండీఆర్ రూపంలో వచ్చే అదనపు ఖర్చును వినియోగదారులపై నేరుగా మోపలేమని ఆపరేటర్లు అంటున్నారు.

# తేజాస్ జెట్‌లో జపాన్ ఎయిర్‌చీఫ్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 20:** భారత్‌కు చెందిన తేలిక పాటి యుద్ధవిమానం తేజస్‌లో జపాన్ ఎయిర్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్ అధిపతి జనరల్ టకెహిరో మొరిటా ప్రయాణించారు. ఆయనతో పాటు భారత వాయుసేన చీఫ్ అమర్ ప్రీత్ సింగ్ కూడా తేజస్‌లో ప్రయాణించారు. ఆదివారం ఉదయం భారత్ జపాన్ ద్వైపాక్షిక వాయుసేన సంయుక్త విన్యాసాలు వీర్ గార్డియన్ 2026 లో భాగంగా జోధ్‌పూర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి వీటిని నిర్వహించారు. తొలుత వాయుసేన స్థావరానికి వచ్చిన వీరు తమకు కేటాయించిన తేజస్ విమా నాల వద్దకు చేరుకొన్నారు. భారత పైలట్‌తో కలిసి జపాన్ వాయుసేన అధిపతి విమానం నడ పగా ఐఎఎఫ్ చీఫ్ స్వయంగా మరో తేజస్ విమా నాన్ని నడిపారు. ఈ విన్యాసాల్లో భారత్ జపాన్ యుద్ధ వ్యూహాలను కూడా పంచుకొన్నారు.

# సంక్షిప్త వార్తలు

## హౌతీ దాడుల్లో 44మంది మృతి



**సనా, సెప్టెంబరు 20:** యెమెన్‌లో ప్రభుత్వ దళాలు, హౌతీ తిరుగుబాటుదారుల మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. గత 24 గంటల్లో జరిగిన భీకరపోరులో కనీసం 44 మంది మరణించినట్లు సైనిక వర్గాలు వెల్లడించాయి. దేశ నైరుతి ప్రాంతంలోని తాయిజ్, లహిజ్ ప్రావిన్సుల్లో ఈ ఘర్షణలు చోటుచేసుకున్నాయి. తాయిజ్ ప్రావిన్సులోని అల్‌కదా,అల్‌వాజియా ప్రాంతాల్లో హౌతీలు జరిపిన దాడులను ప్రభుత్వ బలగాలు తిప్పికొట్టాయి.ఈ ఘర్షణల్లో ఆరుగురు సైనికులు, 11 మంది హౌతీ సాయుధులు మరణించారు.

## బ్రిడ్జి పైనుంచి కిందకు పడిన కారు: ముగ్గురు మృతి



**ముంబయి, సెప్టెంబరు 20:** మహారాష్ట్రలోని ముంబైలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా దూసుకొచ్చిన ఒకకారు బ్రిడ్జిపై నుంచి కింద పడింది. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు మరణించగా గాయ పడిన మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. నలుగురు ప్రయా ణికులతో కూడిన బిఎండబ్ల్యూ కార్ మెరైన్ డ్రైవ్ ప్రాంతం నుంచి హాజి అలీ ప్రాంతానికి వెళ్తుండగా అతివేగం కారణంగా అదుపు తప్పింది. దీంతో బ్రిడ్జిపై నుంచి 70 అడుగుల కింద ఉన్న స్థలంలో పడిపోయింది.

## గణపతి మండపంలో విద్యుత్ షాక్: ముగ్గురు మృతి



**ముంబై, సెప్టెంబరు 20:** ముంబైలోని లాల్‌బాగ్ గణపతి మండపంలో విషాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు మరణించగా, మరో నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన ముంబై, లాల్‌బాగ్ ప్రాంతం, కాళిచౌకి పరిధిలోని దత్తరాం లాడ్ మార్గ్‌లో ఉన్న కాళచౌకి విభాగ్ సార్వజనిక్ ఉత్సవ్ మండల్ వద్ద శనివారం అర్ధరాత్రి జరిగింది. ఈ మండపం వద్ద నిర్వాహకులు తాత్కాలిక డ్రింకింగ్ వాటర్ స్టాల్ ఏర్పాటు చేశారు. ఫ్రిజ్‌లు వంటి వాటికి విద్యుత్ ప్రవహించగా ఐదుగురు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. వీరిలో ఇద్దరు మరణించారు. మృతుల్లో ఎనిమిదేళ్ల బాలిక కూడా ఉంది.

## వంటగ్యాస్ కస్టమర్లకు బయోమెట్రిక్ తప్పనిసరి




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 20:** దేశీయ వంటగ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. రాయితీ ధరపై వంటగ్యాస్ సిలిండర్లను పొందేందుకు 2026 అక్టోబర్ 1 నాటికి బయోమెట్రిక్ ఆధార్ ప్రామాణీకరణ ప్రక్రియను పూర్తి చేయడం తప్పనిసరి అని స్పష్టంచేసింది.ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. అర్హులైన కుటుంబాలకు మాత్రమే సబ్సిడీ ప్రయోజనాలు అందేలాచూడటంతోపాటు, గృహ అవసరాల సిలిండర్లు వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు అక్రమంగామళ్లకుండా నిరోధించడమేఈ నిర్ణయం వెనుకఉన్న ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం వెల్లడించింది.

## స్వీడన్ పార్లమెంటుకు భారత సంతతి మహిళ ఎన్నిక



**స్టాక్‌హోమ్, సెప్టెంబరు 20:** స్వీడన్ రాజకీయాల్లో భారత్ మూలాలున్న నీలా విఖే పాటిల్ అరుదైన విజయం సాధించారు. సెప్టెంబర్ 13న జరిగిన ఆ దేశ జాతీయ ఎన్నికల్లో స్టాక్‌హోమ్ సిటీ నియోజకవర్గం నుంచి పార్లమెంట్ సభ్యురాలిగా ఆమె ఎన్నికయ్యారు.మహారాష్ట్రకు చెందిన ప్రముఖ రాజకీయ కుటుంబ నేపథ్యం ఉన్న నీలా, గ్రీన్ పార్టీ తరఫున పోటీ చేసి స్వీడన్ పార్లమెంట్ రిక్స్‌డాగ్‌లో అడుగుపెట్టారు.

## మోడీ బర్త్‌డేకు హాజరుకాని విద్యార్థులకు ఐఐఎం నోటీసులు

**జమ్ము, సెప్టెంబరు 19:** ప్రధాని మోడీ పుట్టినరోజు సందర్భంగా నిర్వహించే దీపారాధన కార్యక్రమానికి గైర్హాజరైన విద్యార్థులను ఐఐఎం జమ్ము శిక్షిస్తున్నదని కాంగ్రెస్‌కు చెందిన రాజ్యసభ ఎంపీ సయ్యద్ నాసీర్ హుస్సేన్ ఆరోపించారు. హాజరుకాని విద్యార్థులు రాత పూర్వకంగా వివరణ ఇవ్వాలని, లేదా రూ.500 జరిమానా చెల్లించాలని ఐఐఎం జమ్ము విద్యార్థి కౌన్సిల్ నోటీసులు ఇచ్చిందని చెప్పారు. దీనికి డెడ్‌లైన్ విధిస్తూ జారీ చేసిన నోటీస్‌ను ఆయన సామాజిక మాధ్యమంలో షేర్ చేశారు.

# దళితుల భూమి అంగుళం కూడా సర్కారు తీసుకోదు

## ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు: రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్,సెప్టెంబరు20,ప్రభాతవార్త:** దళితులు, గిరిజనుల భూములను లాక్కోవడం ప్రజా ప్రభుత్వ విధానం కాదని, వారి అంగుళం భూమిని కూడా ప్రభుత్వం తీసుకోదని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం దళితుల భూములకు సంపూర్ణ రక్షణగా నిలుస్తుందని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో భరోసా ఇచ్చారు.దేశంలో, రాష్ట్రం లో పేదలు, దళితులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వాలేనని గుర్తు చేశారు.భూ సంస్కరణలు, భూ పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా భూమిలేని దళితులకు భూములు ఇచ్చి ఆ భూమిపై హక్కు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఉందన్నారు.తెలంగాణ ప్రాంతంలో ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలో దళితులకు సుమారు 25 లక్షల ఎకరాల భూముల పంపిణీ,అలాగే పోడు భూముల విషయంలో గిరిజనులకు సుమారు 2 లక్షల ఎకరాలపై హక్కులు కల్పించిన ఘనత కూడా కాంగ్రెస్‌దేనని తెలిపారు.భూమిలేని వారికి భూమి, హక్కులు లేని వారికి హక్కులు కల్పించడమే కాంగ్రెస్ విధానం అని స్పష్టం చేశారు.

దళిత, గిరిజనుల భూ హక్కులను కాపాడుతూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భరోసా ఇచ్చారు.అధికారంలోకి వస్తే దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించిన దొరవారి మాటలు నమ్మకూడదని విజ్ఞప్తి చేశారు.రెవెన్యూ శాఖ మంత్రిగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరఫున దళిత కుటుంబాలకు తాను స్పష్టమైన హామీ ఇస్తున్నానని "మీ అంగుళం భూమి కూడా ప్రభుత్వం లాక్కోదు.మీ భూమిని తీసుకునే ఆలోచన కూడా ఈ ప్రభుత్వానికి లేదు. మీ భూముల విషయంలో మీరు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదు. ప్రజా ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది పేర్కొన్నారు. భూములకు సంబంధించిన రికార్డుల పరిశీలన, సర్వేలు, భూ సమస్యల పరిష్కారం వంటి ప్రక్రియలను ప్రజల భూములను లాక్కోవడానికి చేస్తున్న చర్యలుగా చూడటం సరికాదని మంత్రి అన్నారు. భూములపై ప్రజలకు ఉన్న హక్కులను స్పష్టంగా నమోదు చేయడం, భూ వివాదాలను పరిష్కరించడం, భూ హక్కులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. దళితుల భూముల విషయంలో కొంతమంది దొరలు కావాలనే భయాందోళనలు సృష్టిస్తూ విషప్రచారం చేస్తున్నారని, తమ స్వార్థ ప్రయోజనాల కోసం దళితులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

"ఎవరో ఏదో చెప్పారని భయపడాల్సిన అవసరం లేదు. మీ భూముల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన భరోసా ఇస్తోంది. వాస్తవాలను తెలుసుకోకుండా ఎలాంటి విషప్రచారాన్ని నమ్మవద్దు అని మంత్రి పేర్కొన్నారు. దళితులను రెచ్చగొట్టి వారి భూముల పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని చూసే ప్రయత్నాలను అర్థం చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్య చట్టబద్ధంగా, పారదర్శకంగా ఉంటుందని స్పష్టం చేశారు.దశాబ్దాలుగా భూములపై హక్కులు లేక ప్రభుత్వ ప్రయోజనాలకు దూరమైన దళిత, గిరిజనులకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోందని అన్నారు. రీ సర్వే ద్వారా భూముల వాస్తవ పరిస్థితులను గుర్తించి దళితులకు, గిరిజనులకు హక్కులు కల్పిస్తున్నామని చెప్పారు.సూర్యాపేట జిల్లా నూతనకల్, మద్దిరాల ప్రాంతంలోని 15 రెవెన్యూ గ్రామాల్లో, మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో దశాబ్దాల భూసమస్యలకు పరిష్కారం చూపించామన్నారు.భూమిపై హక్కులు కల్పించడం ద్వారా వారికి ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దళిత, గిరిజనులకు వారి భూములపై హక్కులను కల్పించి మరింత పటిష్టం చేయడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

## 25న హుస్సేన్‌సాగర్‌లో మహాగణపతి నిమజ్జనం



**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం తేదీ ఖరారైంది. ఈ నెల 25న, శుక్రవారం రోజున గణనాథుడిని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేయనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రకటించింది. అనంత చతుర్దశి పర్వదినం సెప్టెంబర్ 25న రావడంతో, అదే రోజు నిమజ్జన కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. ఈ సంవత్సరం ఖైరతాబాద్ వినాయకుడు 'శ్రీ పంచ ముఖ సంకట హర మహాగణపతి'గా భక్తులకు దర్శనమిస్తుండడం తెలిసిందే. ప్రతి ఏటా 11 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు, ఈసారి ఒక రోజు అదనంగా 12 రోజుల పాటు కొనసాగనుండటం విశేషం. దీంతో భక్తులకు స్వామి వారిని దర్శించుకు నేందుకు అదనపు సమ యం లభించనుంది. ప్రతి సంవత్సరం మాదిరిగానే, ఈసారి కూడా భారీ ఏర్పాట్ల మధ్య మహాగణపతిని హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నిమజ్జనం తేదీ ఖరారు కావడంతో, భక్తులు నగరవాసులలో ఉత్సాహం నెలకొంది.

## వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు 'రాణి రుద్రమదేవి' పేరు పెట్టాలి

### ఎయిర్‌పోర్ట్ సాకారమయ్యేందుకు అహర్నిశలు శ్రమించిన కెసిఆర్

### సిఎం రేవంత్‌రెడ్డికి మాజీ ఎంపి బి.వినోద్‌కుమార్ లేఖ

**హైదరాబాద్,సెప్టెంబరు20,ప్రభాతవార్త:** వరంగల్ జిల్లాలోని చారిత్రాత్మక మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు కాకతీయ వీరనారి 'రాణి రుద్రమదేవి' పేరు పెట్టాలని మాజీ ఎంపీ,బిఆర్ఎస్ సీనియర్ నేత బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి ఐదు పేజీల లేఖ రాశారు. ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణ ప్రక్రియపై సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను తప్పుపట్టిన ఆయన బిఆర్ఎస్ హయాంలో చేసిన కృషిని వివరిస్తూ లేఖతో పాటు పలు ఆధారాలను జత చేసి ముఖ్యమంత్రికి పంపారు. మామునూరు ఎయిర్పోర్ట్ సాకారమయ్యేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ అహర్నిశలు శ్రమించారని తెలిపారు. ఎయిర్ పోర్ట్ మంజూరు, అనుమతుల కోసం కేసీఆర్ నాయకత్వంలో తాము అనేకసార్లు ప్రధాని నరేంద్ర మోడీతో పాటు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రులను కలిసి వినతులు సమర్పించినట్లు గుర్తుచేశారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ విషయంలో బీఆర్ఎస్ ఏమీ చేయలేదనడం పచ్చి అబద్ధమని.. సీఎం రేవంత్ రెడ్డి వాస్తవాలను దాచిపెట్టే యత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎయిర్‌పోర్ట్ పురోగతిలో సీఎం హోదాలో మీ పాత్ర కూడా ఉందనేది మేం కాదనడం లేదు, కానీ అంతా నేనే చేశానని, కేవలం మీ వల్లే ఇది సాధ్యమైందని చెప్పడం ఎంతమాత్రం సరికాదు అని స్పష్టం చేశారు. గతంలో కేంద్ర మంత్రులను కలిసిన ఫొటోలు, వీడియోలు, వార్తా కథనాల క్లిప్పింగ్లు, సాధించిన అనుమతుల వివరాలన్నింటినీ ఐదు పేజీల లేఖతో పాటు సీఎం రేవంత్ రెడ్డికి పంపినట్లు ఆయన పేర్కొన్నారు. కాకతీయ రాజధానిగా వెలుగొందిన వరంగల్ గుర్తింపును, సాంస్కృతిక వారసత్వాన్ని గౌరవిస్తూ మామునూరు విమానాశ్రయానికి 'రాణి రుద్రమదేవి ఎయిర్‌పోర్ట్'గా నామకరణం చేయాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## ఎల్‌నినో కంటే, ఎల్‌కాంగో వల్లే తెలంగాణకు నష్టం

### కాంగ్రెస్ ఎంపిలు జీతాలు తీసుకుంటూ ప్రైవేట్ ఆస్తులపై పోరాడుతారా?

### బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

**హైదరాబాద్,సెప్టెంబరు20,ప్రభాతవార్త:** భూముల సర్వే చేయాల్సింది అధికారులా? కాంగ్రెస్ ఎంపిలా? తెలంగాణ ప్రజలు 2024లో ఓట్లేసి 8 మంది కాంగ్రెస్, 8 మంది బిజెపి ఎంపిలను గెలిపిస్తే, కాంగ్రెస్ ఎంపిలు ప్రైవేట్ వ్యక్తుల ఆస్తులపై కల్లు తాగిన కోతుల్లా పోలీస్ పహారాలో దాడులు చేస్తున్నారని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో అసలు పోలీస్ వ్యవస్థ ఉందా? అని డిజిపిని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు ముందే సమాచారం ఇచ్చి, సోషల్ మీడియాలో ప్రకటించి, వందలాది మందితో బిఆర్ఎస్ నాయకుల ప్రైవేట్ ఆస్తులపైకి పోతుంటే ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. ముందస్తు అరెస్టులు ఎందుకు చేయడం లేదు? ప్రైవేట్ ఆస్తులపైకి పోవచ్చని చట్టంలో ఎక్కడ ఉందని ప్రశ్నించారు. అరికెపూడి గాంధీ గతంలో పాడి కౌశిక్ రెడ్డిని చంపడానికి వందలమందితో, కూకట్‌పల్లి నుండి కొండాపూర్‌కు వెళ్లి ఎలాగైనా చంపుతానని బెదరించి వెళ్లారు. ఇది కూడా అలాంటిదే, పోలీసులే రక్షణ కల్పించడం విడ్డూరంగా ఉంది. మొన్న కాంగ్రెస్ నాయకులు సిద్ధిపేటలో హరీశ్‌రావు ఫాంహౌజ్‌కు వెళ్తే 3,000 మంది పోలీసుల బందోబస్తు పెట్టి పంపారు. మంత్రుల ద్వారా ప్రిన్సిపల్ సెక్రటరీ కి చెప్పి అధికారులకు చెప్పి విచారణ చేయించవచ్చు కదా, కానీ ఇదేం డ్రామా? ఇందుకేనా ప్రజలు ఓట్లేసి ఎంపిలు, ఎమ్మెల్యేలుగా గెలిపించి అధికారం ఇచ్చిందని ప్రశ్నించారు. బిఆర్ఎస్ ప్రజల వద్దకు పోతుంది. ప్రజల సమస్యలపై పోరాడుతుంది, బిఆర్ఎస్ నాయకులను అడ్డుకున్నట్టే కాంగ్రెస్ నాయకులను కూడా డిజిపి అడ్డుకోవాలని పేర్కొన్నారు.



ఆదివారం మీడియాతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

## బిసిల హక్కుల కోసం ఐక్య పోరాటం అవసరం

### 2027 జనాభా లెక్కల్లో ఒబిసి కాలమ్ చేర్చి కులగణన చేపట్టాలి

### తెలంగాణలో కులగణన పూర్తి చేసి కేంద్రానికి నివేదిక పంపించాం : మంత్రి పొన్నం ప్రభాకర్



ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ ఒబిసి సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ (బేగంపేట), సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** బీసీల హక్కుల కోసం దేశవ్యాప్తంగా ఐక్య పోరాటం అవసరం అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. 2027 జనాభా లెక్కల్లో ఓబీసీ కాలమ్ చేర్చి కులగణన చేపట్టాలన్నారు. బీసీల జనాభాకు అనుగుణంగా వారికి న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. తెలంగాణలో కులగణన పూర్తి చేసి కేంద్రానికి నివేదిక పంపించామని ఆయన పేర్కొన్నారు. 2027లో నిర్వహించనున్న జనాభా లెక్కల్లో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీసీల జనాభా ఎంత ఉందో శాస్త్రీయంగా లెక్కించినప్పుడే వారికి జనాభా ప్రాతిపదికన న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు. బేగంపేటలోని హోటల్ టూరిజం ప్లాజాలో నిర్వహించిన 'ఓబీసీ జనాభా గణనపై కేంద్ర ప్రభుత్వ విధాన నిర్ణయాలు ఓబీసీల తక్షణ బాధ్యతలు, భవిష్యత్ కార్యాచరణ' అనే అంశంపై జరిగిన జాతీయ ఓబీసీ సదస్సులో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని ప్రసంగించారు.ఈ సదస్సుకు ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంత రావు, జాతీయ స్థాయిలోని వివిధ ఓబీసీ సంఘాల నాయకులు, మేధావులు, ప్రతినిధులు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఓబీసీ నేతలు హాజరయ్యారు.

**50 శాతం పరిమితిపై పునరాలోచన అవసరం**

ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. అయితే బీసీలకు వారి జనాభా ప్రాతిపదికన న్యాయం జరిగే విషయంలో 50 శాతం రిజర్వేషన్ పరిమితి అడ్డంకిగా మారకూడద న్నారు. బీసీల జనాభా, వారి సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన సమగ్ర డేటా ఆధారంగా రిజర్వేషన్లపై నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బీసీల హక్కుల కోసం దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ఒకే స్వరం వినిపించాల్సిన అవసరం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇది ఒక రాజకీయ పార్టీకి సంబంధించిన అంశం కాదని, దేశంలోని బీసీల హక్కులకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. తెలంగాణలో కులగణన పూర్తి చేసి దేశానికి ఒక మార్గాన్ని చూపించామని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. బీసీల జనాభాను శాస్త్రీయంగా లెక్కించాలి.. జనాభాకు అను గుణంగా న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించాలి. 2027 జనాభా లెక్కల్లో ఓబీసీ కాలమ్‌ను చేర్చాలి. బీసీల హక్కుల కోసం దేశవ్యాప్తంగా ఐక్యంగా పోరాడాలి' అని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.ఈ సదస్సులో జాతీయ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జాజుల శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్ ప్రధాన కార్యదర్శి సచిన్ రాజుర్‌కర్ ఒబిసి సంఘాల ప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## పార్టీ ఫిరాయింపులపై చట్టంలో లోపాలను సరిచేయాలి: కె. నారాయణ

**హైదరాబాద్,సెప్టెంబరు20,ప్రభాతవార్త:** పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలో ఉన్న లోపాలను సరిచేయకుండా వదిలేయడం వల్ల దేశంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే పరిణామాలు జరుగుతున్నాయని సీపీఐ జాతీయ నాయకుడు కె. నారాయణ అన్నారు. ఎన్నికల్లో ఏ అభ్యర్థి ఏ పార్టీ తరఫున పోటీ చేశారో ఎన్నికల కమిషన్ వద్ద స్పష్టమైన రికార్డు ఉంది. ఎన్నికైన తర్వాత పార్టీ మారి, ప్రజల తీర్పుకు విరుద్ధంగా వ్యవహరిస్తే, ఫిరాయింపు నిర్ధారణైన వెంటనే పదవి రద్దయ్యేలా చట్టాన్ని ఎందుకు మార్చకూడదు? అని ప్రశ్నించారు.ఈ దుస్థితికి జాతీయ స్థాయిలో గతంలో పాలించిన కాంగ్రెస్, ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ కూడా బాధ్యత వహిం చాలన్నారు. గతంలో కాంగ్రెస్ తప్పు చేసి ఉంటే, ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ ఆ లోపాలను సరిచేసే అవకాశం ఉంది. మరి ఎందుకు సరిచేయడం లేదు? ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే పార్టీ ఫిరాయింపులను అడ్డు కునేలా చట్టాన్ని కఠినతరం చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజల తీర్పును, ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కే ఫిరాయింపులను సమర్థించే రాజకీయ నాయకులను చరిత్ర క్షమించదన్నారు.

## అల్పపీడనం కురిపించింది అశనిపాతం

### పిడుగుపాటుకు యువకుడు, మహిళ మృతి

### నిర్మల్‌లో పిడుగుతో రెండు గొర్రెలు మృతి

### బూర్గంపాడు మండలంలో రెండు ఆవులు మృతి

**హైదరాబాద్, సెప్టెంబరు 20,ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడుతుండటంతోతెలంగాణలో ఆదివారం అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు పడ్డాయి. సిద్దిపేట జిల్లా వర్గల్ లో 5.2సెం.మి,జగదేవ్‌పూర్ 4.5,రంగారెడ్డిజిల్లా కేశంపేట్‌లో4.4 సెం.మి కొమురంభీం జిల్లా కెరామెరిలో 4.3సెం.మి సికిందరాబాద్ మోండా మార్కెట్‌లో1.7సెం.మి వర్షం కురిసింది. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం దేవీతండాలో పొలం వద్ద పిడుగు పడి చరణ్ అనే యువకుడు మృతిచెందాడు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని అవాల్పూర్ గ్రామ శివారులో ఆదివారం మధ్యాహ్నం పిడుగు పడటంతో సోడెం లత(43)మృతి చెందారు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని బొప్పాజీవాడ శివారులో పిడుగుపాటుకు సెల్‌ఫోన్ పేలి ఇద్దరు రైతులకు తీవ్ర గాయాలైనాయి. బాసర మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి చెట్టు రహదారిపై కూలిపోయింది. వివేకానంద చౌక్ నుంచి ఆలయానికి వెళ్లే మార్గంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ గోడను ఆనుకుని ఉన్న చెట్టు రోడ్డుపై పడిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిపై కూలిన చెట్టును తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు ఆదివారం సెలవుకావడంతో సరస్వతి మాతను దర్శించుకోవడానికి రాష్ట్రం నలుమూల నుంచి,పొరుగురాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులవాహనాలు కదలకపోవడంతో ఇబ్బందిపడ్డారు.నిర్మల్ జిల్లా కుంటాల మండలం విట్టాపూర్ గ్రామంలో ఆదివారం పిడుగుపాటు ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు పంట పొలాల్లో గొర్రెలను మేపుతుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అదే సమయంలో సమీపంలోని చెట్టుపై పిడుగు పడటంతో రెండు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. గొర్రెలను మేపుతున్న బేగడి చిన్న సాయన్న, లింగన్న, ధనంజయ్‌లకు గాయాలయ్యాయి. గ్రామస్థులు వెంటనే వారిని బైంసా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పిడుగు పడిన సమయంలో పెద్ద శబ్దంతో చెట్టుపై నిప్పు రవ్వలు చెలరేగి కిందకు పడటంతో ముగ్గురు కాపరులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకు గురయ్యారు. గాయపడిన ముగ్గురికి బైంసా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు గ్రామస్థులు తెలిపారు. గాంధారి మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఈ సమయంలో నూతనంగా నిర్మిస్తున్న సేవాలాల్ ఆలయంపై పిడుగు పడటంతో నిర్మాణంలో ఉన్న ఆలయ గోపురం దెబ్బతింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపాడు మండలం పరిధిలోని కృష్ణసాగర్ పంచాయతీ పరిధిలోని ఊర్లదాసుపల్లి గ్రామంలో శనివారం రాత్రి కురిసిన పిడుగుల వర్షానికి పశువులు మృతి చెందాయి. శనివారం రాత్రి ఈదురు గాలులతో భారీ వర్షం కురుస్తున్న సమయంలో పిడుగు పడటంతో రెండు ఆవులు మృతి చెందాయి.

పిడుగుపాటుతో పశువులను కోల్పోయిన బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. గీతాభవన్ చౌరస్తా నుంచి టూటౌన్ పోలీసుస్టేషన్ వరకు వాహనాలు నిలిచిపోవడంతో మంకమ్మతోట వేములవాడ వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడ్డారు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం ఉదయం పదిగంటల పడటం మొదలైంది.

## కెసిఆర్, రేవంత్ నయా నిజాంలు

### బిఆర్ఎస్, కాంగ్రెస్‌కు తెలంగాణ అభివృద్ధి పట్టదు

### దానం నాగేందర్‌కు ఉపఎన్నికలు కలిసిరావు

### బిజెపి ఎంపి రఘునందన్‌రావు విమర్శలు



ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మెదక్ ఎంపి రఘునందన్‌రావు

**హైదరాబాద్,సెప్టెంబరు20,ప్రభాతవార్త:** బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా ఈ రెండు పార్టీలు అడ్డుకున్నాయని ధ్వజమెత్తారు. అసెంబ్లీలో నీవు కొట్టినట్లు చెయ్యి.. నేను ఏడ్చినట్లుగా చేస్తా అన్నట్లుగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు డ్రామాలు చేశారు అని ఎద్దేవా చేశారు. వీరి డ్రామాలు ఒకే రకంగా ఉన్నాయని విమర్శించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు తెలంగాణ అభివృద్ధి పట్టదని ఆగ్రహించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు బుల్లెట్ ప్రూఫ్ బస్సులో బీఆర్ఎస్ నేతల ఫాంహౌస్‌లకు వెళ్లడం అవసరమా.? అని ప్రశ్నించారు. అధికార దుర్వినియోగం తప్ప ఏమి లేదని అన్నారు. భూముల రికార్డులన్నీ ప్రభుత్వం దగ్గర ఉన్నాయి కదా, మళ్లీ వెళ్లి చూడటం ఎందుకని రఘునందన్ రావు ప్రశ్నించారు.దానం నాగేందర్‌కు ఉపఎన్నికలు కలిసి రావని.. ఖైరతాబాద్‌లో మళ్లీ పోటీ చేస్తే ఓటమి తప్పదని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో తెలుగుదేశం పార్టీ నుంచి బీఆర్ఎస్‌లోకి.. ఆ తర్వాత బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారారని పేర్కొన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ వైపు వెళ్లడం దానం నాగేందర్‌కు రాజకీయ విధానంగా మారిందని విమర్శించారు. గతంలోనూ దానం నాగేందర్ ఉపఎన్నికల్లో ఓడిపోయారని.. ఇప్పుడు ఖైరతాబాద్‌లో మళ్లీ ఎన్నిక జరిగితే అదే పరిస్థితి ఎదురవుతుందని రఘునందన్‌రావు అన్నారు. ఖైరతాబాద్‌లో బీజేపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒకటేనని.. ఒకే తాను ముక్కలని విమర్శించారు. ప్రజలను పీడించిన నిజాం తరహాలోనే కేసీఆర్, రేవంత్‌రెడ్డి పాలన ఉందని ఆగ్రహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో నిజాంను పొగిడిన కేసీఆర్, రేవంత్ వీడియోలను రఘునందన్ రావు ప్రదర్శించారు. కేసీఆర్ లెక్కాపత్రం లేకుండా నిజాంను పొగిడారని మండిపడ్డారు. ఆదివాసీ బిడ్డలను ఇబ్బంది పెట్టింది ఎవరు.? అని ప్రశ్నించారు. రేవంత్, కేసీఆర్ ఇద్దరు ఎంఐఎంకు మద్దతుగా మాట్లాడుతు న్నారని దుయ్యబట్టారు. ఓల్డ్‌సిటీకి వెళ్లి ఇద్దరు మజ్లిస్‌ను పొగుడుతూనే ఉన్నారని ఎద్దేవా చేశారు. నిజాం సర్కార్ కొలువుల్లో 90 శాతం ముస్లింలే ఉండేవారని తెలిపారు. మహిళలతో దారుణంగా బతుకమ్మలు ఆడించిన నిజాం గొప్పవారని కేసీఆర్, రేవంత్ పొగుడుతున్నారా? అని ప్రశ్నించారు.

బైరాన్‌పల్లి ఘటనకు కారణమైన నిజాం ఎలా గొప్పవారు? అని ప్రశ్నించారు. శాసనసభలో నిజాంను పొగడటానికి ఆ ఇద్దరికి సిగ్గు లేదా? అని ఎద్దేవా చేశారు. నిజాం గొప్పవారైతే సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చేసిన ఆపరేషన్ పోలో తప్పా.? అని ప్రశ్నించారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఇద్దరు నయా నిజాంలు అని ఎద్దేవా చేశారు. నయా నిజాంలను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. దాశరథి చెప్పిన నిజాం రాజు తరతరాల బూజు అన్నది తప్పా ? అని ప్రశ్నించారు. కొమురం భీమ్, రాంజీ గోండు చేసిన ఉద్యమాలు తప్పా? అని ప్రశ్నించారు. నిజాం మీద బాంబులు వేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ.. నారాయణ రావు పవార్ పోరాటం తప్పా? అని అడిగారు. రామానంద తీర్థ, ఆర్య సమాజ్ చేసిన పోరాటాలు అర్థం లేనివా? అని ప్రశ్నించారు. నాడు కేసీఆర్ వెంట, నేడు కాంగ్రెస్ వెంట నడిచిన తోకపార్టీలు కమ్యూనిస్ట్ పార్టీలు అని ఎద్దేవా చేశారు. అన్ని విషయాలను ప్రజలు గమనిస్తున్నారని రఘునందన్‌రావు పేర్కొన్నారు.

## వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

### ప్రభుత్వానికి పిఎసిఎస్ రాష్ట్ర ఫోరం విజ్ఞప్తి

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:** తెలంగాణలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పిఎసిఎస్) పాలకవర్గాలకు జాప్యం లేకుండా ఎన్నికలు నిర్వహించాలని పిఎసిఎస్ రాష్ట్ర ఫోరం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడంతో నాబార్డ్ సహా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, రాయితీలు రైతులకు అందడం లేదని ఆందోళన వ్యక్తంచేసింది. ఈ మేరకు దీనికి సంబంధించి సహకార శాఖ ప్రత్యేక కమిషనర్ రాహుల్‌రాజ్‌కు పీఏసీఎస్ ఫోరం ప్రతినిధులు లేఖ రాశారు. సహకార సంఘాలకు ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు ప్రస్తుత పనిచేస్తున్న ఇన్‌ఛార్జి పాలకవర్గాలనే కొనసాగించాలని సూచించింది. తెలంగాణ సహకార సంఘాల చట్టం 1964 నిబంధనల మేరకు ప్రతి ఐదేండ్లకు సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నదని అందులో గుర్తుచేసింది. రాష్ట్రవ్యాప్తంగా 908 పీఏసీఎస్ సంఘాలు ఉండగా, వీటికి 2020 ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగాయని తెలిపింది. వాటి పదవీకాలం ముగిసి సంవత్సరం దాటినా ఇప్పటికీ ఎన్నికలు జరిపేందుకు ఎన్నికల ప్రాధికార సంస్థకు ప్రతిపాదనలు పంపకపోవడం దారుణమని అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇదే సమయంలో ఎలాంటి కారణాలు లేకుండా చట్టవిరుద్ధంగా పాలకవర్గాలను రద్దు చేస్తూ జీవో597 జారీ చేయడంపై హైకోర్టును ఆశ్రయించినట్టు వెల్లడించింది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం సదరు జీవోపై స్టే విధించి, జీవో386ను పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని పేర్కొంది. కాగా సహకార సంఘాలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని, నామినేటెడ్ వ్యవస్థను రద్దు చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో 906 సహకార సంఘాలు ఉండగా, ప్రస్తుతం అవి లాభాల బాటలో నడుస్తున్నాయి. వ్యవసాయానికి అవసరమైన పనిముట్లు, పరికరాల కొనుగోలు, ఉద్యోగుల జీతాలు తదితర ఖర్చులను సహకార సంఘాలే భరిస్తున్నాయి, ఇందులో ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా పెట్టుబడి పెట్టడం లేదు. అలాంటి సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పద్ధతిలో పాలకవర్గాలను నియమించేందుకు కొత్త జీవోలు తీసుకురావడం దుర్మార్గమైన చర్యగా పలువురు సహకార సంఘాలకు చెందిన పలువురు మాజీ అధ్యక్షులు ఆరోపిస్తున్నారు. కోర్టు ఆదేశాలను సైతం లెక్క చేయకుండా సహకార సంఘాలకు నామినేటెడ్ పద్ధతిలో పాలకవర్గాలను ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధమని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో గెలవలేమనే ఉద్దేశంతో, రైతులు ఓట్లు వేయరనే భయంతో ఎన్నడూ లేని విధంగా నామినేటెడ్ పద్ధతిలో చైర్మన్, పాలకవర్గాన్ని నియమించడం అన్యాయమని అంటున్నారు.

## కులగణనపై 100 రోజుల క్యాంపెయిన్‌కు వార్‌రూమ్ కోఆర్డినేటర్‌గా రుద్ర సంతోష్‌కుమార్

**హైదరాబాద్,సెప్టెంబరు20,ప్రభాతవార్త:** జాతీయ జనగణనలో కులగణన అంశంపై దేశవ్యాప్తంగా నిర్వహించనున్న 100 రోజుల క్యాంపెయిన్‌కు ఎఐసిసి వార్ రూమ్ కోఆర్డినేటర్‌గా రుద్ర సంతోష్ కుమార్‌ను నియమించారు. దేశవ్యాప్తంగా కులగణనపై అవగాహన కార్యక్రమాలు, రాష్ట్రాల వారీ కార్యాచరణ, శిక్షణ, సంస్థాగత సమన్వయం, డిజిటల్ మానిటరింగ్, వారపు పురోగతి నివేదికలు వంటి అంశాలను సమన్వయం చేసే విధంగా జాతీయ వార్ రూమ్ కార్యాచరణను రూపొందించనున్నారు. తెలంగాణ నుంచి ఢిల్లీ వరకు విస్తరించిన బాధ్యతెలంగాణలో కులగణన కార్యక్రమాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లిన సంస్థాగత అనుభవం అనంతరం, అదే అంశంపై జాతీయ స్థాయిలో 100 రోజుల క్యాంపెయిన్ రూపకల్పన, వార్ రూమ్ సమన్వయం, రాష్ట్రాల మానిటరింగ్ బాధ్యతలు రుద్ర సంతోష్ కుమార్‌కు అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# స్వర్ణరథంపై ఉభయదేవేరులతో బంగారుదేవుడు



**తిరుమల, సెప్టెంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచంలోనే అత్యంత సంపన్నవంతమైన దేవుడు.. భక్తుల పాలిట గోవిందుడుగా నిలిచిన తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆదివారం సాయంత్రం తనకెంతో ఇష్టమైన స్వర్ణరథంపై ఉభయదేవేరులతో కలసి ఊరేగారు. కలియుగ వైకుంఠమ్‌లో జరుగు తున్న వేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్స వాల్లో ఆరవరోజు సాయంత్రం బంగారు దేవుడు స్వర్ణాభూషిత అలంకృతుడై ధగధగ మెరిసే ఆభరణాలతో బంగారురథంపై భక్తులకు దర్శనమిచ్చాడు. సంధ్యాసమయంలో చల్లటిగాలులు వీస్తుండగా స్వర్ణ రథోత్సం ఒక విశిష్టమైన వాహనం. స్వర్ణమయమైన రథం ఆలయం వద్ద నుంచి బయలుదేరింది. ఈ స్వర్ణరథోత్స వంలో కల్యాణకట్ట మిరాశీదారులు సమర్పించిన ఒక సువర్ణఛత్రాన్ని తొలుత రథంపై అలంకరించారు. భగవంతుడు శైల్య, సుగ్రీవ, మేఘ, పుష్ప, పలహాకా అనే నాలుగు గుర్రాలు పూన్చిన రథమెక్కి విహరించాడు. దారుకుడు ఆయన సారధి. ఈ రథంమీద వయమినిస్తూన్న శ్రీమలయప్పస్వామిని దర్శించిన భక్తులు గోవిందనామంతో పునీతులయ్యారు. స్వర్ణరథాన్ని మహిళా భక్తులు లాగారు. స్వర్ణరథంలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, సినీనటుడు నందమూరి బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధర, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, భారత్ బయోటెక్ అధినేత్రి సుచిత్ర ఎల్లా, టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మహిళా భక్తులు పాల్గొన్నారు.

**బ్రహ్మోత్సవ సేవకులకు వేమిరెడ్డి దంపతులు వస్త్రాల బహూకరణ:** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్స వాల్లో భక్తిశ్రద్ధలతో సేవలందిస్తున్న శ్రీవారి ఆలయ అర్చకులు, వేదపారాయణ దారులు, ఇతర సిబ్బంది, పోటు సిబ్బంది, వాహన బేరర్లు, మేళం సిబ్బందికి ఆదివారం వస్త్ర బహుమానం అందించారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, టిటిడి బోర్డు సభ్యురాలు,ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కలిసి ఈ వస్త్ర బహుమానాన్ని అందజేశారు. తిరుమల వైభవోత్సవ మండపంలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి చేతుల మీదుగా సిబ్బందికి వస్త్రాలను అందించారు. ఇఒ ముద్దాడ రవిచంద్ర మీడియాతో మాట్లాడుతూ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు ప్రతి సంవత్సరం శ్రీవారి



బ్రహ్మోత్సవాల సందర్భంగా సేవలందించే సిబ్బందికి వస్త్ర బహుమానం అందిస్తున్నారని తెలిపారు. స్వామివారి సేవలో భాగస్వాములవుతున్న సిబ్బందిని ప్రోత్సహిస్తూ వస్త్ర బహుమానం అందించడం అభినందనీయమన్నారు. శ్రీవారి కృపాకటాక్షాలు వేమిరెడ్డి దంపతులకు, వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ ఉండాలని ఇఒఆకాంక్షించారు.

## 22 నుంచి రైతు రిజిస్ట్రేషన్ కోసం గ్రామాల్లో శిబిరాలు

**హైదరాబాద్,సెప్టెంబరు20,ప్రభాతవార్త:**రాష్ట్రంలో రైతు రిజిస్ట్రేషన్ (ఫార్మర్ ఐడీ) ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. రైతులు తమ గ్రామాల్లో ఏర్పాటు చేసే శిబిరాలకు హాజరై రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని వ్యవసాయ శాఖ సూచించింది. అగ్రిస్టాక్ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న రైతు రిజిస్ట్రేషన్ ద్వారా రైతులకు పలు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపింది. విత్తనాలు, పత్తి, మొక్కజొన్న తదితర పంటల కొనుగోళ్లకు, ఎరువుల విక్రయాల కోసం, బ్యాంకుల ద్వారా రుణాలు పొందేందుకు, కేంద్రరాష్ట్ర ప్రభుత్వ పథకాలు, సేవలు పొందేందుకు రైతు ఐడీ ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు. రైతు రిజిస్ట్రేషన్ కోసం రైతులు తమ ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్, భూమి వివరాలు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నెంబర్ వంటి వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. రైతులు తమకు కేటాయించిన వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఇఒ) వద్ద లేదా సంబంధిత సేవా కేంద్రంలో వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 22 నుంచి 30 వరకు గ్రామాల్లో నిర్వహించే శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకుని ఫార్మర్ ఐడీ నమోదు పూర్తి చేసుకోవాలని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేసింది.

## తిరుమల సమాచారం



# హనుమంతునిపై ‘కోదండరాముడు’

**తిరుమల, సెప్టెంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** అంజనాద్రీశుడు శ్రీవేంకటేశ్వరుడు ఆదివారం ఉదయం ప్రియదాసభక్తుడైన ఆంజనేయుడిపై కోదండరాముడుగా దర్శనమిచ్చాడు. ఏడుకొండల్లో అంగరంగవైభవంగా జరుగుతున్న సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఆరవరోజు ఆదివారం ఉదయం మలయప్పస్వామి విశేష అలంకారభూషితుడై వాహనమండపం వద్దకు వేంచేపుచేశారు. ఇక్కడ వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారిని హనుమంత వాహనంపై అధిరోహింపజేశారు. ఉదయం 8గంటలకు వాహనం ఆలయ మాఢ వీధుల్లో ప్రదక్షణగా బయలుదేరింది. ‘భక్తులు ఆదపమొక్కుల వాడా.. గోవిందా.. శ్రీనివాసా గోవిందా’ అంటూ నామస్మరణలతో తన్మయత్వం పొందారు. భక్తులలో అగ్రగణ్యుడైన హనుమంతుడు భగవంతునిపై అచంచలమైన భక్తి, సేవాభావం, శరణాగతికి ప్రతిరూపంగా నిలుస్తాడు. గురుశిష్యులైన శ్రీరాముడు, హనుమంతుల దివ్యసంబంధం భక్తి, జ్ఞానం, సేవాతత్వాల సమన్వయాన్ని చాటిచెబుతుంది. హనుమంత వాహనంపై కోదండరాముని దర్శించుకోవడం ద్వారా భక్తులకు భగవద్భక్తి, ధర్మనిష్ఠ, శరణాగతి భావాలు మరింతగా పెంపొందుతాయని ఆధ్యాత్మిక విశ్వాసం. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, బోర్డు సభ్యులు భానుప్రకాశ్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

**భగవంతుని వాహనం మోసిన అధికారులు:** సాక్షాత్తు శ్రీవారి చెంత ఉద్యోగులైన సేవకులుగానే భక్తులకు సేవలందించమేగాక తామూ ఆ దేవదేవుని దాసులమేనంటూ స్వయంగా టిటిడి అధికారులు తమ భుజాలపై హనుమంతవాహనాన్ని మోశారు. ఆ భగవంతుని చెంత సేవకులుగానే భక్తితో హనుమంతవాహనాన్ని భుజాలపై మోసి భక్తిని చాటుకున్నారు. ఆ దేవుని ముందు సేవకులుగా ఆనందపరవశులయ్యారు.

**దేశవిదేశాల కళా వైభవం:** సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ఉదయం హనుమంత వాహనసేవలో భక్తి, సంగీతం, నృత్యం, సంప్రదాయ కళారూపాలు మేళవించి ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. దేశంలోని వివిధ రాష్ట్రాలతో బాటు సింగపూర్ నుండి విచ్చేసిన కళాబృందాలు తమ



ప్రాంతాల విశిష్ట సంప్రదాయ కళారూపాలను ప్రదర్శించాయి. విభిన్న ప్రాంతాల కళారూపాలు ఒకే వేదికపై కొలువుదీరడంతో హనుమంత వాహనసేవలో భారతీయ సంస్కృతిలోని భిన్నత్వంలో ఏకత్వం సాక్షాత్కరించింది. భక్తి, సంప్రదాయం, కళా వైభవం సమ్మేళనంతో 10 రాష్ట్రాలు, సింగపూర్‌కు చెందిన 25 కళాబృందాల నుండి మొత్తం 681 మంది కళాకారులు పాల్గొని తమ కళానైపుణ్యాన్ని ప్రదర్శించారు. విశేష ప్రతిభ కనబరిచిన నాలుగు కళాబృందాలను టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర శాలువాతో సన్మానించారు.

# కుంటలో పడి ఇద్దరు బాలికలు మృతి

### అక్కాచెల్లెళ్ల మృతిపై మంత్రి సీతక్క దిగ్భ్రాంతి

### కుటుంబ సభ్యులకు ఫోన్‌లో పరామర్శ

**హైదరాబాద్,సెప్టెంబరు20,ప్రభాతవార్త:**ప్రమాదవశాత్తు కుంటలో పడి ఇద్దరు బాలికలు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా ములుగు మండలం కాసిందేవిపేట గ్రామానికి చెందిన ఎండీ అంజద్‌కు ఇద్దరు కుమార్తెలు. ఆదివారం సెలవు కావడంతో వారిని పొలం వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ రహీం కుంటను చూడడానికి వెళ్లారు. అనుకోకుండా చిన్న కూతురు ఎండీ ఆసియా(10) కుంటలో పడింది. ఆమెను కాపాడే ప్రయత్నంలో పెద్ద కూతురు ఎండీ సమ్యున్ (18) కుంటలో మునిగి మృతి చెందింది. పోలీసులు మృతదేహాలను శవ పంచనామా నిమిత్తం ములుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

ములుగు మండలం కాశిందేవిపేటలో నీటికుంటలో పడి మృతి చెందిన అహ్మద్ పాషా కుమార్తెలు సమ్యాన్, ఆసియా కుటుంబాన్ని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క ఫోన్‌లో పరామర్శించారు. ఇద్దరు పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులకు ధైర్యం చెబుతూ, కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ ఆసుపత్రిలో మృతదేహాలకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## 20 రాష్ట్రాలకు భారీ వర్ష సూచన

# నైరుతి నిష్క్రమణ

**హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త :** దేశంలో నైరుతి రుతుపవనాల కాలం ముగింపు దశకు చేరుకుంది. అయితే, ఈసారి రుతుపవనాలు సాధారణంగా కాకుండా భారీ వర్షాలు, ఉరుములతో కూడిన ఈదురుగాలులతో వీడ్కోలు పలుకుతున్నాయి. భారత వాతావరణ శాఖ తాజా నివేదిక ప్రకారం, దేశంలోని దాదాపు 20 కంటే ఎక్కువ రాష్ట్రాల్లో భారీ వర్షాలు, ఈదురుగాలులు విరుచుకుపడే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ నెలలో దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణం చల్లబడుతున్నప్పటికీ, నైరుతి రుతుపవనాల నిష్క్రమణ సమయంలో పలు రాష్ట్రాల్లో వాతావరణం ఒక్కసారిగా మారే అవకాశం ఉంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలతో పాటు గంటకు 70 నుంచి 75 కిలోమీటర్ల అత్యధిక వేగంతో తుఫాను గాలులు వీచే అవకాశం ఉంది. ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఈ తుఫాను ప్రభావం అత్యధికంగా కనిపించవచ్చు. తూర్పు భారతదేశంలో మెరుపులు పడే ప్రమాదం ఎక్కువగా ఉందని అధికారులు తెలిపారు. ఉత్తర ప్రదేశ్, బీహార్, ఢిల్లీ, పంజాబ్, హర్యానా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, గుజరాత్, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే దేశ రాజధాని ఢిల్లీకి ఎల్లో అలర్ట్ జారీ కాగా, గంటకు 20 నుండి 30 కి.మీ వేగంతో గాలులతో పాటు, తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. ఉత్తర ప్రదేశ్‌లోని ఆగ్రా, కాన్పూర్, మీరట్, గోరఖ్‌పూర్ సహా పలు జిల్లాల్లో ప్రతికూల వాతావరణం ఉండనుంది. బీహార్‌లోని పాట్నా, గయా, భాగల్పూర్, ముజఫర్‌పూర్ వంటి ప్రధాన జిల్లాల్లో భారీ వర్షాలు, మెరుపులతో కూడిన గాలులు వీయవచ్చు. పర్వత ప్రాంతాలైన హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూ కాశ్మీర్‌లలో ఎల్లో అలర్ట్ విధించారు. ఇక్కడ గంటకు 40 నుండి 65 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తూ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు.

# స్కిల్ వర్సిటీలో పాలిటెక్నిక్ విలీనంపై యూటర్న్

### సాంకేతిక విద్యా శాఖ పరిధిలోనే కాలేజీలు కొనసాగింపు

**హైదరాబాద్,సెప్టెంబరు20,ప్రభాతవార్త:**యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ విలీనం ప్రతిపాదనపై కాంగ్రెస్ ప్రభుత్వం యూటర్న్ తీసుకుంది. జీవో 97ను నిరసిస్తూ విద్యార్థి లోకం నిర్వహించిన 37 రోజుల ఉద్యమంతో సర్కార్ దిగొచ్చింది. దీంతో, వీలీనం నిర్ణయానికి బ్రేక్ పడింది. శక్తి శాఖలో ఉద్యోగుల కేటాయింపు విషయం కూడా ఇక్కడితో ముగిసినట్టే, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ విలీనం కోసం జూలై 3వ తేదీన విడుదల చేసిన 97 జీవోపై విద్యార్థి, అధ్యాపక లోకం భగ్గుమనడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. శక్తి శాఖలో ఉద్యోగుల కేటాయింపు అంశంపై కూడా తీవ్ర నిరసను వ్యక్తమవ్వడంతో.. కేకే కమిటీ పరిస్థితులపై సీఎం రేవంత్ రెడ్డికి నివేదిక అందించింది. దాంతో, పాలిటెక్నిక్ విలీనం ప్రతిపాదనపై సర్కార్ యూటర్న్ తీసుకుంది. కాబట్టి పాత పద్ధతిలోనే డిప్లొమా విద్య, సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కాలేజీల కొనసాగనున్నాయి. అలానే సాంకేతిక విద్యామండలి, ఏఐసీటీఈ విధానాలు యథాతథంగా ఉండనున్నాయి.

# రాహుల్ వ్యాఖ్యలపై బిజెపి ఫైర్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 20:** కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్ర మోడీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు, హావభావాలు ఇప్పుడు రాజకీయంగా పెద్ద దుమారాన్ని రేపుతున్నాయి. ఇండోర్‌లో శనివారం జరిగిన ఛాత్రోం కీ గూంజ్ కార్యక్రమం లో స్టాండప్ కమెడియన్ పుల్కిత్ మణితో కలిసి రాహుల్ గాంధీ వేదికపై ప్రధాని మోడీని అనుకరించారు. దీనిపై బీజేపీ నేతలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. ఇది దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మండిపడుతున్నారు. ఈ ఘటనపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ తీవ్రంగా స్పందించారు. ‘వృద్ధురాలైన తల్లిని అవమానించేలా ఉన్న వ్యాఖ్యలను చూసి రాహుల్ గాంధీ వేదికపై గట్టిగా నవ్వారు. సభ్య సమాజంలో ఎవరూ హర్షించని ఇలాంటి చేష్టలను ఆయన ప్రోత్సహించారు. ఇలాంటి సంస్కృతి వల్లే కాంగ్రెస్ పార్టీ యువతకు దూరం అవుతోందని కేశవన్ విమర్శించారు. ఢిల్లీ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ (డీయూఎస్‌యూ) ఎన్నికల్లో కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఓటమికి రాహుల్ ద్వేషపూరిత రాజకీయాలే కారణమని ఆయన ఆరోపించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అనుబంధ విద్యార్థి సంస్థ ఏబీవీపీ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ప్రధాని మోడీ వృద్ధురాలికి కుర్చీ వేసి గౌరవిస్తే, రాహుల్ గాంధీ మాత్రం పెద్దలను అవమానిస్తుంటే ఆనందపడ్డారు. ఇలాంటి సర్కస్ షోలను ప్రోత్సహించే రాహుల్‌ను సీరియస్ రాజకీయ నాయకుడిగా పరిగణించలేం’ అని కేశవన్ వ్యాఖ్యానించారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి కూడా రాహుల్ తీరుపై మండిపడ్డారు. రాహుల్ వాడే భాష రోజురోజుకు దిగజారిపోతోందని అన్నారు. ఆయన వ్యాఖ్యలు భారత రాజకీయాల గౌరవానికి ఒక మచ్చ లాంటివని, దేశ ప్రజలు నేతల మాటలను, విలువలను గమనిస్తున్నారని, అందుకే కాంగ్రెస్‌ను పదేపదే తిరస్కరిస్తున్నారని తెలిపారు. ఇండోర్ కార్యక్రమంలో పుల్కిత్ మణితో కలిసి రాహుల్ గాంధీ ప్రధాని మోడీ విదేశీ పర్యటనలపై వ్యంగ్యాస్త్రాలను సంధించారు.

# లక్షలాది మంది వీక్షించిన గరుడసేవ

- సంతృప్తికర దర్శనంపై ఆనందం
- శ్రీవారి సేవకులు, పోలీసులు, ఉద్యోగుల సేవలు అభినందనీయం



**తిరుమల, సెప్టెంబరు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** పెరటాసి మాసం... వారాంతం తిరుమలగిరుల్లో అంగరంగ వైభవంగా జరుగుతున్న సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు శనివారం రాత్రి గరుడవాహనసేవ విజయవంతంగా తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించింది. నెలరోజుల పక్కా ప్రణాళికలు.. కార్యాచరణతో టిటిడి ఉద్యోగులు, తిరుపతి జిల్లా పోలీసుయంత్రాంగం, టిటిడి నిఘాభద్రత విభాగం సమన్వయంతో పనిచేయడంతో 3లక్షల మంది భక్తులకు గరుడవాహన వీక్షణం ప్రశాంతంగా చేయించారు. సాధారణంగా ఏడుకొండలపై 70వేల మంది భక్తులు పెరిగితేనే అటు స్వామివారి దర్శనం ఇటు వసతి సదుపాయం గగనంగా మారుతుంది. టిటిడి అధికారులు తలలుపట్టుకునే పరిస్థితి ఎదురవుతుంది. అలాంటిది ఒక్కసారిగా 3.50 లక్షల మంది భక్తులు తిరుమలకొండపై ఉండటంతో ఓ వైపు మాఢవీధులు కిటకిటలాడినా చిన్నపాటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించడం టిటిడి పనితీరు అభినందనీయంగా మారింది. ఆలయ మాఢవీధుల్లోని గ్యాలరీల్లో గంటలుగంటలు నిరీక్షించినా, ప్రతి భక్తునికి శ్రీవారిసేవకులు, పోలీసులు, టిటిడి నిఘాభద్రత సిబ్బంది, ఉద్యోగులు చక్కటి సేవలందించి అన్నప్రసాదాలు, తాగునీరు, టీ, ప్రత్యేక ప్రసాదాలు అందించి భక్తుల మన్ననలు అందుకున్నారు. సాధారణ రోజుల్లో రోజుకు 80వేల మంది నుంచి 90వేల మంది వరకు భక్తులు వస్తున్న తిరుమలకొండపై 3లక్షల మందికి సేవలుచేయడం టిటిడికి పెద్ద క్లిష్టమైన సమస్య కాదు.. అయితే శనివారం ఆపై గరుడసేవరోజు విచ్చేసిన అశేషభక్తులకు నిరంతరాయంగా సకల సదుపాయాలు కల్పించడం వెనుక టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, బోర్డు సభ్యులు, టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తమతమ సిబ్బందితో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ స్వయంగా పరిశీలించారు. గరుడవాహనసేవను విజయవంతం చేసి భక్తులకు సకల సేవలందించిన టిటిడి అధికారులు, సిబ్బంది, పోలీసు, స్కౌట్స్ గైడ్స్, శ్రీవారి సేవకుల సమిష్టి పనితీరును టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పత్యేకంగా అభినందించారు. శనివారం మధ్యాహ్నానికే 3లక్షల మంది భారీసంఖ్యలో భక్తులు తిరుమలకొండపైకి తరలిరావడం, మాఢవీధు ల్లోని గ్యాలరీల్లో దాదాపు 2లక్షల మంది భక్తులు వుండటం.. వెలుపల మరో 70వేలు, కొండపై మరో 50వేల వరకు పలుచోట్ల వేచివున్న భక్తులకు సకల సౌకర్యాలు సేవలందించారు. గరుడసేవ సందర్భంగా విధులు నిర్వర్తించిన ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది సమన్వయం, క్రమశిక్షణ, అప్రమత్తతతో బాధ్యతలు నిర్వర్తించి గరుడసేవ ప్రశాంతంగా ముగిసేలా కృషి చేసినందుకు ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ప్రత్యేకంగా అభినందించారు. రానున్న బ్రహ్మోత్సవ కార్యక్రమాల్లో కూడా ఇదే స్థాయిలో సమన్వయంతో, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వహించాలని సూచించారు.

# నేను బహుజనుల బాణాన్ని.. తదుపరి సిఎం నేనే



మాట్లాడుతున్న తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

### కాంగ్రెస్‌ను గద్దె దించాల్సిందే

### ప్రజలు ఆశీర్వదిస్తే రేవంత్, కెసిఆర్, మోడీతో పోరాడుతా: టిఆర్ఎస్ చీఫ్ కవిత

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 20, ప్రభాతవార్త :** 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే కోస్గి కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో తాను, చంద్రబాబు, రేవంత్‌రెడ్డి మహా కూటమి తరపున ప్రకారం చేశామని, ఆరోజు కోస్గి సభలో పాల్గొన్న చంద్రబాబు, రేవంత్‌రెడ్డి సిఎంలు అయ్యారని.. వచ్చే ఎన్నికల్లో గెలిచి తాను సిఎం అవుతానని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ధీమా వ్యక్తం చేశారు. కొడంగల్ నియోజకవర్గం కోస్గిలో ఆదివారం నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో కవిత మాట్లాడారు. ‘నేను బహుజనుల బాణాన్ని.. యువజనుల యుద్ధ నినాదాన్ని,. అంబేద్కర్ వాదాన్ని. పూలే ఆత్మగౌరవ నినాదాన్ని.. సావిత్రి భాయ్ పూలే ఆశయాలను నింపుకొని నిటారుగా నిలబడి మగమహారాజులకు ఛాలెంజ్ విసురుతున్న వీరవనితను నేను’ అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. తనను బీఆర్ఎస్ వదిలిన బాణమని కొంతమంది, కాంగ్రెస్ బాణం అంటూ మరికొంతమంది చేస్తున్న విమర్శలకు కొడంగల్ వేదికగా గట్టి కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ప్రజలు ఆశీర్వదిస్తే రేవంత్ రెడ్డి, కేసీఆర్, మోడీలతో పోరాటం చేసి చూపిస్తానన్నారు. తనకోసమో, కొంతమంది నాయకుల కోసమో పార్టీ పెట్టలేదని, తెలంగాణ ప్రజల జీవితాలను మార్చేందుకే తెలంగాణ రక్షణ సేన పెట్టానని చెప్పారు. జనంబాటలో నాగర్ కర్నూల్ ప్రభుత్వ హాస్పిటల్ కు వెళ్తే అక్కడి పరిస్థితిని ఓ మహిళ తనకు చెబుతుంటే ఎంతో ఆవేదన చెందానన్నారు.

**పదిలక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వకపోతే పేరు మార్చుకుంటా..**

రాష్ట్రంలో రైతుల పరిస్థితి పై కవిత ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా, కరెంట్, నీళ్లు, రైతు భరోసా, మద్దతు ధర ఇలా ప్రతి దానికి రైతులు బాధపడే పరిస్థితి వచ్చిందని చెప్పారు. అధికారుల కాళ్లపై పడి రైతులు వేడుకుంటున్న సంఘటనలు హృదయాన్ని కలిచి వేస్తున్నాయన్నారు. తాము అధికారంలోకి వచ్చాక జురాల నుంచి నీటిని ఎత్తిపోసి కొడంగల్, మక్తల్, నారాయణ్ నుంచి ఇబ్రహీంపట్నం వరకు 10 లక్షల ఎకరాలకు నీళ్లిస్తామని భరోసా ఇచ్చారు. లేదంటే పేరు మార్చుకుంటానని సవాల్ విసిరారు.

**బలవంతుడినని వీర్రవీగుతున్న ముఖ్యమంత్రి**

రాష్ట్రంలో సామాజిక అన్యాయం జరుగుతోందని కవిత అన్నారు. ఏ వర్గానికి కూడా వారి జనాభాకు తగిన విధంగా అవకాశాలు రావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ముఖ్యమంత్రి బలవంతుడనని వీర్రవీగుతున్నాడని...కానీ బలవంతమైన సర్పం చలిచీమల చేతిలో చని పోయినట్లుగా ఆయనకు పరాభవం తప్పదన్నారు. రాష్ట్రంలో లంబాడాలు లేని తొలి ప్రభుత్వం ఇదేనని ఆమె చెప్పారు. ఈ పరిస్థితి మారాలంటే బహుజనం రాజ్యం రావాలంటే కచ్చితంగా కాంగ్రెస్ ను గద్దె దించాల్సిందేనని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లకు కూడా డబ్బులు అడుగుతున్నారని కవిత చెప్పారు. గద్వాల జిల్లాలోని గట్టు, కేటిదొడ్డు మండలాల్లో అఫ్ఘనిస్తాన్ తో సమానంగా అక్షరాస్యత ఉందని...అందుకు సిఎం సిగ్గుపడాలన్నారు.

# గ్రామీణ ఉపాధి కల్పనలో కోదాడ మెగా జాబ్‌మేళా మైలురాయి

### 30 వేలకుపైగా రిజిస్ట్రేషన్లు, 5,725 మంది అభ్యర్థుల షార్ట్‌లిస్ట్: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబరు20,ప్రభాతవార్త:** విద్యావంతులైన గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను చేరువ చేయాలన్న లక్ష్యంతో నిర్వహించిన కోదాడ మెగా జాబ్ మేళా విజయవంతమైంది. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవతో సుమారు 350 కంపెనీలు ఒకే వేదికపైకి రాగా, 30 వేల మందికిపైగా ఉద్యోగార్థులు నమోదు చేసుకున్నారు. వివిధ దశల్లో నిర్వహించిన ఇంటర్వ్యూల అనంతరం 5,725 మంది అభ్యర్థులు తదుపరి నియామక ప్రక్రియకు షార్ట్‌లిస్ట్ అయ్యారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి నేతృత్వంలో శనివారం నిర్వహించిన ఈ భారీ నియామక కార్యక్రమం గ్రామీణ నిరుద్యోగ సమస్యను ప్రధానాంశంగా తీసుకుంది. భౌగోళిక దూరం, ఉద్యోగ సమాచార లోపం, ఆర్థిక పరిమితుల కారణంగా ప్రముఖ సంస్థలను చేరుకోలేకపోతున్న గ్రామీణ యువతకు స్థానికంగానే అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఈ మేళాను నిర్వహించారు. సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన యువత ఈ మేళాలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమాచార సాంకేతికత, ఫార్మా, తయారీ, వైద్య ఆరోగ్య రంగం, బ్యాంకింగ్, రిటైల్‌తోపాటు వివిధ రంగాలకు చెందిన సంస్థలు అభ్యర్థుల విద్యార్హతలు, నైపుణ్యాలను పరిశీలించి ప్రత్యక్ష ఇంటర్వ్యూలు నిర్వహించాయి. గ్రామీణ కుటుంబాలు ఎన్నో త్యాగాలు చేసి తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నప్పటికీ, వారికి సరైన సమయంలో ఉద్యోగ సమాచారం అందడం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్, పాలిటెక్నిక్ తదితర కోర్సులు పూర్తి చేసిన యువత ఉద్యోగ అవకాశాలను గుర్తించడం, సంస్థలను సంప్రదించడం, ఇంటర్వ్యూల కోసం పదేపదే నగరాలకు వెళ్లడం వంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వివరించారు. ఒక యువకుడి గ్రామ చిరునామా లేదా కుటుంబ ఆర్థిక పరిస్థితి అతని ఉద్యోగ అవకాశాలకు అడ్డంకిగా మారకూడదన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. అర్హులైన ఉద్యోగుల కోసం ఎదురుచూస్తున్న కంపెనీలు, తొలి అవకాశం కోసం నిరీక్షిస్తున్న గ్రామీణ యువతను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా వారి మధ్య ఉన్న అంతరాన్ని ఈ మేళా తగ్గించిందన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతలు, నైపుణ్యాలను నేరుగా సంస్థల ప్రతినిధుల ముందు ప్రదర్శించడంతోపాటు సంఘటిత రంగంలో ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన అర్హతలు, నైపుణ్యాలపై అవగాహన పొందారని తెలిపారు. గత ఏడాది హుజూర్‌నగర్‌లో నిర్వహించిన జాబ్ మేళా అనుభవానికి కొనసాగింపుగా కోదాడలో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృత స్థాయిలో చేపట్టారు. పారిశ్రామికవేత్తలు, విద్యాసంస్థలు, ఐదు జిల్లాల అధికార యంత్రాంగంతో ముందస్తుగా సమన్వయం చేసుకుని యువతను పెద్ద ఎత్తున సమీకరించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఈ కార్యక్రమానికి సహకారం అందించాయి. జాబ్ మేళాలో పాల్గొన్న యువతను ఉద్దేశించి శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ, గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలను చేరువ చేయడంలో కోదాడ మెగా జాబ్ మేళా రాష్ట్రంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ప్రశంసించారు. ఒకే వేదికపైకి సుమారు 350 కంపెనీలను తీసుకురావడం అసాధారణమైన ప్రయత్నమన్నారు.

## బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన కిరణ్‌కుమార్

**హైదరాబాద్,సెప్టెంబరు20,ప్రభాతవార్త:** తెలంగాణ నుంచి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బిసిఐ) సభ్యుడిగా ఎన్నికైన జి. కిరణ్ కుమార్ ఆదివారం ఢిల్లీలో బిసిఐ సభ్యుడిగా అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మన్నన్ కుమార్ మిశ్రాతో పాటు పలువురు బీసీఐ సభ్యులు హాజరయ్యారు. తెలంగాణ నుంచి పదవీకాలం ముగించుకుంటున్న బీసీఐ సభ్యులు విష్ణు వర్ధన్ రెడ్డి కూడా కార్యక్రమానికి హాజరై కిరణ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జి.కిరణ్ కుమార్ గారు సిద్దిపేటలో జన్మించి పెరిగారు. గత 25 సంవత్సరాలకు పైగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతూ, న్యాయవాదుల సమస్యలు, సంక్షేమ కార్యక్రమాల్లో చురుకుగా పనిచేస్తున్నారు. ఆయన నాంపల్లి మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్ట్స్ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా, అనంతరం అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. బీసీఐ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కిరణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ న్యాయవాదుల సమస్యలు, అవసరాలు, వారి హక్కులను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా దృష్టికి తీసుకెళ్లి, న్యాయవాదుల సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధి, రక్షణ కోసం నిజాయితీగా పనిచేస్తానని తెలిపారు.

# రైతు రుణాలకు 12 నెలల మారటోరియం

**తక్షణ ఆర్థిక అవసరాలకు కొత్త అప్పులు మంజూరు**
**45 రోజుల లోపు సహాయ ప్యాకేజీ**
**కరవు ప్రాంతాలుగా 24 జిల్లాల్లో 101 తాలూకాలు**
**కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వ కీలక నిర్ణయాలు**

హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాత వార్త: ఎల్ నినో తో ఏర్పన వర్షాభావం, కరవు పరిస్థితులను అధిగమించేందుకు పక్కనే ఉన్న కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలోని కరవు పీడిత ప్రాంతాలను ప్రకటించింది. వీటిని రెండు రకాల కరవు ప్రాంతాలుగా వర్గీకరించింది. రాష్ట్రంలోని 24 జిల్లాల్లో 101 తాలూకాలను కరవు పీడిత ప్రాం తాలుగా ప్రకటించగా, వీటిలో 89 తీవ్ర కరువు పీడిత ప్రాంతాలుగా, 12 మధ్యస్థంగా కరవు పీడి త ప్రాంతాలుగా ఉన్నాయి. రాష్ట్రంలోని కరవు పీడిత తాలూకాలలో కిసాన్ క్రెడిట్ కార్డ్ (కెసిసి) రుణాలు, వ్యవసాయ రుణాలు, పాడిపరిశ్రమ, పట్టు పరిశ్రమ, మత్స్య పరిశ్రమ, ఇతర అనుబంధ వ్యవసాయ కార్యకలాపాలకు సంబంధించిన రుణాల చెల్లింపుపై అక్కడి ప్రభుత్వం 12 నెల ల మారటోరియంను ప్రకటించింది. మధ్యస్థంగా కరవు పీడిత తాలూ కాలలో రుణ చెల్లింపు గడువును 36 నెలలకు, తీవ్రంగా కరవు పీడిత తాలూకాలలో 60 నెల లకు పొడిగిం చనున్నారు. దీనికి సంబంధించి ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఇటీవల రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల (ఎస్ఎల్బిసి) సమా వేశాన్ని నిర్వహించి వ్యవసాయ రుణాలకు సం బంధించి రైతులకు ఉపశమనం కలిగించే నిర్ణయాన్ని తీసుకుంది. ప్రస్తుత రుణాల చెల్లింపును వాయిదా వేయడంతో పాటు, రైతుల తక్షణ ఆర్థిక అవసరాలను తీర్చడానికి బ్యాంకులు తమ నియమ నిబంధనలకు లోబడి కొత్త రుణాలను అందిస్తాయని రాష్ట్ర ప్రభుత్వం ఒక పత్రికా ప్రకటనలో తెలిపింది. సహకార బ్యాంకుల నుండి తీసుకున్న రుణాల తిరిగి చెల్లింపు గడు వును పొడిగించే అంశంపై జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డ్)తో చర్చించి తగిన ఉపశమన ప్యాకేజీని రూపొందిస్తామని ప్రధాన కార్యదర్శి తెలిపారు. భవిష్యత్తులో ప్రభుత్వం అదనపు తాలూకాలను కరవు పీడిత ప్రాంతాలుగా ప్రకటిస్తే, ప్రత్యేక ఎస్ఎల్బిసి సమావేశం అవసరం లేకుండానే ఈ సహాయక పథకం స్వయంచాలకంగా వర్తిస్తుందని కూడా ఆ ప్రకటనలో పేర్కొంది. అలాగే ఈ ఏడాది రైతుల నుంచి బలవంతపు వసూళ్లకు వ్యతిరేకంగా కఠినమైన జీరోటాలరెన్స్ విధానాన్ని కూడా అమలులోకి తెచ్చింది. రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందించి, ఎలాంటి వసూలు ప్రక్రియ చేపట్టే ముందే సంబంధిత బ్యాంకులను సంప్రదించాలని జిల్లా యంత్రాంగాలకు ఆదేశాలు జారీ చేసింది. కరవు ప్రకటన వెలువడిన 45 రోజులలోపు, అంటే 2026 అక్టోబర్ 11 నాటికి సహాయ ప్యాకేజీని అమలు చేయాలి. 135రోజులలోపు, అంటే 2027 జనవరి 9 నాటికి మొత్తం సహాయ ప్రక్రియను పూర్తి చేయాలని బ్యాంకులను ఆదేశించారు. ఎస్ఎల్బిసి కన్వీనర్ బ్యాంకు అయిన కెనరా బ్యాంక్, ఎస్ఎల్బిసి సమావేశం యొక్క తుది కార్యకలాపాలను సెప్టెంబర్ 26 లోగా సంబంధిత పోర్టల్లలో అప్లోడ్ చేస్తుంది.


సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 26 ఎస్సీ కులాల ముఖ్య నాయకులు, మేధావుల సమావేశం

## రోస్టర్ విధానంతో మాలలకు తీవ్ర అన్యాయం

### 26 ఎస్సీ కులాల ప్రతినిధుల సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదం

హైదరాబాద్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త : రోస్టర్ విధానం కారణంగా మాలలు, సంబంధిత 26 ఎస్సీ కులాలు తీవ్రంగా రిజర్వేషన్ల కోల్పో తున్నాయని, ఈ విధానాన్ని తక్షణమే సవరించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేష్ బాబు అధ్యక్షతన మాల, 26 ఎస్సీ కులాల ముఖ్య నాయకులు, మేధావుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు కీలక డిమాండ్లతో తీర్మానాలను ఆమోదించారు. ప్రస్తుత రోస్టర్ విధానాన్ని సవరించి, మొదటి 20 రోస్టర్ పాయింట్లలో మాలలకు కనీసం రెండు పాయింట్లు కేటాయించాలని, మాదిగ గ్రూపులో చేర్చిన పంబాల, మన్నె కులాలను తిరిగి మాల గ్రూపులోనే చేర్చాలని, మాల కులానికి ప్రత్యేక సీరియల్ నంబరును కేటాయించాలన్నారు. మాదిగ వర్గానికి గ్రూప్1, గ్రూప్2లుగా విభజించినట్లే, మాలలను కూడా రెండు గ్రూపులుగా వర్గీకరించాలి. ఎస్సీలకు నిర్ణయించిన 15 శాతం రిజర్వేషన్ పూర్తిగా అమలు కావడం లేదని, కేవలం 10 శాతమే అమలవుతోందని పేర్కొన్నారు. మాలలకు కేటాయించిన 5 శాతం రిజర్వేషన్ను పక్కాగా అమలు చేయాలన్నారు. 9 శాతం జనాభా ఉన్న వర్గాలకు గ్రూప్1, గ్రూప్2ల ద్వారా 10 శాతం రిజర్వేషన్ కేటాయించిన తరహాలోనే, మాలలను రెండు గ్రూపులుగా చేసి 7 శాతం రిజర్వేషన్ కల్పించాలి. ఎస్సీ రిజర్వేషన్ శాతాన్ని 18 శాతానికి పెంచే క్రమంలో, పెరిగే రిజర్వేషన్ నుంచి 2 శాతాన్ని మాల మరియు దాని అనుబంధ 26 కులాలకు కేటాయించాలి. రోస్టర్ విధానాన్ని శాస్త్రీయంగా సవరించే వరకు ఎలాంటి ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయకూడదు. ఈ సమావేశంలో ఉస్మానియా విద్యా మండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ జి.వెంకట రాజం, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈశ్వరయ్య, టీపీపీఎ ప్రధాన కార్యదర్శి సుదమల్ల వెంకటస్వామి, మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు కొండ్ర రాజలింగం, జాతీయ కార్యదర్శి వెంగల యాదగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వలికె కృష్ణమూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ మార్తాపుడి రాందాస్, అంబేద్కర్ సేన నేషనల్ ప్రెసిడెంట్ మన్నే శ్రీధర్ రావు, మాల సంఘాల జేఏసీ గౌరవ చైర్మన్ చెరుకు రామచందర్, మాల వెలుగు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కావాలి అనంతరాములు తదితరులు పాల్గొన్నారు.

## ఆటోడ్రైవర్పై దాడి: చికిత్స పొందుతూ మృతి

చాంద్రాయణగుట్ట, సెప్టెంబరు 20, ప్రభాతవార్త : ఆటో అద్దె విషయమై జరిగిన గొడవలో ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి ఫలక్నుమా పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వట్టేపల్లి నైస్ హోటల్ ప్రాంతంలో ఆటో డ్రైవర్ మహ్మద్ ముఖ్తం (42)కు భార్య, నల్గురు పిల్లలున్నారు. నైస్ హోటల్ వద్ద ఆటోడ్రైవర్కు, ఒక యూట్యూబర్కు మధ్య ఆటో అద్దె విషయమై గొడవ జరిగింది. దీంతో ఆగ్రహించిన యూట్యూబర్, అతని అనుచరులు ముఖ్తంపై మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ దాడిలో ఆటో డ్రైవర్కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతనిని చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఇన్స్పెక్టర్ అప్పల నా యుడు, సిబ్బంది ఆసుపత్రిన్ని సందర్శించి ఘటనపై ఆరా తీశారు. పూర్తి వివరాలు తెలి యాల్సి ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు బిజెపి ఎస్టి విభాగం ఆధ్వర్యంలో ఛలో ఇండస్ట్రియల్ కమిషనరేట్

హైదరాబాద్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త: బిజెపి ఎస్టి మోర్చా ఆధ్వర్యంలో ఛలో ఇండస్ట్రియల్ కమిషనరేట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్టి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు నేనావత్ రవి నాయక్ తెలిపారు. రాష్ట్రంలోని గిరిజనులకు సంబంధించిన ఎస్టి ఇండస్ట్రీస్ సబ్సిడీల పెండింగ్ నిధుల విడుదల కోసం నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధి కారంలోకి వచ్చిన గత మూడు సంవత్సరాలుగా ఎస్టి ఇండస్ట్రీస్ సబ్సిడీలు విడుదల కాకపోవడంతో, సుమారు 35,000 మంది శాంక్షన్ దారులకు దాదాపు రూ.1,700 కోట్ల మేర నిధులు పెండింగ్లో ఉన్నాయని అన్నారు. పెండింగ్లో ఉన్న సబ్సిడీ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, బాధితుల పక్షాన నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు.

## సేల్ డీడ్లతో రిజిస్ట్రేషన్ సమస్యకు పరిష్కారం: మధుయాష్కి గౌడ్

వనస్థలిపురం, సెప్టెంబరు 20 ప్రభాతవార్త : సేల్ డీడ్ జారీతో రిజిస్ట్రేషన్ సమస్యకు పరిష్కారం లభించడంపై వివిధ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన మాజీ ఎంపీ, ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ మధుయాష్కి గౌడ్కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్లోని ఎస్కేడీ నగర్ కాలనీ వివేకానంద పార్క్, రాజీవ్ గాంధీ పార్కులను సందర్శించిన మధుయాష్కి గౌడ్కు కాలనీవాసులు కలిసి స్వీట్లు తినిపించి అభినందించారు. వైదేహి నగర్, బి.ఎన్.రెడ్డి నగర్, శ్రీపురం తదితర కాలనీల ప్రతినిధులు మాట్లాడుతూ.. గతంలో జీవో 118 కింద డీడ్ ఆఫ్ కన్వేయన్స్ మాత్రమే ఇవ్వడంతో బ్యాంకు రుణాలు, తనఖా, బహుమతి పత్రాల విష



యంలో ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. సమస్యను మధుయాష్కి గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా, న్యాయవాదిగా జీవోలోని లోపాలను పరిశీలించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిల తో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన సూచనల మేరకు మార్పులు చేసి పూర్తి యాజమాన్య హక్కులతో సేల్ డీడ్లు అందించడం సంతోషంగా ఉందన్నారు. మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ సేల్ డీడ్లతో ప్రజలకు తమ ఆస్తులపై పూర్తి యాజమాన్య హక్కులు లభించడంతో పాటు ఆస్తుల విలువ కూడా పెరిగిందన్నారు. ఇకపై ఆస్తుల విక్రయం, బహు మతి, తనఖా, బ్యాంకు రుణాల విషయంలో ప్రజలకు ఇబ్బందులు ఉండవని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల సమస్యను పరిష్కరించాలనే లక్ష్యంతో రిజిస్ట్రేషన్ సమస్యపై ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఆస్తులను నిషేధిత జాబితా నుంచి తొలగించే అంశంపైనా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేత ముద్దగోని రామ్మోహన్ గౌడ్, మాజీ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి, రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పర్వత గణేష్ రెడ్డి, సీనియర్ నాయకుడు మకుటం సదాశివుడు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎస్పిఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలి: సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే



ఛత్రపతి సంభాజీనగర్, సెప్టెంబరు 20: మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్లో సంస్కరణలు చేపట్టాలని, కమిషన్ చైర్మన్ వివేక్ భీమన్వర్ రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతాపార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే డిమాండ్ చేశారు. భీమన్వర్పై అవినీతి ఆరోపణలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఛత్రపతి సంభాజీనగర్లో ఆదివారం రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో జరిగిన సమావేశంలో దీప్కే మాట్లాడారు. భీమన్వర్ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ప్రతి అభ్యర్థి రెండు నిమిషాల నిడివి గల వీడియోను ఇన్స్టాగ్రామ్లో పోస్ట్ చేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో 15-20 లక్షల మంది యువత నిరుద్యోగులుగా ఉండటం ఆ రాష్ట్రానికి మంచిది కాదని అన్నారు. భీమన్వర్ గతంలో రవాణా కమిషనర్గా ఉన్న సమయంలో ఆర్టీఓ కుంభకోణం, డ్రైవింగ్ లైసెన్సులు, 'నంబర్ ప్లేట్ల'కు సంబంధించి పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారని దీప్కే ఆరోపించారు. ఈ వ్యవహారాల్లో కమీషన్ల రూపంలో ఎంత మొత్తం ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్కు చేరిందనే ప్రశ్న తలెత్తుతోందని ఆయన అన్నారు. భీమన్వర్ పదవిలో కొనసాగితే ఆ కమీషన్ల వ్యవహారం కొనసాగుతుందేమోనని దీప్కే ఆరోపించారు. ఈ డబ్బుతో ఎంపీలు, ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తున్నారా అని ఆయన ప్రశ్నించారు. భీమన్వర్ రాజీనామా చేయడం ద్వారా మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్లో సంస్కరణలకు శ్రీకారం చుట్టాలని దీప్కే డిమాండ్ చేశారు. ఎంపిఎస్సీ గ్రూప్ ఇన్స్పెక్టర్ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ అయినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో గతంలో భారీగా నిరసనలు జరిగాయి. భీమన్వర్తో పాటు కమిషన్ కార్యదర్శి కూడా రాజీనామా చేయాలని పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు, వివిధ రాజకీయ వర్గాలు డిమాండ్ చేశాయి. అయితే భీమన్వర్ తన రాజీనామాను కోరడాన్ని తిరస్కరించారు. తాను బాధ్యతలు చేపట్టకముందే గ్రూప్ ఇన్స్పెక్టర్ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ ఘటన జరిగిందని ఆయన తెలిపారు. మహారాష్ట్రలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్యను దీప్కే ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్పై విమర్శలు చేశారు. ఎన్నికలకు ముందు ఫడ్నవీస్ చేసిన 'మీ పున్నా యేయీన్ (నేను మళ్లీ వస్తాను)' వ్యాఖ్యలను ప్రస్తావించిన దీప్కే, ఎంఎస్పీఎస్సీ అభ్యర్థుల సమస్యలను ముఖ్యమంత్రి పట్టించుకోకపోతే ఆయన మళ్లీ అధికారంలోకి వస్తారనే నినాదం చేయలేరని వ్యాఖ్యానించారు. ఫడ్నవీస్ కష్టపడి పనిచేస్తారనే కారణంతో నాకు ఆయనంటే ఇష్టం. ఉదయం 5 గంటలకు లేచి ప్రమాణ స్వీకారం చేయడమే కాకుండా ప్రభుత్వ యంత్రాంగాన్ని కూడా మేల్కొల్పుతారు. కానీ ఎంఎస్పీఎస్సీ అభ్యర్థుల మాట వినకపోతే ఆయన మళ్లీ రావడం సాధ్యం కాదు. ఇది ప్రజాస్వామ్యం. ప్రజలు ఓటర్లుగా మిమ్మల్ని ఎన్నుకుంటారు కాబట్టి ప్రభుత్వం వారి మాట వినాల్సిందేనని దీప్కే అన్నారు.

## అమెరికాపై దాడులు చేయబోమని హౌతీల హామీ: ట్రంప్



వాషింగ్టన్, సెప్టెంబరు 20: అమెరికా మిత్రదేశమైన సౌదీ అరేబియాతో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో, ఇరాన్ మద్దతు ఉన్న యెమెన్కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు అమెరికాపై దాడులు చేయబోమని అంగీకరించినట్లు అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. సౌదీ అరేబియా, హౌతీల మధ్య ఘర్షణ తీవ్రతరం కావడంతో కొనసాగుతున్న ఇరాన్ యుద్ధంలో మరో కొత్త ఫ్రంట్ ఏర్పడింది. అమెరికా, హౌతీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని, అమెరికాతో పోరాడకూడదని హౌతీలు అంగీకరించారని ట్రంప్ పేర్కొన్నారు. హౌతీలు అమెరికా బలగాలపై దాడులకు దూరంగా ఉంటున్నారని ట్రంప్ గతంలో కూడా వ్యాఖ్యానించారు. అమెరికాతో పోరాడాలని వారు కోరుకోవడం లేదని సెప్టెంబర్ 12న ఐర్లాండ్ పర్యటన సందర్భంగా ట్రంప్ తెలిపారు. రియాద్పై తొలి దాడియెమెన్కు చెందిన హౌతీలు తమ రాజధాని రియాద్ను బాలిస్టిక్ క్షిపణితో దాడికి ప్రయత్నించారని సౌదీ అరేబియా వెల్లడించింది. రియాద్ లోని కొందరు ప్రజలు భారీ పేలుడు శబ్దాన్ని విన్నారు. అనంతరం విమా నాశ్రయం సమీపంలో పొగలు కనిపిం చినట్లు స్థానికులు తెలిపారు. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం లేదు. యుద్ధం యెమెన్, సౌదీ అరేబియాకు విస్తరించడం వల్ల చమురు సరఫరాపై కొత్త ఆందోళనలు వ్యక్తమవుతు న్నాయి. గల్ఫ్ దేశాల చమురు ఎగుమతులకు ప్రధాన ప్రత్యామ్నాయ మార్గంగా ఉన్న ఎర్ర సముద్ర మార్గానికి ముప్పు ఏర్ప డింది. ఇదే సమయంలో అమెరికా ఇరాన్ ఉద్రిక్త తల కారణంగా హార్ముజ్ జలసంధి మీదుగా రాకపోకలు కూడా పరిమితమయ్యాయి. అంతకుముందు బుధవారం, ఇస్లాం మతంలో అత్యంత పవిత్రమైన నగరమైన మక్కాపై హౌతీలు డ్రోన్తో దాడి చేసేందుకు ప్రయత్నించారని సౌదీ అరేబియా ఆరోపించింది. ఆ డ్రోన్ను అడ్డుకున్నట్లు తెలిపింది. ప్రవక్త మహమ్మద్ జన్మస్థలమైన మక్కా భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అది తమకు "రెడ్ లైన్" అని సౌదీ పేర్కొంది. అయితే హౌతీలు ఈ ఆరోపణను ఖండించారు. హౌతీలు బాబ్ఎల్మండేబ్ జలసంధి వైపు ముందుకు సాగుతున్నారని, ఇప్పటికే పలు వ్యూహాత్మక ద్వీపాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారని సమాచారం. అదే రోజు జరిగిన మరో దాడిలో సౌదీ అరేబియాలోని తూర్పువైపు మర చమురు పైప్లైన్కు అంతరాయం ఏర్పడింది. "హౌతీలపై పెద్దఎత్తున సైనిక చర్య చేపట్టేందుకు సౌదీ అరేబియా ఇప్పటివరకు వెనుకంజలో ఉన్నట్లు తెలుస్తోంది. హౌతీలు తమ చమురు మౌలిక వసతులపై మరిన్ని దాడులు చేసే అవకాశం ఉండటం, మరోసారి పూర్తిస్థాయి యుద్ధంలోకి చిక్కుకునే ప్రమాదం ఉండటమే ఇందుకు కారణంగా భావిస్తు న్నారు. అయితే హౌతీల దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో సౌదీ అరేబియా కీలక నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ వారం ప్రారంభంలో హౌతీలతో రెండు వారాల కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం చేయాలని సౌదీ అరేబియా ఒమన్ను కోరినట్లు వార్తలు వచ్చాయి. రెండు వారాల పాటు కాల్పుల విరమణ పాటించడంతో పాటు, రియాద్ మరియు హౌతీ నాయకత్వం మధ్య ప్రత్యక్ష చర్చలు ప్రారంభించాలన్నది ఈ ప్రతిపాదనలో భాగంగా ఉన్నట్లు తెలుస్తోంది. లెబనాన్కు చెందిన అల్ అఖ్బర్ పత్రిక కథనం ప్రకారం, తొలుత హౌతీల మానవతా డిమాండ్లపై చర్చించి, ఆ రెండు వారాల కాల్పుల విరమణ ముగిసేలోగా సమగ్ర ఒప్పందానికి రావడం ఈ ప్రతిపాదన ప్రధాన లక్ష్యంగా ఉంది. హౌతీలపై పోరాడేందుకు సైనిక సహాయం అందించాలని సౌదీ అరేబియా చేసిన విజ్ఞప్తులను ట్రంప్ తిరస్కరించినట్లు కూడా వార్తలు వచ్చాయి. అనంతరం సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్, అమెరికా సెంట్రల్ కమాండ్ కమాండర్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్తో సమావేశమయ్యారు.

## డ్రంకన్ డ్రైవ్ దాడుల్లో 129 మంది పట్టివేత

హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త: జంట నగరాలు, శివారు ప్రాంతాలలో మందు బాబుల భరతం పట్టేందుకు డ్రంకన్ డ్రైవ్ దాడులు కొనసాగుతూనే వున్నాయి. శుక్రవారం, శనివారం రాత్రి వేళల్లో ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ దాడుల్లో మొత్తం 129 మంది మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 101 మంది ద్విచక్ర వాహనదారులు, 10 మంది ఆటో డ్రైవర్లు, 18 మంది కార్లతో పాటు ఇతర వాహనాల డ్రైవర్లు వున్నారు. పట్టుబడ్డ వారిలో 22 మంది 30 నుంచి 50 పాయింట్ల వరకు వుండగా 59 మంది 51 నుంచి 100 పాయింట్ల వరకు, 21 మంది 101 నుంచి 150 పాయింట్ల వరకు, 14 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు, ఎనిమిది మంది 201 నుంచి 250 పాయింట్ల వరకు, ఇద్దరు 251 నుంచి 300 పాయింట్ల వరకు, ముగ్గురు 300 పా యింట్లకు మించి మద్యం సేవించినట్లు తేలింది. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన తరువాత కోర్టుల్లో హాజరు పరుస్తారు. కోర్టులు వీరికిశిక్షలు విధిస్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పోలీసు కమి షనర్ జోయల్ డేవిస్ మీడియాకు తెలిపారు. జంటనగరాలలో డ్రంకన్ డ్రైవ్ దాడు లు నిరంతరం కొనసాగుతాయని వెల్లడించారు.

**సైబరాబాద్లో 80 మంది పట్టివేత:** ఇదిలావుండగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 80 మంది బాబులు పట్టుబడ్డారు. వీరిలో 62 మంది ద్విచక్ర వాహనదారులు, ఇద్దరు ఆటోడ్రైవర్లు, 16 మంది కార్లడ్రైవర్లువున్నారు. పట్టుబడ్డ వారిని నిబంధనల మేరకుకోర్టులో హాజరు పరుస్తామని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు అదనపు డిసిపి నరేందర్ తెలిపారు.

**మల్కాజిగిరి పరిధిలో 11 మంది పట్టివేత:** కాగా మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో 11 మంది బాబులు పట్టుబడ్డారు. వీరిలో ఎనిమిది మంది ద్విచక్ర వాహనదారులు, ఇద్దరు కార్ల డ్రైవర్లు, మరొకరు భారీవాహన డ్రైవర్ వున్నారు. పట్టుబడ్డ వారిని నిబంధనల మేరకు కోర్టులో హాజరు పరుస్తామని ట్రాఫిక్డిసిపి రాహుల్రెడ్డి తెలిపారు.

## వివాహేతర సంబంధంలో మహిళను హత్య చేసిన ప్రియుడు

హైదరాబాద్, సెప్టెంబరు 20, ప్రభాతవార్త: వివాహేతర సంబంధం కారణంగా కామారెడ్డి జిల్లాలో ఓ మహిళ హత్యకు గురయ్యింది. లింగంపేట మండలం నాగారం గ్రామ శివార్లలో శని వారం రాత్రి పంట పొలాల్లో ఈ హత్య జరిగింది. ఆదివారం ఉదయం పొలం పనుల కోసం వెళ్లిన కూలీలు మహిళ హత్య గురించి తెలుసుకుని పోలీసులకు సమాచారం అందించారు. కాగా హతురాలిని అదే గ్రామానికి చెందిన చింతకుంట అ నసూయ (28)గా గుర్తించారు. ఆమెతో వివాహేతర సంబంధం కలిగిన వ్యక్తి ఇనుప రాడ్డుతో తలపై కొట్టి ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఈ హత్య కు పాల్పడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వివాహేతర సంబం ధంలో ఇద్దరి మధ్య గొడవ జరగడంతో ఈ హత్య జరిగిందని తెలిసింది. హతురాలికి భర్త ఇద్దరు చిన్న పిల్లలున్నారు. లింగంపేట పోలీసులు ఈ కేసును విచారిస్తున్నారు.

## సంతోష్నగర్లో హిట్ అండ్ రన్ మూడేళ్ల బాలుడు మృతి

సైదాబాద్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త : ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న హిట్ అండ్ రన్ ఘటనలో మూడేళ్ల బాలుడు మృతి చెందాడు. శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సంతోష్నగర్లో నివాసముంటున్న మొహిసుద్దీన్ శనివారంరాత్రి తన కుటుంబ సభ్యులతో కలిసి ఐఎస్ సదన్ చౌరస్తాలోని హోటల్కు వెళ్లారు. హోటల్లో ఫుడ్ పార్సిల్ తీసుకుని రోడ్డు దాటుతుండగా అదే సమయంలో వేగంగా వచ్చిన కారు మొహిసుద్దీన్ కుమారుడు ఇజాన్ ఉద్దీన్(3)ను ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్ర గాయాలకు గురైన ఆ బాలుడిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి చికిత్స కోసం తరలించినప్పటికీ అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాలుడి మృతి విషయం తెలుసుకున్న యాకుత్పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసు అధికారులతో మాట్లాడి ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ను వెంటనే పట్టుకోవాలని కోరారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్లే ప్రమాదం జరిగిందని, ఇజాన్ను ఢీ కొట్టి ఆగకుండా దాదాపు 15 ఫీట్ల వరకు ఈడ్చుకు వెళ్లాడని మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.


బిసి ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపి ఆర్. కృష్ణయ్య

## బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి

### క్రీమిలేయర్ తొలగించాలని డిమాండ్, 80 కేంద్ర, రాష్ట్ర ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు

హైదరాబాద్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, అలాగే బీసీలపై ఉన్న క్రీమీలేయర్ నిబంధనలను వెంటనే తొలగించాలని 80 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ బీసీ ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు , రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య అధ్యక్షతన ప్రభుత్వ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి దాన కర్ణచారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ ఉద్యోగ నియామకాల్లో బీసీలపై క్రీమీలేయర్ నిబంధన విధించడం వివక్షపూరితమని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు, మహిళల రిజర్వేషన్లకు లేని క్రీమీలేయర్ బీసీ ఉద్యోగులకే ఎందుకు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల్ కమిషన్, నాచియప్పన్ కమిటీ సిఫార్సుల ప్రకారం ఉద్యోగ ప్రమోషన్లలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని గుర్తుచేశారు. రిజర్వేషన్లు కల్పించడానికి రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే కుల గణనలో ఓబీసీ కాలమ్ పెట్టి, ప్రతికులానికి విశిష్ట కోడ్ నంబర్ ఇవ్వాలి. బీసీల జనాభా ప్రకారం విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను 27 నుండి 56శాతం వరకు పెంచాలన్నారు. పార్లమెంట్, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ మాదిరిగా బీసీ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాలన్నారు. ప్రైవేట్ రంగంలో, అలాగే సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీల నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు వర్తింపజేయాలి. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి. అవుట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి. కేంద్ర స్థాయిలో రూ. 2 లక్షల కోట్ల బడ్జెట్తో బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలి. ఈ సమావేశంలో శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి, బి హెచ్ ఈ ఎల్ , ఎన్ ఎఫ్ సి , బి డి ఎల్ , ఈ సి ఐ ఎల్ , మిధాని , డి ఆర్ డి ఎల్ , రైల్వేస్, పోస్టల్, టెలిఫోన్, రక్షణ శాఖతో పాటు 70కి పైగా ప్రభుత్వ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.



వామపక్ష ప్రజాతంత్ర ఐక్యవేదిక సదస్సులో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్, పరకాల ప్రభాకర్

## వామపక్ష, ప్రజాతంత్ర లౌకిక శక్తులు ఐక్యం కావాలి

### ఐక్యవేదిక సదస్సులో వక్తలు

హైదరాబాద్, సెప్టెంబరు 20ప్రభాతవార్త : పాలకవర్గాల విధానాలతో విసిగిపోయిన ప్రజలకు బలమైన ప్రత్యామ్నాయాన్ని అందించేందుకు వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులన్నీ ఒకే వేదికపైకి వచ్చి ఐక్య పోరాటాలు నిర్మించాలని పలువురు ప్రజాస్వామ్యవాదులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షతన వామపక్ష ప్రజాతంత్ర ఐక్యవేదిక సదస్సు జరిగింది. డా.ఎస్.నాగేశ్వరరావు నాయకులను ఆహ్వానించగా, వివిధ రంగాల ప్రతినిధులు ప్రసంగించారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ హయాంలో పెట్టుబడిదారీ వ్యవస్థ, నియంతృత్వం, ఫాసిజం ఐక్యంగా ముందుకెళ్తుంటే, మనం చీలిపోయాం. ఫాసిజానికి వ్యతిరేకంగా చర్చలు చాలు ఇక కార్యాచరణే శరణ్యం. వీధి పోరాటాలు చేసేందుకు బలమైన ఐక్య సైన్యం అవసరం" అని స్పష్టం చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లా డుతూ ఆకలి, దారిద్ర్యం, సామాజిక అస మానతలు పెరుగుతున్న కొద్దీ ఫాసిజంకూడా ప్రమాదకర స్థాయిలో విస్తరిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఒక ఉదాహరణను ప్రస్తావిస్తూ ఒకరిని పులి తింటుంటే.. మోడీ అనే పులి నన్ను తినడం లేదు కదా అని మౌనంగా ఉంటే, రేపు నీ వంతు కూడా వస్తుంది" అని హెచ్చరించారు. అందువల్ల సమస్యను తమకు సంబంధం లేదన్నట్లు కాకుండా, ప్రజలందరూ ఐక్యంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే తరాలకు పోరాటాలే దిక్సూచి, ఉత్పాదక పంపిణీ సమానంగా జరిగే సోషలిజమే అంతిమ లక్ష్యం కావాలన్నారు.

# ఇక చాలు అనిపిస్తోంటే..



కొద్ది దూరం నడిచినా.. వ్యాయామాలు చేసినా 'ఈరోజుకి ఇక చాల్లే' అనిపిస్తోందా? ఉదయాన్నే మనికి ఇంటి పనులు ఎదురు చూస్తుంటాయి. అందుకే లేవగానే గబగబా చేసేస్తుంటాం. పైగా ఖాళీ కడుపు.. నీరసం మామూలే. అలా సగం సగం చేస్తేనేమో ఫలితం ఉండదు కాబట్టి.. వీటిని సేవించండి.

గ్రీన్ టీ. దీనిలో తక్కువ మొత్తంలో కెఫీన్, ఎక్కువ పరిమాణంలో యాంటీ ఆక్సిడెంట్లూ ఉంటాయి. ఇవి ఉత్తేజాన్ని అందించడమే కాదు.. మెటబాలిజాన్నీ మెరుగు పరుస్తాయి. రెండు క్యారెట్లు, సగం బీట్‌రూట్ ముక్క కలిపి జ్యూస్ చేసుకొని తాగండి. దీన్నుంచి ఎ,సి విటమిన్లు, ఫొలేట్, పొటాషియం పుష్కలంగా అందుతాయి. వీటిల్లోని నైట్రేట్లు కండరాలకు ఆక్సిజన్ సరఫరాను మెరుగుపరిచి, కావాల్సిన శక్తినిస్తాయి. కెలోరీలు తక్కువ కాబట్టి, బరువు తగ్గడంలోనూ సాయపడ తాయి. యాంటీ ఆక్సిడెంట్లు వృద్ధాప్య ఛాయలను తగ్గించడమే కాదు. చర్మ ఆరోగ్యాన్నీ సంరక్షిస్తాయి. ఉదయాన్నే తీసుకుంటే జలుబు అనుకుంటాం కానీ.. కొబ్బరినీళ్లూ చేసే మేలెంతో వీటిల్లో ఎలక్ట్రోలైట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి తక్షణ శక్తినిస్తాయి. మధ్యస్థ రకమైన వ్యాయామాలు చేసే ముందు ఈ నీటిని తీసుకుంటే చాలామంచిది. నీళ్లలో నిమ్మరసం, కాస్త తేనె కలుపుకొని తాగి చూడండి. శరీరానికి తాజా అనుభూతితో పాటు ఉత్తేజమూ కలుగు తుంది. బరువు తగ్గడంలో సాయ పడటమే కాదు. నిమ్మ లోని విటమిన్– సి రోగనిరోధక తనూ పెంచు తుంది. □

# ఎన్ని క్రీములు మార్చినా..

ఎన్ని క్రీములు మార్చినా, ఎంత ఖరీదైనవి రాసినా.. ఫలితం ఉండట్లేదు అని ఎప్పుడైనా అనిపిం చిందా? అలాంటప్పుడు ఉత్పత్తి మార్చడం కాదట.. ఏం తింటున్నామో గమనించు కోమంటున్నారు నిపుణులు ఎందుకంటే.. జీర్ణవ్యవస్థ, చర్మ ఆరోగ్యాలు ఒకదానితో మరొకటి ముడిపడి ఉంటాయని తెలుసా? మన పేగుల్లో మేలు చేసే బ్యాక్టీరియా అంటే సూక్ష్మజీవుల కమ్యూనిటీ ఉంటుంది. ఇవి ఆహారం జీర్ణమవడంలోనే కాదు రోగనిరోధకత పెరగడం సహా ఇంకా ఎన్నో విధాలుగా సాయపడతాయి. వాటిల్లో చర్మ ఆరోగ్యం కూడా ఒకటి. ఈ సూక్ష్మజీవుల సంఖ్యలో తేడాలొస్తే అది ఇన్‌ఫ్లమేషన్‌కీ తద్వారా చర్మ సమస్యలకీ దారితీ స్తాయి.



నిజానికి జీర్ణవ్యవస్థ ఇబ్బందులే మన ముఖంపై ప్రతిఫలిస్తాయంటారు నిపుణులు. సరిగా తినక పోయినా, ఆరోగ్యమైన వాటికి చోటివ్వకపోయినా చర్మం కళ తప్పడం దగ్గర్నుంచి, ఇన్‌ఫెక్షన్ల వరకూ ఎన్నో సమస్యలకు దారితీస్తాయి. యాక్నే, ఎగ్జిమా, చిన్నవయసులోనే వృద్ధాప్యఛాయలు వంటివి ఆహారం విషయంలో మనం చేసే నిర్లక్ష్యానికి సూచికలే. కాబట్టి, ఏదో ఒకదానితో కడుపు నింపుకోవడం, వేళలు పాటించకపోవడం వంటివి చేయొద్దు. రోజువారీ ఆహారం ద్వారా ఎ,సి,డి,ఇ విటమిన్లు, మినరల్స్ అందుతున్నాయా అనేది గమనించుకోండి. ప్రాసెస్ చేసిన, నూనెలో వేయించిన, చక్కెరలు, చెకడు కొవ్వులు ఉన్నవాటికి వీలైనంతవరకూ దూరంగా ఉండండి. బదులుగా తాజా కూరగాయలు, పండ్లు, పెరుగు, నట్స్ వంటివాటికి చోటివ్వండి. అతిగా టీ, కాఫీ,కూల్‌డ్రింక్‌లను తాగుతోంటే తగ్గించుకోవాలి. నీళ్లు ఎక్కువగా తాగాలి. వారంలో కనీసం అయిదురోజులు వ్యాయామానికి కేటాయించాలి. రోజు ఏడు గంటలైనా నిద్ర ఉండేలా చూసుకోండి. అప్పుడు పొట్ట తద్వారా చర్మం బాగుపడుతుంది.క్రీములపైనే ఆధారపడక పొట్ట సంగతీ పట్టించుకోండి.

టమ్మీ ఖుష్ అయితేనే స్కిన్ ఖుష్ అవుతుంది మరి. □

# నైపుణ్యమే ప్రధానం !



చేసే పనిలోనైనా, కెరీర్‌లోనైనా.. వచ్చే మార్పుల్ని గమనిస్తూ.. నైపుణ్యాలను పెంచుకున్నప్పుడే బంగారు భవిష్యత్తు సొంతమవుతుంది. అయితే అలాంటి సాధన చిన్న వయసు నుంచే అలవర్చు కోవాలి. ఇలా సొంతం చేసుకున్న నైపుణ్యాలే మన తరగని ఆస్తులవుతాయని, అవే ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా వ్యక్తిగతంగా, వృత్తిపరంగా మనల్ని ఉన్నతంగా నిలబెడతాయని చెబుతున్నారు పెద్దవారు.

**నైపుణ్యం.. నిరంతర సాధన ఫలితం. అది అకస్మాత్తుగా వచ్చేది కాదు.. అన్నారు అబ్దుల్ కలాం.**


**మార్పు మంచిదే!....** ప్రస్తుతం మన రోజువారీ జీవితాలే కాదు. కెరీర్ కూడా టెక్నాలజీతో ముడిపడి పోయిందని చెప్పాలి. ఇక భవిష్యత్తులో ఇది మరెంత అడ్వాన్స్‌డ్‌గా మార నుందో ఊహించగలం. ఈ క్రమంలో టెక్నాలజీలో వస్తోన్న కొత్త పోకడల్ని అవపోసన పట్టడం చాలా ముఖ్యమంటున్నారు నిపుణులు. ఇందుకు మారుతోన్న సాంకేతికతకు అనుగుణంగానే కొత్త కోర్సులు నేర్చుకోవ డానికి ఉత్సుకత చూపాలి. ఎలాంటి కొత్త బాధ్యతనైనా అందిపుచ్చుకునే నేర్పును అలవర్చుకోవాలి.

**కమ్యూనికేషన్ ముఖ్యం ....** చాలా మందికి నలుగురిలో మాట్లాడాలంటే ఏదో తెలియని బిడియం, భయం ఉంటాయి. వ్యక్తిగతంగా, వృత్తి పరంగా ఎదగాలనుకునే వారికి ఇవే పెద్ద అవరోధా లుగా మారుతున్నా యంటున్నారు నిపుణులు. పైగా రిమోట్ వర్కింగ్ వాతావరణం లో మీరు మీ బృం దంతోనే కాదు.. ఇతర కంపెనీ బృందాలతో, విదేశీ టీమ్‌తోనూ పని/ప్రాజెక్ట్ గుర్చి మాట్లాడాల్సి రావచ్చు. మీ ఆలోచనల్ని వారితో పంచుకోవా ల్సిన అవసరం ఏర్పడచ్చు. ఇలాంటప్పుడు చక్కటి కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు.. వంటివన్నీ ముందు నుంచే అలవర్చుకోవడం మంచిది.

**విశ్లేషించగలగాలి....** చాలామందికి నలుగురిలో మాట్లాడా లంటే ఏదో తెలియని బిడియం, భయం ఉంటాయి. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఎదగాలనుకునే వారికి ఇవే పెద్ద అవరోధాలుగామారుతున్నాయంటున్నారు నిపుణులు. మీరు మీ బృందంతోనే కాదు. ఇతర బృందాలతో సైతం పని/ప్రాజెక్ట్ గురించి మాట్లాడాల్సి రావచ్చు. మీ ఆలోచనల్ని వారితో పంచుకోవాల్సిన అవసరం ఏర్పడచ్చు. ఇలాంట నప్పుడు చక్కటి కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు.. వంటివన్నీ ముందు నుంచే అలవర్చుకోవడం మంచిది.

**పోటీని తట్టుకునేలా...** ఈ రోజుల్లో పోటీ లేని రంగం, కెరీర్ లేదంటే అతిశయోక్తి కాదు. అయితే ఇది భవిష్యత్తులో మరింత తీవ్రంగా ఉండే అవకాశాలున్నాయని చెబుతున్నారు నిపుణులు. అలాగని భయపడిపోతే ముందుకు సాగలేం. అందుకే ఈ పోటీని తట్టుకొని నిలబడాలంటే.. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనే నైపుణ్యాన్ని అలవర్చుకోవాలి. ఎంచు కున్నరంగంలో పోటీని అధిగమించడానికి అవసరమైన అన్ని నైపుణ్యా లను సొంతం చేసుకోవాలి. ఎప్పటికప్పుడు మన సామర్థ్యాన్ని పెంపొం దించు కోవాలి. ఈ లక్షణాలు ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా ముందుకు నడిపించడంతో పాటు..

# శివారాధన



'ఓం నమఃశివాయ' అనే పంచాక్షరీ మంత్రం మహా శక్తిమంతమైనది. 'న' అనే అక్షరం భూమిని .. 'మ' అనే అక్షరం జలాన్ని.. 'శి' అనే అక్షరం అగ్నిని .. 'వా' అనే అక్షరం వాయువును .. 'య' అనే అక్షరం ఆకాశాన్ని సూచిస్తాయి. 'ఓం'కారంతో కూడిన శివతత్త్వమే ఈ సృష్టికి మూలం. అలాంటి పరమశివుడిని పూజించడం విశేషమైన ఫలితాలను అందిస్తుందని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. సదాశివుడిని **బిల్వపత్రాలతో** పూజించడం వలన భోగభాగ్యాలు లభిస్తాయి. **కలువ** పూలతో ఆరాధిస్తే విజయం చేకూరుతుంది. **శంఖు** పుష్పాలతో పూజిస్తే సంపదలు వృద్ధి చెందుతాయి. అలాగే **సువర్ణ** జలంతో అభిషేకించడం వలన దారిద్రం నశిస్తుంది. **కస్తూరి** జలంతో అభిషేకించడం వలన శత్రుహాని నివారించబడుతుంది. స్వచ్ఛమైన జలంతో శివుడిని అభిషేకించడం వలన సమస్త పాపాలు నశించి, సకలశుభాలు చేకూరతాయి. అందువలన సదాశివుడికి ప్రీతిని కలిగించేలా పూజిస్తూ తరించాలి.

# అవసరానికే వాడదాం..



**మహిళలు ఇంట్లో ఉంటే.. ఎక్కువసేపు గడిపే స్థలం** ఏదంటే వంటగదనే విషయం ఠక్కున చెప్పేయొచ్చు మరి అంతటి ప్రాధాన్యం ఉన్న చోటు ఆహ్లాదకరంగా మార్చు కోగలి గితే పని ఒత్తిడి దరిచేరదు. • చాలా మంది కనిపించిందల్లా ఫ్రిజ్‌ల్లో కుక్కే స్తారు. అయితే దీన్ని అందంగా సర్దు కోవడమూ ఓ కళ. మార్కె ట్‌లో దొరికే ఫ్రిజ్ మ్యాట్స్‌ని అరల్లో వేసి వస్తువులు పెడితే మరకలు పడకుండా ఉంటాయి. అలానేస్టోర్ బ్యాగ్‌లు, బాక్సుల్లో ఆహారపదార్థాలు సర్దితే సులువుగా తీసుకోవచ్చు. పాడవకుండానూ ఉంటాయి. • వంటింటి నిత్యావసరా లు..పప్పులు, మసాలా దినుసులు, సాస్‌లూ, పాస్తాలూ, నూనెలూ, నట్స్ వంటివాటిని పారదర్శకంగా ఉండే సీసాల్లో వేసు కోండి. ఒకవేళ స్టీలు బాక్సుల్లో వేసుకున్నా లేబులింగ్ చేసు కుంటే.. వెతక్కుండా అవసరానికి సులువుగా దొరు కుతాయి. • నిత్యం వాడే పాత్రల్ని ఓ చోట, ఏదైనా సందర్భమో, కార్యక్రమమో ఉన్నప్పుడు వినియోగించేవి మరో చోట పెట్టండి లేదంటే.. కనిపించిందల్లా తీసి వాడేస్తుంటే అనవసరంగా ఎక్కువ గిన్నెనలు శుభ్రం చేయాలి. పైగా కడిగాక వాటిని సర్దడమూ ఇబ్బందే. • వంటగదిలో ఓ చిన్న బ్లాక్ బోర్డ్ లేదంటే వైట్ నోట్‌బుక్ వేలాడ దీయండి. ఎప్పుడైనా సరకులు నిండుకుంటే వెంటనే అందులో నమోదు చేయండి. లేదా అక్కడి అసవరాలనుతరవాత గుర్తు చేసుకోవా లనుకున్నా రాసుకోండి. ఇక్కడే గ్యాస్ తెచ్చిన తేదీ, వాటర్ ఫిల్టర్ మార్చిన డేట్.. ఇలా చాలా విషయాలను జ్ఞాపకం. తెచ్చుకోవచ్చు. □

# తెర

# గుడ్ బాయ్స్ మోషన్ పోస్టర్ రిలీజ్..



## క్రేజీ గ్యాంగ్‌కు లీడ్‌గా వెన్నెల కిశోర్


ప్రముఖ కమెడియన్, నటుడు వెన్నెల కిశోర్ పుట్టినరోజు సందర్భంగా గుడ్ బాయ్స్ మేకర్స్ .. ఈ సినిమా ఎంటం'టైనింగ్ మోషన్ పోస్టర్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను అధికా రికంగా విడుదల చేశారు. రాఘవ్ కథను అందిస్తూ డైరెక్ట్ చేస్తో న్న ఈ సినిమాను సూర్య గుణ్ణం, వివేక్ ఇనంపూడి, నవ్య శశాంక్ కనకమేడల నిర్మిస్తున్నారు. ఫస్ట్ లుక్ చూస్తుంటే 'గుడ్ బాయ్స్ సినిమా ఫుల్ కామెడీ, కడుపుబ్బా నవ్వించే సన్నివేశాలు, ఇటీవల ఈ చిత్రం నుంచి విడుదలైన'కజిన్స్ ఆర్ కమింగ్ ప్రమోషనల్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన సం గతి తెలిసిందే. సినిమాలోని ప్రధాన నటీనటులతో రూపొం దించిన ఈ వీడియోలోని ఫన్నీ సన్నివేశాలు, విభిన్నమైన క్యారె క్టర్లు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. టాలవుడ్‌లో తన కామెడీతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వెన్నెల కిశోర్ మరోసారి తనదైన కామెడీ టైమింగ్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకుంటున్నారు. ఈ సినిమాలో వెన్నెల కిశోర్, శృతి సోధి, రవి రాజా, వివా హ ర్ష, వామ్సీ గౌడ్, గుండు సుదర్శన్, జోషి జోష్ క్రియేషన్స్, హైపర్ ఆది, రఘుబాబు, కిరణ్ మాచా, ఢీ పండు, రమణ భార్గవ్, అశ్విని అయ్యలూరు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రాఘవ్ కథను అందించి దర్శకత్వం వహిస్తోన్న'గుడ్ బాయ్స్.. నవ్వులు, స్నేహం, ఫుల్ కామెడీతో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించే కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోంది. సూర్య గుణ్ణం, వివేక్ ఇనంపూడి, నవ్య శశాంక్ కనకమేడల నిర్మిస్తున్న ఈ సినిమాకు అర్జున్ రాజా దాసరాజు సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

# ఇట్లు అర్జునలో హీరోగా అనీష్



అనీష్, అనస్వర రాజన్, తమన్, వెంకీ కుడుముల వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఇట్లు అర్జున్త టీజర్ లాంచ్ స్టార్ డైరెక్టర్ వెంకీ కుడుముల నిర్మాతగా వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్న చిత్రం 'ఇట్లు అర్జున్త. ఈ సినిమాతో అనీష్ హీరోగా పరిచయం అవుతుండగా, డెబ్యూ దర్శకుడు మహేష్ ఉప్పల దర్శకత్వం వహిస్తున్నారు. అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తున్నారు. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో అనీష్ మాట్లాడుతూ.. నేను ఇక్కడ ఉండడానికి మెయిన్ రీజన్ వెంకీ అన్న. ఈ క్యారెక్టర్ చేయగలను అని నమ్మింది ఆయ నే. ఈ జర్నీ స్టార్ట్ అవ్వడానికి కారణం కూడా ఆయనే. ఈ కథని మహేష్ గారు చాలా అద్భుతంగా చెప్పారు. అర్జున్ క్యారెక్టర్‌కి కనెక్ట్ అయిపోయాను. నిర్మాత వెంకీ కుడుముల మాట్లాడుతూ.. నేను డైరెక్టర్‌గా ఉన్నప్పుడు వాళ్ల కష్టం చూశాను. నేను ప్రొడ్యూసర్ అయ్యాక అది పర్సనల్‌గా ఫీల్ అయ్యాను. అనస్వర రాజన్ మాట్లాడుతూ.. ఇట్లు అర్జున నేను తెలుగులో సైన్ చేసిన ఫస్ట్ ఫిలిం. ఇది నాకు చాలా స్పెషల్. మీ అందరి సపోర్ట్‌తో నేను ఇంకా ఎన్నో సినిమాలు ఇక్కడ చేయాలని కోరుకుంటున్నాను. అక్టోబర్ 30న మీరందరూ థియేటర్‌లో ఈ సినిమా చూస్తూ ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాను

# అక్టోబర్ 2న తత్వం థియేట్రికల్ విడుదల




కొత్త కథతో, ఉత్కంఠభరితమైన స్క్రీన్‌ప్లేతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి కలిగించేలా తెరకెక్కుతున్న చిత్రం ఖితత్వంఖి మర్డర్ మిస్టరీ, సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్‌లో రూపొందుతున్న ఈ చిత్రం ట్రైలర్ ఇటీవల విడుదలై మంచి ఆదరణ పొం దుతోంది. కాగా ఈ చిత్రంను అక్టోబర్ 2 న సినిమాను థియేట్రికల్ విడుదల చేస్తూ నట్లు ప్రకటించారు మేకర్స్ . దినేష్ తేజ్, దష్విక.కె హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి అర్జున్ కోల దర్శకుడు. త్రయతి ఇషాని క్రియేషన్స్, ఎస్.కె.ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మా ణంలో వంశీ సీమకుర్తి, శ్వేత పసుపులేటీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ మంచి ఎమోషనల్ కనెక్టవిటి ఉన్న థ్రిల్లర్ ఇది. సంగీతానికి స్కోప్ ఉన్న చిత్రమిది. ఇటీవల విడుదలైన ట్రైలర్ అందరికి నచ్చింది. ఈ సినిమాలో అన్ని ఎలిమెంట్స్ కుదిరాయి. అందరూ ఈ సినిమా కోసం ఎంతో సపోర్ట్ చేశారు. అర్జున్ కోలా ఈ రోజు కోసం ఎప్పట్నుంచో ఎదురుచూస్తున్నాడు. అనుకున్న కథను మించి దర్శకుడు తెరకెక్కించాడు. అందరికి మంచి థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమాఖి అన్నారు. దర్శకుడు అర్జున్ కోలా మాట్లాడుతూ ఖిఖి సంగీతానికి ప్రాధ్యాన్యమున్న చిత్రమిది. చేతన్ భరద్వాజ్ కథకు తగ్గట్టుగా అద్భుతమైన ట్యూన్స్ ఇచ్చాడు. మన చుట్టు జరుగుతున్న ఇన్‌సిడెంట్స్ ఆధారంగా తయారుచేసుకున్న కథ ఇది. కథ తప్పకుండా అందరికి ఎంగేజింగ్‌గా ఉంటుంది. వంశీ గారి అన్వేషణ తరహాలోనే అందర్ని కట్టిపడేసే సినిమా ఇది. ఈ సినిమాలో ఉంటే ట్విస్ట్ ఆడియన్స్‌కు షాకింగ్‌గా ఉంటుంది అన్నారు.

# ది ప్యారడైజ్ కంటెంట్ అద్భుతంగా వచ్చింది

**: డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల**



నాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ది ప్యారడైజ్. శ్రీకాంత్ ఓదెల దర్శ కత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో భారీ అంచనాలు పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రపం చవ్యాప్తంగా విడుదల కానుంది. న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ది ప్యారడైజ్. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సిని మాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో భారీ అంచనాలు పెంచాయి.

**శ్రీకాంత్ గారు.. ఈ కథకు స్ఫూర్తి ఏమిటి?**

ఈ కథకు నిజ జీ విత సంఘటన, కొన్ని పాత్రలు, అలాగే ఫిక్షన్.. ఈ మూడు ఉన్నాయి. మా అమ్మగారు ఆడపిల్ల పుడితే బాగుంటుందని భావించారు. కానీ పుట్టలేదు. నాకే జడలు వేసి, గౌన్ వేసి పెంచారు. నా రెండో క్లాస్ వరకు నాకు జడలు ఉండేవి. జడలు అక్కడి నుంచి తీసుకున్నాను. దీని వెనుక కూడా చాలా ఎమోషన్ ఉంటుంది. ఇందులో ఉండే రెవల్యూషన్, ఆ పాత్రలను నేను పుట్టి పెరిగిన గోదావరిఖని ప్రాంతం నుంచి స్ఫూర్తి పొందినవి. ఆదిలాబాద్, గోదావరిఖని ప్రాంతాల మధ్యలో జరిగిన సంఘటనలు తీసుకున్నాను.

**ఇందులో నానిని ఎలా చూపించాలని అనుకున్నారు?**

**దసరాలో మిస్ అయిన నాని ఇందులో చూపిస్తారని విన్నాం ?**

'దసరాని ఒక మంచి డ్రామాగా చేయాలనేది నా ఉద్దేశం. కాకపోతే ప్రమోషనల్ కంటెంట్ చూసి అదొకకేజీఎఫ్‌లా చాలా మాస్‌గా ఉంటుందని అనుకున్నారు. థియేటర్‌లోకి వెళ్లి చూసిన తర్వాత ప్యూర్ డ్రామా ఉంది. ఆ విషయంలో కొంచెం డిసప్పాయింట్ అయ్యారని నాకు ఫీడ్‌బ్యాక్ వచ్చింది. కాకపోతే అప్పుడు ఆడియన్స్ కోరుకునేది తీస్తే అది కమర్షియల్‌గా హై ఫీల్ అవుతారు కదా అని అనిపించి, అలా నాని గారి దగ్గరికి వెళ్లి ఈ ఆలోచన చెప్పాను. ప్యారడైజ్‌లో యాక్షన్, ఎమోషన్స్, మదర్ అండ్ సన్ ఎమోషన్ అన్నీ కూడా బ్లెండ్ అయి ఉంటాయి. అయితే నాకు అడిగితే యాక్షన్ కంటే ఎమోషన్ డామినేట్ చేస్తుందని భావిస్తున్నాను.

**ట్రైలర్ ఇవ్వకపోవడం వెనుక కారణం?**

ముందే చెప్పినట్టు ఆ ట్రైలర్ కట్ చేయడానికి చాలా సమయం కావాలి. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో అంత సమయం ట్రైలర్‌కి కేటాయించలెం. నేను ఏదైనా సరే మనస్ఫూర్తిగా చేయాలనుకుంటున్నాను. కానీ నాకు పర్సనల్‌గా అడిగితే.. మనం చిన్నప్పుడు ఏమీ చూడకుండానే థియేటర్‌లోకి వెళ్లి ప్రతి మూమెంట్‌కు సర్‌ప్రైజ్ అయ్యేవాళ్లం.

**చివరి 40 రోజులుగా మీరు, మీ టీం అసలు ఇంటికి కూడా వెళ్లలేదని విన్నాము?**

నేను ఏదైనా మనస్ఫూర్తిగా, నేను అనుకున్నది వచ్చేంతవరకు చేస్తాను. ఈ విషయంలో మా టీంను ఇబ్బంది పెట్టాను.

**నాని గారితో మీకు చాలా అనుబంధం ఉంది కదా?**

నాని గారు, నేను అన్నదమ్ముల్లాగే మాట్లాడుకుంటాం. నాకు దర్శకుడిగా జీవితం ఇచ్చారు. ఆ కృతజ్ఞత నాకు ఎప్పుడూ ఉంటుంది. ఆయనతో నేను ప్రతిదీ చెప్తాను.

# కన్నడ స్టార్ విజయ్ రాఘవేంద్ర హీరోగా ఆన్ డ్యూటీ

**హైదరాబాద్:** క్రైమ్, యాక్షన్, థ్రిల్‌తో కూడిన విభిన్న కథలను తెరపై ఆవిష్కరించడంలో తనదైన ముద్ర వేసుకున్న క్రియేటివ్ డైరెక్టర్ సంజీవ్ మేగోటి మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. తెలుగులో వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర ప్రధాన పాత్రల్లో తెరకెక్కించిన పోలీస్ కం ప్లైంట మూవీతో హిట్ కొట్టిన ఆయన.. ఇప్పుడు కన్నడలో తన అప్‌కమింగ్ మూవీ రూపొందించబోతున్నారు. ఆన్ డ్యూటీ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ మూవీ కన్నడ డాక్టర్ రాజ్‌కుమార్ కుటుంబానికి చెందిన ప్రముఖ హీరో విజయ్ రాఘవేంద్ర కథానాయకుడిగా నటించనున్నాడు.ఇప్పటికే క్రైమ్, సస్పెన్స్, యాక్షన్ జానర్‌లో పలు విభిన్న చిత్రాల్లో నటించిన విజయ్ రాఘవేంద్ర.. సంజీవ్ మేగోటి చెప్పిన ఈ సరికొత్త కథకు ఒకే చెప్పడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. విజయ్ రాఘవేంద్ర ఫిల్మోగ్రఫీలో కూడా క్రైమ్, థ్రిల్లర్, యాక్షన్ కథలు కనిపిస్తాయి



# 'సమవర్తి' సినిమా టీజర్ లాంచ్



వైవిధ్యమైన చిత్రాల్లో నటిస్తూ హీరోగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు యంగ్ టాలెంటెడ్ హీరో సత్యదేవ్. ఆయన హీరోగా "సమవర్తి" అనే ఇంట్రెస్టింగ్ సినిమాలో నటిస్తున్నారు. సత్యదేవ్ హీరోగా నటిస్తున్న 16వ చిత్రమిది. "సమవర్తి" సినిమాను రుద్ర పిక్చర్స్ బ్యానర్ పంచభూత ప్రొడక్షన్స్, స్ పై శివచరణ్ రెడ్డి జక్కిడి, శశిధర్ రెడ్డి పడమటి నిర్మిస్తున్నారు. అజయ్ నాగ్. వి దర్శకత్వం వహి స్తున్నా రు.హీరో సత్యదేవ్ మాట్లాడుతూ ఈ సినిమా కథ విన్నప్పుడు, నటిస్తున్నప్పుడు, ఎడిటింగ్‌లో చూ స్తున్న ప్పుడు..ఈ సినిమాను మీరు నేను కలిసి థియేటర్స్‌లో అనేక సార్లు చూస్తాం. ఈ సినిమాను మీరు పెద్ద హిట్ చేస్తారు అనే నమ్మకం కలిగింది. ఈ టీజర్ ను మీతో పాటు చూస్తున్నప్పుడు నా మనసులో సేమ్ ఫీలింగ్ రిపీట్ అయ్యింది.ఆడిషన్స్ ద్వారా సినిమాల అవకాశాలు పొందాను, నేను నటించిన సినిమాలు చూసి మరో సినిమా ఇచ్చారు. అంతేగానీ నేను ఇప్పటిదాకా ఎవర్నీ సినిమా చేయమని అడగలేదు. అందుకు నా మొహమాటమే కారణం. నా మొహమాటం వదిలిపెట్టి నాతో సినిమా చేయి అని నేను అడిగిన మొదటి వ్యక్తి డైరెక్టర్ అజయ్. మీ అందరికీ మీ సమవర్తి దక్కాలని కోరుకుంటున్నా.మా మూవీలో నటించిన శ్రీకాంత్ అన్నకు స్పెషల్ థ్యాంక్స్ అన్నారు.

### ఆసియా గేమ్స్: మహిళల టి-20లో

# భారత్ భారీ విజయం

### 114 రన్స్ తేడాతో బంగ్లాదేశ్ ఓటమి

**నిస్షిన్ (జపాన్):** ఆసియా గేమ్స్ 2026లో భారత మహిళల క్రికెట్ జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. బంగ్లాదేశ్‌తో ఆదివారం కొరోగే స్పోర్ట్స్ పార్క్‌లో జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు 114 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. ఈ గెలుపుతో ఫైనల్ చేరిన భారత్‌పతకం ఖాయం చేసుకుంది. ఈమ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 195 పరుగులు చేసింది. షెఫాలీ వర్మ(49 బంతుల్లో 3 ఫోర్లు, 9 సిక్స్‌లతో 100 నాటౌట్) విధ్వంసకరశతకంతో చెలరేగగా.. హర్మన్‌ప్రీత్ కౌర్(33 బంతుల్లో 6 ఫోర్లతో 40) మెరుగైన ప్రదర్శన కనబర్చింది. బంగ్లాదేశ్ బౌలర్లలో మరుఫా అక్తర్, సంజిదా అక్తర్, రబేయా ఖాన్, నహిదా అక్తర్ తలో వికెట్ తీసారు. అనంతరం బంగ్లాదేశ్ 15.4 ఓవర్లలో 81 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజాయాన్ని మూటగట్టుకుంది. దిలార అక్తర్(23 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 27) టాప్ స్కోరర్‌గా నిలవగా, మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. 8 మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. భారత బౌలర్లలో నందని శర్మ(3/25), దీప్తి శర్మ(3/7) మూడేసి వికెట్లతో బంగ్లా పతనాన్ని శాసించగా, శ్రీచరణి(2/7) రెండు వికెట్లు పడగొట్టింది. క్రాంతి గాడ్, శ్రేయాంక పాటిల్ తలో వికెట్ తీసారు. మంగళవారం జరిగే ఫైనల్లో శ్రీలంకతో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే స్వర్ణం లేకుంటే రజతం భారత్‌కు దక్కుతుంది. డిఫెండింగ్ ఛాంపియన్ అయిన భారత్ హాట్ ఫేవరేట్‌గా ఈ ఫైనల్ బరిలోకి దిగనుంది. ఇటీవలే ముగిసిన ఆసియా కప్ 2026 ఫైనల్లో శ్రీలంకను భారత్ చిత్తు చేసింది. మరోసారి అదే ఫలితాన్ని పునరావృతం చేయాలనే పట్టుదలతో భారత్ ఉంది.





# ఆసియా క్రీడలు: పాక్ ఓటమి

### శ్రీలంక మహిళల జట్టు ఫైనల్‌కు




**నిస్షిన్:** కొరోగి స్పోర్ట్స్ పార్క్‌లో ఆదివారం పాకిస్తాన్ నిర్దేశించిన 177/4 పరుగుల లక్ష్యాన్ని ఎనిమిది వికెట్ల తేడాతో ఛేదించి, కెప్టెన్‌గా చమరి అథపత్తు కనబరిచిన అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఆసియా క్రీడల శ్రీలంక మహిళల జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. విజయం కోసం 178 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే లక్ష్యంతో శ్రీలంక కేవలం 17.5 ఓవర్లలోనే 178/2 స్కోరును నమోదు చేసింది. అథపట్టు 50 బంతుల్లో 83 పరుగులతో నాటౌట్‌గా నిలిచింది. ఇమేషా దులానీ 21 బంతుల్లో 26 పరుగులు చేయడంతో శ్రీలంక సానుకూలంగా ప్రారంభించగా, పాకిస్తాన్ కెప్టెన్ ఫాతిమా సనా బ్రేక్‌త్రూ అందించింది. అయితే, దులానీ అవుటైనప్పటికీ శ్రీలంక జోరు కొనసాగింపులో భాగంగా అథపత్తు బాధ్యత తీసుకుని, హాసిని పెరేరాతో కలిసి రెండో వికెట్‌కు కీలకమైన 95 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. శ్రీలంక లక్ష్యానికి చేరువలో ఉన్న సమయంలో పెరేరా 42 పరుగులు చేసి అవుటయింది. ఆ తర్వాత హర్షిత సమరవిక్రమ, అథపత్తుతో జతకలిసి 17 పరుగులతో నాటౌట్‌గా నిలిచి, 13 బంతులు మిగిలి ఉండగానే శ్రీలంకను విజయతీరానికి చేర్చింది. తడి అవుట్‌ఫీల్డ్ కారణంగా ఆలస్యంగా ప్రారంభమైన ఆటను శ్రీలంక బౌలింగ్‌గా ఎంచుకోవడంతో, తొలి బంతికే గుల్ ఫిరోజా అవుటవడంతో పేలవమైన ఆరంభం నుండి పాకిస్థాన్ అంతకుముందు కోలుకుంది. ఆ తర్వాత అయేషా జఫర్, షవాల్ జుల్ఫికర్ పాకిస్థాన్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. జఫర్ 40 బంతుల్లో తొమ్మిది ఫోర్లు, రెండు సిక్సర్లతో 71 పరుగులు చేయగా, జుల్ఫికర్ 50 బంతుల్లో 54 పరుగులు సాధించడంతో వారి భాగస్వామ్యం పాకిస్థాన్‌ను 100 పరుగుల మార్కును దాటించడంలో సహాయపడింది. ఆ తర్వాత ఆ జట్టు 20 ఓవర్లలో 177/4 స్కోరుతో ముగించింది.




ఆట

### ఆసియా క్రీడలు హాకీలో..

# భారత్ గెలుపు

### 13-1తో ఇండోనేసియా ఓటమి

**నగోయా:** పూల్ ఎ ఆరంభ పోరులో ఇండోనేషియాను 13-1 తేడాతో చిత్తుగా ఓడించి, భారత్ తన ఆసియా క్రీడల పురుషుల హాకీ టైటిల్ లక్ష్యంగా ప్రారంభించింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో దిల్‌ప్రీత్ సింగ్ నాలుగు గోల్స్‌తో అత్యధిక స్కోరర్‌గా నిలిచాడు. ఆరో నిమిషంలో హర్మన్‌ప్రీత్ సింగ్ చేసిన డ్రాగ్‌ఫ్లిక్‌ను శిలానంద్ లక్రా గోల్‌గా మలచడంతో భారత్ అద్భుతమైన ఆరంభాన్ని అందుకుంది. ఆ తర్వాత (12వ నిమిషంలో), ఇండోనేషియా గోల్ కీపర్ ఆలం ఫజర్ అడ్డుకోగా, రీబౌండ్‌ను గోల్‌గా మలచి అభిషేక్ ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. మన్‌దీప్ సింగ్‌ను నిలువరించడానికి ఫజర్ ఆరంభంలో రెండు సేవ్‌లు చేసినప్పటికీ, భారత్ తొలి క్వార్టర్‌ను 2-0 ఆధిక్యంతో ముగించింది. రెండవ క్వార్టర్ భారత్‌కు గోల్స్ వర్షం కురిపించింది. 18వ, 19వ నిమిషాల్లో దిల్‌ప్రీత్ సింగ్ రెండు నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ చేయగా, (19వ) రాజిందర్ సింగ్ మరో గోల్ జోడించాడు. అనంతరం (21వ) మన్‌దీప్ సింగ్ ఈ టోర్నమెంట్‌లో తన ఖాతాను తెరిచాడు. హర్మన్‌ప్రీత్ (28వ) పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చడంతో భారత్ 7-0 భారీ ఆధిక్యానికి చేరింది. మూడవ క్వార్టర్ (33వ)లో కెప్టెన్ ఔలియా అల్ అర్ధ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచడంతో ఇండోనేషియా ఒక గోల్‌ను తిరిగి సాధించింది. దీంతో (35వ) శిలానంద్ లక్రా తన రెండవ గోల్, (38వ) సుఖ్‌జీత్ సింగ్ గోల్స్ చేయడంతో మూడవ క్వార్టర్ ముగిసేసరికి భారత్ 10-1 ఆధిక్యంలో నిలిచింది. ఆఖరి క్వార్టర్‌లో సుఖ్‌జీత్ (48వ) తన రెండవ గోల్ సాధించాడు. దిల్‌ప్రీత్ (49వ) తన నాలుగవ గోల్‌ను పూర్తి చేసి, భారత్ ఆధిక్యాన్ని 13-1కి చేర్చి ఆటను పూర్తి చేశాడు.

# బ్యాడ్మింటన్‌లో క్వార్టర్స్‌కు భారత్

### ఆసియా క్రీడల్లో కజకిస్థాన్ 3-0తో పరాజయం

**నగోయా:** ఐచినగోయా ఆసియా క్రీడల మహిళల బ్యాడ్మింటన్ టీమ్ ఈవెంట్‌లో, భారత్ తక్కువ ర్యాంకులో ఉన్న కజకిస్థాన్‌ను 3-0 తేడాతో సునాయాసంగా ఓడించి, ఆతిథ్య జపాన్‌తో కఠినమైన క్వార్టర్ ఫైనల్‌కు సిద్ధమైంది. నగోయాలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత ప్లేయర్ పివి సింధు, ఉన్నతి హుడా, తన్వి శర్మ ఒక్క గేమ్ కూడా కోల్పోకుండా సునాయాసంగా క్లీన్ స్వీప్ పూర్తి చేశారు. ప్రపంచ ర్యాంకింగ్‌లో 11వ స్థానంలో ఉన్న సింధు, తొలి రబ్బర్‌లో కమీలా స్మగులోవాను 21-7, 21-9 తేడాతో ఓడించడానికి 24 నిమిషాలు తీసుకుంది. ప్రపంచ 24వ ర్యాంకర్ ఉన్నతి, ఆ తర్వాత 22 నిమిషాల్లో అలిస్సా కులేషోవాను 21-7, 21-10 తేడాతో సునాయాసంగా ఓడించగా, ప్రపంచ




26వ ర్యాంకర్ తన్వి శర్మ, దయానా నమెనోవాను 21-5, 21-10 తేడాతో ఓడించి టైని ముగించింది. అలాగే, భారత మహిళల డబుల్స్ జోడీ ట్రీసా జాలీ, గాయత్రి గోపీచంద్‌లు జపాన్‌కు చెందిన ప్రపంచ నంబర్ 3 జోడీ యూకీ ఫుకుషిమా, మాయు మత్సుమోటోలను ఎదుర్కోవచ్చు. ఇది కూడా చదవండి ఖిబహుశా నా చివరి ఆసియా క్రీడలుఖి: స్వర్ణంపై భారత్ కన్నేసిన నేపథ్యంలో ఎల్‌ఏ 2028కి ప్రణయ్ తలుపులు తెరిచే ఉంచారు భారత అగ్రశ్రేణి షట్లర్ సింధు ఆశాభావంతో ఉన్నారు. "మాది మంచి జట్టు, జపాన్ కూడా మంచి, బలమైన జట్టు, కాబట్టి ఇది చాలా కఠినంగా ఉండబోతోంది," అని భారత డబుల్ ఒలింపిక్ పతక విజేత అన్నారు. ప్రతి మ్యాచ్ ముఖ్యమైనదే, ఇది ఒక మంచి మ్యాచ్ కాబోతోంది, కాబట్టి అంతా మంచే జరగాలని ఆశిస్తున్నాను, మనం గెలవాలని కోరుకుంటున్నాను. తన నాలుగో ఆసియా క్రీడలలో పాల్గొంటున్న, జట్టు కాంస్యం మరియు వ్యక్తిగత రజతం సాధించిన 31 ఏళ్ల సింధు, నాయకత్వ పాత్రను కూడా పోషిస్తోంది. "చాలా మంది అమ్మాయిలు ఆసియా క్రీడల్లో తొలిసారిగా ఆడుతున్నారు, అందుకే నేను దీనిని బాధ్యతాయుతంగా తీసుకుంటున్నాను," అని సింధు అన్నారు. వారిలో ఏది మంచిదో, వారు చేస్తున్న తప్పులు ఏమిటో, లేదా వారు ఎలా ఆడుతున్నారో నేను వారికి చెబుతాను. వారికి ఎల్లప్పుడూ మార్గనిర్దేశం చేయడం మంచిది. ఒక అనుభవజ్ఞుడైన ఆటగాడిగా, అది నా బాధ్యత అని నేను భావిస్తాను. ఇంకా చదవండి లక్ష్య, ఆయుష్ మనకు మంచి ఆరంభం ఇవ్వాలి: విమల్ కుమార్ ఒకవేళ భారత్ క్వార్టర్ ఫైనల్ అడ్డంకిని దాటితే, ప్రపంచ నంబర్ 1 ఆన్ సేయంగ్, అలాగే ప్రపంచ ఛాంపియన్ డబుల్స్ జోడీ అయిన బేక్ హా నా మరియు లీ సో హీ ఉన్న దక్షిణ కొరియాతో సెమీఫైనల్ ఆడే అవకాశం ఉంటుంది. ఆసియా క్రీడల్లో భారతదేశానికి ఏకైక మహిళల జట్టు పతకం 2014లో ఇంచియాన్‌లో లభించింది. అప్పుడు సైనా నెహ్వాల్, సింధు మరియు అశ్విని పొన్నప్పసిక్కి రెడ్డిల జోడి సహాయంతో భారత్ ఒక ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో థాయిలాండ్‌ను 32 తేడాతో ఓడించి, సెమీఫైనల్స్‌లో దక్షిణ కొరియా చేతిలో 13 తేడాతో ఓడిపోయింది.

## ఆసియా క్రీడల్లో.. ఎయిర్ రైఫిల్‌లో ఎలవెనిల్‌కు రజతం



**నగోయా:** ఐచినాగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడలలో భారత షూటర్ ఎలవెనిల్ వలరివాన్ అద్భుతమైన ప్రదర్శనతో సత్తా చాటింది. ఆదివారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత ఫైనల్ పోరులో అరుదైన పతకం సాధించినప్పటికీ, అతి తక్కువ తేడాతో స్వర్ణ పతకాన్ని కోల్పోయి రజతంతో సరిపెట్టుకుంది. ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత ఫైనల్స్‌లో హోరాహోరీగా సాగిన పోరులో ఆమె మొత్తం 252.4 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచింది. పతకం పోరు ఆద్యంతం అగ్రస్థానం కోసం గట్టి పోటీనిచ్చిన ఆమె, కేవలం 0.6 పాయింట్ల తేడాతో స్వర్ణ పతకాన్ని చేజార్చుకుంది. ఈ ఈవెంట్లో జపాన్ దేశానికి చెందిన తైచి హినాతా 253.0 పాయింట్లతో స్వర్గ పతకాన్ని కైవసం చేసుకోగా, దక్షిణ కొరియా షూటర్ బాన్ హ్యోజిన్ 230.4 పాయింట్లతో కాంస్య పతకాన్ని దక్కించుకున్నారు. ఇప్పటికే ఈ టోర్నమెంట్‌లో సోనమ్ మస్కార్, విదర్భ వినోద్ తదితరులతో కలిసి జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలోనూ ఎలవెనిల్ రజత పతకం సాధించారు. ఆ పోటీలో భారత త్రయం మొత్తం 1898 పాయింట్లు సాధించి చైనా తర్వాత రెండో స్థానంలో నిలిచింది.

### చమురు ధరలు, పశ్చిమాసియా

# వార్ పైనే మార్కెట్ల ఫోకస్



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 20:** ఈ వారం భారత స్టాక్ మార్కెట్ల కదలికలకు ప్రధానంగా ముడి చమురు ధరలు, పశ్చిమాసియాలో పరిణామాలు దిశానిర్దేశం చేయనున్నాయి. అదే సమయంలో అమెరికా వాణిజ్య,ఆంక్షల విధానాల ప్రభావం, ప్రపంచ బాండ్ ఈల్డ్స్‌లో మార్పులు, విదేశీ పెట్టుబడుల ఉపసంహారణ వంటి అంశాలను కూడా ఇన్వెస్టర్లు నిశితంగా పరిశీలించనున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లిండ్సే ఓ. గ్రాహమ్ శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026పై సంతకం చేయడంతో మార్కెట్లలో కొత్త అనిశ్చితి నెలకొంది. రష్యా నుంచి భారత్ భారీగా ముడి చమురు దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో ఈ చట్టం ప్రభావం భారత్‌పై పడే అవకాశం ఉంది. రష్యా ఇంధనాన్ని కొనుగోలు చేసే దేశాలపై, భారత్, చైనాతో సహా, గరిష్ఠంగా 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారం అమెరికా అధ్యక్షుడికి ఈ చట్టం కల్పిస్తుంది. ఎన్‌రిచ్ మనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పొన్ముడి ఆర్. మాట్లాడుతూ, ముడి చమురు, ప్రపంచ బాండ్ రాబడులు, భౌగోళికరాజకీయ పరిణామాలు రానున్న వారంలో భారత ఈక్విటీ మార్కెట్లపై ప్రధాన ప్రభావం చూపే అవకాశముంది. రెలిగేర్ బ్రోకింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ రీసెర్చ్ అజిత్ మిశ్రా మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా అమెరికాఇరాన్ ఉద్రిక్తతలపై వచ్చే పరిణామాలు, ముడి చమురు ధరల కదలిక, అమెరికా ట్రెజరీ ఈల్డ్స్ మార్కెట్‌కు కీలకమైన అంశాలుగా కొనసాగుతాయన్నారు. సెప్టెంబర్‌లో ఇప్పటివరకు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు భారత ఈక్విటీల నుంచి రూ.20,974 కోట్లు ఉపసంహారించుకున్నారు. ముడి చమురు ధరలు పెరగడం, అమెరికాలో అధిక వడ్డీ రేట్లు, బాండ్ ఈల్డ్స్ పెరగడం, ప్రపంచవ్యాప్తంగా నెల కొన్న అనిశ్చితి ఇందుకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. గత వారం బిఎస్ఇ సెన్సెక్స్ 486.8 పాయింట్లు (0.65 శాతం) నష్టపోగా, ఎన్ఎస్ఇ నిఫ్టీ 51.7 పాయింట్లు (0.22 శాతం) పడిపోయింది.ఇక భారత్, అమెరికా, యూరోజోన్‌ల పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ గణాంకాలతో పాటు అమెరికా కార్మిక మార్కెట్‌కు సంబంధించిన సూచీలను కూడా ఇన్వెస్టర్లు గమనించనున్నారు.దేశీయంగా సెప్టెంబర్ 24న ఎన్ఎస్ఈ షేర్ల మార్కెట్ అరంగేట్రంపై ప్రధానంగా దృష్టి ఉండనుంది.

### గ్లోబల్‌ఫండ్ మార్కెట్లకు ఇన్వెస్కోఫండ్

# మూడు కొత్త ఎన్ఎఫ్ఒలు




**ముంబయి, సెప్టెంబరు 20:** గ్లోబల్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టాలనుకునే భారతీయ ఇన్వెస్టర్లకు ఇన్వెస్కో మ్యూచువల్ ఫండ్ తీపి కబురు అందించింది. విదేశీ పెట్టుబడుల పరిమితుల కారణంగా నిలిపివేసిన తమ మూడు ఇంటర్నేషనల్ ఫండ్ ఆఫ్ ఫండ్స్ పథకాలలోకి కొత్తగా గంపగుత్తగాను, ఎస్ఐపి పెట్టుబడులను మళ్లీ పునరుద్ధరించింది. అంతర్జాతీయ మార్కెట్లలో వ్యూహాత్మకంగా నిధులు కేటాయించేందుకు ఇన్వెస్టర్లకు అవకాశాన్ని కల్పిస్తూ, ఇన్వెస్కో కొన్ని రోజువారీ పరిమితులు, మార్గదర్శకాలతో ఈ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఇన్వెస్కో మ్యూచువల్ ఫండ్ కింద మూడు అంతర్జాతీయ పథకాలలోకి నిధుల స్వీకరణను తిరిగి ప్రారంభించారు. అందులో మొదటిది ఇన్వెస్కో ఇండియా ఇన్వెస్కో గ్లోబల్ కన్స్యూమర్ ట్రెండ్స్ ఫండ్ ఆఫ్ ఫండ్. గ్లోబల్ టెక్నాలజీ, ఇకామర్స్, వినియోగదారుల ట్రెండ్స్ ఆధారిత కంపెనీలలో పెట్టుబడి పెడుతుంది. ఇన్వెస్కో ఇండియా ఇన్వెస్కో ఈక్యూక్యూక్యూ నాస్‌డాక్ 100 ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్. నాస్‌డాక్ 100 ఇండెక్స్ కంపెనీలలో ప్యాసివ్ పద్ధతిలో పెట్టుబడులు పెడుతుంది. మూడోది ఇన్వెస్కో ఇండియా ఇన్వెస్కో గ్లోబల్ ఈక్విటీ ఇన్‌కమ్ ఫండ్ ఆఫ్ ఫండ్. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దిగ్గజ డివిడెండ్ ఇచ్చే, ఈక్విటీ కంపెనీలలో పెట్టుబడులు పెడుతుంది. ఒక్కో పాన్ నంబర్‌పై ఒక రోజుకు గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు మాత్రమే లంప్ సమ్ పెట్టుబడి పెట్టడానికి అనుమతిస్తున్నారు. ఇక సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ సిప్, సిస్టమాటిక్ ట్రాన్స్‌ఫర్ ప్లాన్ ఎస్టీపీ ద్వారా కూడా కొత్త రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పిస్తున్నారు. ఆన్‌లైన్ పోర్టల్స్, డిస్ట్రిబ్యూటర్లు, ఇతర అసెట్ మేనేజ్మెంట్ డిజిటల్ ప్లాట్ ఫామ్‌ల ద్వారా ఈ అప్లికేషన్లు సమర్పించవచ్చు.

# 19 ఐపిఒలు, రూ.4169 కోట్లు సమీకరణ

**ముంబయి, సెప్టెంబరు 20:** దేశీయ స్టాక్ మార్కెట్ ప్రైమరీ విభాగం ఈ వారం కొత్త ఐపిఒల సబ్‌స్క్రిప్షన్లు, లిస్టింగులతో అత్యంత సందడిగా మారనుంది. మార్కెట్ నుంచి రూ.4,169 కోట్లకు పైగా నిధులను సేకరించే లక్ష్యంగా ఏకంగా 19 కొత్త ఇష్యూలు అందుబాటులోకి వస్తున్నాయి. ఇందులో ప్రధాన మెయిన్‌బోర్డ్ విభాగంతో పాటు భారీ సంఖ్యలో ఎస్ఎంఇ ఇష్యూలు సబ్‌స్క్రిప్షన్ కోసం సిద్ధమవ్వగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సహా బిఎస్ఇలో 12 కొత్త కంపెనీల షేర్లు లిస్ట్ అవుతున్నాయి. సబ్‌స్క్రిప్షన్ తెరుచుకోనున్న ఇష్యూలలో ప్రధానంగా మెయిన్‌బోర్డ్ ఐపిఒలు, వేగంగా విస్తరిస్తున్న ఎస్ఎంఇ విభాగం కంపెనీలు ఉన్నాయి. ఈ వారం ప్రారంభమయ్యే 19 ఐపిఒలలో మెజారిటీ వాటా ఎస్ఎంఇ కంపెనీలదే. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఇన్వెస్టర్ల నుంచి పెరుగుతున్న ఆదరణను ఇది సూచిస్తోంది. ఆరు మెయిన్ బోర్డు ఐపిఒలు మొత్తంగా రూ.3,824.61 కోట్లు సమీకరించనున్నాయి. ఈ వారం అతిపెద్ద ఐపిఒగా ఎలెవేట్ కాంపసెస్ నిలుస్తోంది. మార్కెట్ నుంచి రూ.2100 కోట్లు సమీకరించనుంది. ఈ ఐపిఒ సబ్‌స్క్రిప్షన్ ఈనెల23వ తేదీన ప్రారంభమై 25తో ముగియనుంది. రూ.343 362ధరగా నిర్ణయించారు. ఇక వార్మోర గ్రానైటో కంపెనీ ఐపిఒ రూ.708.02 కోట్లను సమీకరించనుంది.




ఈ ఐపిఒ సబ్‌స్క్రిప్షన్ 22వ తేదీన ప్రారంభమై 24న ముగుస్తుంది. ఒక్కో షేరు ధర రూ.140 నుంచి రూ.148గా నిర్ణయించారు. తాజా షేర్ల ద్వారా రూ.320 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.388.02 కోట్ల షేర్లను విక్రయిస్తోంది. ఏవన్ స్టీల్స్ ఇండియా కంపెనీ మార్కెట్ నుంచి రూ.405 కోట్లు సమీకరించనుంది. 24న నుంచి 28 వరకు కొనసాగనుంది. ప్రైస్‌బ్యాండ్ రూ.385 - 405గా నిర్ణయించారు. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.355 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.50 కోట్ల షేర్లను విక్రయిస్తోంది. ఏఆర్‌మీ ఇన్ఫోటెక్ కంపెనీ పబ్లిక్ ఇష్యూ 23వ తేదీన మొదలై 25వ తేదీ వరకు కొనసాగనుంది. రూ.300 కోట్లు సమీకరించేందుకు ఐపిఒ షేరు ధరలు రూ.350-375గా నిర్ణయించారు. స్వస్తిక ఇన్‌ఫ్రా కంపెనీ ఐపిఒ 23న మొదలై 25 వరకు కొనసాగనుంది. ప్రైస్ బ్యాండ్ రూ.175-185గా రూ.161 కోట్లు సమీకరించనుంది. అడ్రోయిట్ ఇండస్ట్రీస్ కంపెనీ ఐపిఒ 23వతేదీన ప్రారంభమై 25వరకు కొనసాగుతుంది. రూ.150.71 కోట్లు సమీకరించనుంది. షేరు ధరలు రూ.126-134 కోట్లుగా నిర్ణయించారు. వివేకానంద్ కాట్‌స్పిన్, ఎఫ్ఎక్స్ మల్టీటెక్, రోబోకిడ్జ్ ఎడువెంచర్స్ 21న ప్రారంభం కానున్నాయి. హిమాలయ న్యూట్రావెడిక్స్, ఆనంద్ సీమ్‌లెస్ 22న ప్రారంభం కానున్నాయి. 23న కోరింటెగ్రా కన్సల్టింగ్, సాయి ఉర్జాఇండో వెంచర్స్, పూజా లాజిస్టిక్స్, లిక్విడ్ డిజిటల్ ఇండియా, ఎస్.కె. ఆఫ్సెట్, యునిటెక్ ఫైబర్స్ వంటి మరి కొన్ని ఐపిఒ ఇష్యూలు ప్రారంభం కానున్నాయి. అలాగే, సెప్టెంబర్ 24న పెష్వా వీట్, 25న బెంచ్ మార్క్ ఇన్ఫోటెక్ సర్వీసెస్ ఇష్యూలున్నాయి. ఈ వారం లిస్టింగ్‌అయ్యే కీలక సంస్థలలో ఎన్ఎస్ఇ ఒకటి. 24న లిస్టింగ్ అవుతోంది. దేశంలోని అతి పెద్ద ఎక్స్ఛేంజ్ చుట్టూ గతంలో ఉన్న హడావిడితో పోలిస్తే లిస్టింగ్ అంచనాలు మందకొడిగా ఉన్నాయని సూచిస్తోంది. రాబోయే ఇతర లిస్టింగ్‌లలో, స్పెక్ట్రాఏ టెక్నాలజీ సొల్యూషన్స్ సుమారు 38 శాతం జీఎంపీని కలిగి ఉంది. ఎస్ఎస్ రిటైల్ సుమారు 34 శాతం జీఎంపీతో కోట్ అవుతోంది. హీరో మోటార్స్ లిస్టింగ్‌కు ముందు నెగటివ్ జీఎంపీతో ట్రేడ్ అవుతోంది.

# రూ.20,974 కోట్లు విత్‌డ్రాచేసుకున్న విదేశీ ఇన్వెస్టర్లు



**ముంబయి, సెప్టెంబరు 20:** భారత ఈక్విటీలలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు సెప్టెంబర్‌లో ఇప్పటివరకు రూ.20,974 కోట్లను ఉపసంహారించుకున్నారు. జూలైలో రూ.20,200 కోట్లు, ఆగస్టులో రూ.29,631 కోట్లను నికరంగా పెట్టుబడి పెట్టిన ఎఫ్‌పీఐలు సెప్టెంబర్‌లో మాత్రం పెట్టుబడుల ఉపసంహారణ చేసారు. వడ్డీ రేట్ల పెంపుతో ఆందోళన ఇటీవల జరిగిన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ సమావేశం ప్రపంచ మార్కెట్లకు ద్రవ్యోల్బణంపై మరోసారి అప్రమత్తత కలిగించింది. కెవిన్ వార్ష్ నేతృత్వంలోని కమిటీ బెంచ్‌మార్క్ పాలసీ వడ్డీ రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 3.75-4 శాతానికి చేర్చింది. మూడేళ్లలో ఇదే తొలి పెంపు. భౌగోళిక రాజకీయ పరిణామాల కారణంగా పెరిగిన ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడింది. వాల్ స్ట్రీట్ అంచనాలకు అనుగుణంగానే రేటు పెంపు జరిగింది. వడ్డీ రేట్ల పెంపు ముందుగానే ఊహించినదే అయినప్పటికీ, అమెరికా ట్రెజరీబాండ్ల రాబడులు రికార్డు స్థాయికి చేరడం పెట్టుబడిదారులను ఆందోళనకు గురిచేసింది. ప్రపంచం లోని అత్యంత కీలకమైన వడ్డీ రేట్లలో ఒకటైన 10 యేళ్ల అమెరికా ట్రెజరీ ఈల్డ్ 5 శాతానికి చేరింది. చమురు ధరలకు రెక్కలుముడి చమురు ధరలు స్వల్ప విరామాలు మినహా వరుసగా పెరుగుతూనే ఉన్నాయి. సెప్టెంబర్‌లో ఎక్కువ భాగం బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 డాలర్లకు పైనే కొనసాగింది. ఈ వివాదం విదేశీ పెట్టుబడిదారు లకు మరింత ఆందోళనకర అంశంగామారింది. ముందుముందు ఎఫ్‌పీఐల పెట్టుబడులు ఎలా ఉండొచ్చు స్వల్ప కాలంలో విదేశీ పెట్టుబడులకు పరిస్థితులు అంతగాఅనుకూలంగా కనిపించడం లేదని పరిశ్రమ నిపుణులు, విశ్లేష కులు చెబుతున్నారు. చాయిస్ వెల్త్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీ ఆఫీసర్ ధీరజ్ గౌర్ మాట్లాడుతూ, స్వల్పకాలంలో విదేశీ పెట్టుబడుల రాక మార్కెట్లకు పెద్దగా ఊతమిస్తాయని ఆశించవద్దని అన్నారు. 24న జరగనున్న ఎన్ఎస్ఈ లిస్టింగ్‌పై పెట్టుబడిదారులు ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారని గౌర్ తెలిపారు. కొత్త డీల్స్‌కు ఎఫ్‌పీఐలు ఇంకా మద్దతు ఇస్తున్నారా లేదా అన్నది ఈ లిస్టింగ్ ద్వారా కొంతవరకు అర్థమయ్యే అవకాశం ఉందనిఅన్నారు.ఇక ట్రేడర్లు గమనించబోయే ఇతర కీలక గణాంకాల్లో సెప్టెంబర్ ఫ్లాష్ పీఎంఐ, మౌలిక వసతుల రంగ ఉత్పత్తి, విదేశీ మారక నిల్వలు ఉన్నాయి.

## మూడురోజుల బ్యాంకు ఉద్యోగుల సమ్మె




**ముంబయి, సెప్టెంబరు 20:** వారానికి ఐదు రోజుల పనిదినాలు సహా ఇతర డిమాండ్ల పరిష్కారం కోసం యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బ్యాంక్ ఉద్యోగ సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయి. వచ్చే వారంలో బ్యాంకులువరుసగా మూడు రోజుల పాటు మూతపడే అవకాశం ఉంది. ఈ క్రమంలో దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ ఎస్‌బిఐ తమ ఖాతాదారులు, కస్టమర్లకు ముఖ్యమైన అడ్వైజరీ జారీ చేసింది. ఈనెల 28, 29, 30 తేదీల్లో మరోసారి దేశవ్యాప్తంగా సమ్మె చేపట్టాలని యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ నిర్ణయించిన విషయాన్ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండయా తమ వినియోగదారులకు గుర్తు చేసింది. ఈ క్రమంలో మూడు రోజులు బ్యాంక్ బ్రాంచ్ సేవలు అందుబాటులో ఉండవని, ఖాతాదారులు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలని కోరింది. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేసింది. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ 28 నుంచి మూడురోజులు సమ్మెచేయాలని ప్రతిపాదించింది. ఈ సమ్మె సమయంలో మా కస్టమర్లకు అత్యవసర బ్యాంకింగ్ సేవలను అందించేందుకుఉన్న అన్ని ప్రయత్నాలు చేపట్టాం. కస్టమర్లు సైతం కొన్ని పాటించాలి. సమ్మె తేదీలకుముందే తమ ముఖ్యమైన బ్యాంకింగ్ లావాదేవీలను పూర్తి చేసుకోవాలి. తమ నగదు అవసరాల కోసం ఎటిఎంలు, ఎడబ్ల్యూఎంలను వినియోగించుకోవాలి. కస్టమర్ సర్వీస్ పాయింట్లను ఉపయోగించాలి. ఇంటర్నెట్ బ్యాంకింగ్, యోనో, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ వంటి ఇతర డిజిటల్ ఛానళ్లతో సేవలు పొందవచ్చు. ఏదైనా సౌకర్యానికి మేము చింతిస్తున్నాము అని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఓపోస్ట్ ద్వారా కస్టమర్లకు కీలక సూచనలు చేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేయడంతో దేశవ్యాప్తంగా బ్యాంక్ కార్యకలాపాలు స్తంభించాయి. అయితే, తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోయినట్లయితే మరోసారి ఈనెల 28, 29, 30 తేదీల్లో సమ్మె చేస్తామని అప్పుడే యూఎఫ్‌బీయూ హెచ్చరించింది. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో 28వ తేదీ నుంచి మరోసారి ఉద్యోగులు సమ్మె చేపట్టాలని ఉద్యోగులు సన్నద్ధమవుతున్నారు. ఆ తర్వాత కూడా ప్రభుత్వం దిగిరాకపోతే అక్టోబర్ 26వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని బ్యాంక్ ఉద్యోగుల యూనియన్లు ఇప్పటికే ప్రకటించాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.